నేటి నుంచి పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు

మన్యంవాసుల ఆరాధ్య దేవత పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ, ఐటీడీఏ యంత్రాంగం ఏర్పాట్లుచేశాయి. -6లో



60 ఎకరాల అన్యాక్రాంతానికి కుట్ర

వివాదాస్పద భూములకు నిరభ్యంతర ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సిందిగా రెవెన్యూ బాస్ ఆదేశాలు

- అవి ప్రభుత్వ భూములని గతంలో ఇచ్చిన నివేదికలకు భిన్నంగా నిర్ణయాలు
- విలువ రూ.వందల కోట్లలో...
- ఆ విషయం ప్రభుత్వానికి తెలియడంతో ఆయనకు స్థానచలనం
- ఉన్నతాధికారి నిర్ణయాలపై సర్కారు ఆరా
- వాటి వెనుక ఎవరు ఉన్నారనే సమాచారం సేకరణ



ముడసర్లోవలోని సర్వే నంబరు 31/2లో ఉన్న భూములు

విశాఖపట్నం/కొమ్మాది/ఆరిలోవ, మే 10 (ఆంధ్రజ్యోతి):

ముడసర్లోవ సర్వే నంబరు 31/2లో సుమారు 20 నుంచి 30 ఎకరాలను చాలాకాలం క్రితం పేదలకు ఇచ్చారు. అయితే అవి రిజర్వాయర్ పరీవాహక ప్రాంతంలో ఉన్నందున రైతులకు ఇచ్చిన పట్టాలు రద్దు చేశారు. ఆ భూముల కోసం ఇటీవల కొందరు దళారులు రంగంలోకి దిగడంతో రెవెన్యూలో ఉన్నతాధికారి ఒకరు ఆగమేఘాలపై రైతులకు అనుకూలంగా నిరభ్యంతర పత్రం ఇవ్వాలని ఆదేశించారు.

గాజువాక మండలం వడ్లపూడి, తుంగ్లాం పరిసరాల్లో సుమారు ఐదు ఎకరాల చెరువులో చేపల పెంపకానికి నాలుగు దశాబ్దాల క్రితం ఒకరికి ప్రభుత్వం పట్టా ఇచ్చింది. కాలక్రమేణా వడ్లపూడి ఉక్కు నిర్వాసితులకు కేటాయించడంతో నివాసాలు ఏర్పడ్డాయి. చేపల పెంపకం నిలిచిపోయింది. అయితే ఆ భూమికి ఇచ్చిన పట్టాను రెగ్యులర్ చేయాలని రైతు కోరితే...జిల్లా యంత్రాంగం తిరస్కరించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చెరువులు, వాగులు క్రమబద్ధీకరించకూడదు. అయితే అదే రెవెన్యూ ఉన్నతాధికారి మాత్రం చేపల చెరువును రెగ్యులర్ చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

విశాఖ జిల్లాలో వందల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను పరాధీనం చేయడానికి రెవెన్యూశాఖలో ఉన్నతాధికారి ఒకరు ఇచ్చిన ఆదేశాలు వివాదాస్పదమయ్యాయి. సుమారు 60 నుంచి 70 ఎకరాలను ప్రైవేటు వ్యక్తులకు క్రమబద్ధీకరించాలంటూ ఆయన ఇచ్చిన ఆదేశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఆరా తీస్తోంది.

పేదలు, మాజీ సైనికుల పేరిట క్లెయిమ్ కోసం వచ్చిన అర్జీలను గతంలో అనేక పర్యాయాలు జిల్లా యంత్రాంగం తిరస్కరించింది. అయినా వాటిని ఆయా వ్యక్తులకు దఖలు పరచాలని సదరు రెవెన్యూ ఉన్నతాధికారి ప్రత్యేకంగా ఉత్తర్వులు ఇచ్చినట్టు జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు తెలిసింది. నిబంధనల మేరకు ఆ భూములు ఎవరికీ రెగ్యులర్ చేయలేమని నివేదికలో పేర్కొంది. విశాఖ నగరానికి ఆనుకుని మండలాల్లో భూముల రేట్లు అనేక రెట్లు పెరిగాయి. ఎకరా రూ.కోట్లలో ఉండడంతో వాటిపై దళారులు, బిల్డర్ల కన్ను పడింది. ప్రధానంగా వివాదాస్పదమైన భూములపై దృష్టిసారించిన దళారులు రంగంలోకి దిగి పట్టాలు పొందిన రైతులు, మాజీ సైనికులు, వారి కుటుంబాలను పట్టుకుని భూముల రెగ్యులైజేషన్ కోసం, నిరభ్యంతర పత్రాలు జారీకి జిల్లా యంత్రాంగానికి అనేక పర్యాయాలు అర్జీలు పెట్టించారు. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లుగా పనిచేసిన పలువురు అటువంటి అర్జీలను తిరస్కరించారు. కొందరు కోర్టులో దాఖలు చేసిన కేసులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. అయితే అత్యంత కీలకమైన రెవెన్యూ శాఖలో ముఖ్య అధికారిగా వచ్చిన సీనియర్ అధికారి మాత్రం జిల్లా యంత్రాంగం గతంలో తిరస్కరించిన ... మిగతా 6వ పేజీలో



కొమ్మాదిలో సర్వేనంబరు 114/1లో ప్రభుత్వ భూమి

ఖాకీల కలెక్షన్

పోలీస్ స్టేషన్లలో వసూళ్ల పర్వం



- సీపీ హెచ్చరికలు బేఖాతరు
- మద్యం దుకాణాలు, బార్‌ల నుంచి నెలవారీలు...
- పిటిషన్ వస్తే పండగే...
- కాసులు ఎవరు ఇస్తే వారికి సపోర్టు
- గుట్టుచప్పుడు కాకుండానే తంతంగం పూర్తి
- మహిళా పోలీస్ స్టేషన్ ఉదంతంతో ఖాకీల అవినీతిపై చర్చ
- చాలా పోలీస్ స్టేషన్లలో అదే పరిస్థితి
- చోద్యంచూస్తున్న స్పెషల్ బ్రాంచి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కొంతమంది పోలీస్ అధికారుల తీరుతో ఆ శాఖ ప్రతిష్ఠ మసకబారుతోంది. న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చేవారికి అండగా నిలవాల్సింది పోయి...స్వప్రయోజనాలే పరమావధిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని స్టేషన్లలో అధికారులే స్వయంగా వసూళ్ల బాధ్యతను పర్యవేక్షిస్తుంటే...మరికొన్ని స్టేషన్లలో ఆ బాధ్యతను ప్రత్యేకంగా సిబ్బందికి అప్పగిస్తున్నారు.

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొందరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లతోపాటు కిందిస్థాయి సిబ్బంది బరితెగించి వ్యవహరిస్తున్నారు. ఎవరైనా స్టేషన్‌కు వస్తే వారికి ఏ విధంగా న్యాయం చేయగలమనే దానిపై కాకుండా, ఆ పిటిషన్‌పై ఎలా వ్యవహరిస్తే తమకు డబ్బులు వస్తాయనే దానిపైనే దృష్టిపెడుతున్నారు. కమిషనరేట్‌లో ఒకటి, రెండు స్టేషన్లలో మినహా మిగిలినచోట్ల పెద్దఎత్తున వసూళ్ల దందా సాగుతోందని ఆ శాఖ సిబ్బందే చెబుతున్నారు. స్టేషన్‌కు వచ్చే పిటిషనర్ల పట్ల గౌరవంగా వ్యవహరించకపోయినా, న్యాయం చేయడంలో తాత్సారం చేసినా, అవినీతికి పాల్పడినా కఠిన చర్యలు తప్పవని సీపీ శంఖబ్రతబాగ్చి ఎప్పటికప్పుడు హెచ్చరిస్తూనే ఉన్నారు. మొదట్లో అందరూ ఎంతో కొంత భయంతో విధులు నిర్వర్తించినప్పటికీ కొంతకాలంగా సీపీ ఆదేశాలను బేఖాతరు చేస్తూ జేబులు నింపుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొన్ని స్టేషన్లలో నేరుగా సీఐ, ఎస్ఐ స్థాయి అధికారులే వసూళ్ల పర్వాన్ని పర్యవేక్షిస్తుంటే, మరికొన్నిచోట్ల నమ్మకమైన ఏఎస్ఐ/హెడ్‌కానిస్టేబుల్/కానిస్టేబుల్‌కు బాధ్యతలు అప్పగిస్తున్నారు. స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్‌ల నుంచి నెలవారీ మామూళ్ల వసూలుకు రెండు నెలల కిందటే శ్రీకారం చుట్టారు. స్టేషన్‌కు వచ్చే సివిల్ కేసులు, కుటుంబ కలహాలు, చీటింగ్ కేసుల్లో బాధితులకు చేయాల్సింది పోయి, తమను ఎవరు ప్రసన్నం చేసుకుంటే వారికి మద్దతుగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మహిళా పోలీస్ స్టేషన్‌లో ఒక అధికారిణి వ్యవహారశైలిపై బాధితురాలు నేరుగా సీపీకి ఫిర్యాదు చేయడంతో పోలీస్ శాఖలో వసూళ్ల అంశం మరోసారి చర్చకు దారితీసింది. తన భర్త కుటుంబాన్ని ... మిగతా 6వ పేజీలో

మామూళ్ల వసూలు ముమ్మాటికీ వాస్తవం

- మద్యం వ్యాపారుల నుంచి ఖాకీల నెలవారీ కలెక్షన్‌పై
- గత నెల 7న 'ఆంధ్రజ్యోతి' కథనం
- ఇంటెలిజెన్స్ విచారణలో నిజమేనని తేలడంతో ప్రభుత్వానికి నివేదిక

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మద్యం దుకాణాలు, బార్‌ల నుంచి పోలీసులు నెలవారీ మామూళ్ల వసూలు చేస్తున్నట్టు నిఘా వర్గాల విచారణలో నిర్ధారణ అయినట్టు తెలిసింది. పోలీసులు తమ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాల నుంచి నెలకు రూ.5,000-8,000, బార్‌ల నుంచి రూ.7,500-10,000 చొప్పున వసూలు చేస్తున్నట్టు గత నెల ఏడో తేదీన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరపాల్సిందిగా స్పెషల్‌బ్రాంచి అధికారులను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి ఆదేశించారు. వారంతా నేరుగా మద్యం దుకాణాల వద్దకు వెళ్లి ఎవరికైనా నెలవారీ మామూళ్లు ఇస్తున్నారా?...అని ప్రశ్నించారు. పోలీసులకు ఇచ్చిన మామూళ్ల గురించి పోలీసులే అడుగుతుండడంతో తమ వ్యాపారానికి ఎక్కడ ఇబ్బంది వస్తుందోననే భయంతో చాలామంది తాము ఎవరికీ ఏమీ ఇవ్వడం లేదని చెప్పారు. మరికొందరు మాత్రం ఆ విషయం తమకు తెలియదని, వేరేవాళ్లు ... మిగతా 6వ పేజీలో

భారత్‌తో పెట్టుకుంటే పాక్ నాశనమే

- ఆ విషయం ఆ దేశానికి కూడా తెలుసు
- పౌరులు, ప్రపంచం ముందు చులకన కాకూడదనే మేకపోతు గాంభీర్యం
- భారత్ డిఫెన్స్ సిస్టమ్ అద్భుతం
- పాక్ ప్రయోగించిన మిస్సైల్స్‌ను నేలకూల్చడమే అందుకు నిదర్శనం
- మన సైన్యాన్ని ఎదుర్కోవడం పాకిస్థాన్‌కు అసాధ్యం
- కరాచీ పోర్టుపై దాడి జరిగితే ఆ దేశం ఇప్పట్లో కోలుకోవడం సాధ్యం కాదు
- **రిటైర్డ్ నేవీ ఉద్యోగి, యుద్ధ సేవా మెడల్, నౌసేనా మెడల్ గ్రహీత కమోడోర్ ఆదిమూలం చిన వెర్రియ్య**



కమోడోర్ ఆదిమూలం చిన వెర్రియ్య

- 1971లో పాకిస్థాన్‌తో యుద్ధ సమయంలో 'ఐఎన్ఎస్ కుఠార్' యుద్ధనౌకలో సిగ్నల్ కమ్యూనికేషన్ ఆఫీసర్‌గా విధుల నిర్వహణ

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత్‌తో పెట్టుకుంటే పాకిస్థాన్ నాశనం కావడం ఖాయమని, ఈ విషయం ఆ దేశానికి కూడా తెలుసునని రిటైర్డ్ నేవీ ఉద్యోగి, యుద్ధ సేవా మెడల్, నౌసేనా మెడల్ గ్రహీత కమోడోర్ ఆదిమూలం చినవెర్రియ్య పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో 1971లో జరిగిన యుద్ధంలో పాల్గొన్న ఆయన...భారత్, పాకిస్థాన్ మధ్య తాజాగా నెలకొన్న పరిస్థితులపై శనివారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. పాకిస్థాన్‌తో పోలిస్తే భారత్ కొన్ని రెట్లు బలంగా ఉందని, ఈ విషయం ఆ దేశానికి కూడా తెలుసునన్నారు. ఆ దేశ ప్రజలు, ప్రపంచం ముందు తాము వెనక్కి తగ్గడం లేదన్న విషయాన్ని చెప్పుకునేందుకు సాధారణ పౌరులపై కాల్పులు, దాడులకు తెగబడు తోందని చినవెర్రియ్య వ్యాఖ్యానించారు. అయితే, భారత్ డిఫెన్స్ సిస్టమ్ అద్భుతంగా పనిచేస్తోందని, దీనివల్ల అనేక మిస్సైల్స్‌ను నేలకూల్చి ప్రజలకు ప్రాణ నష్టం లేకుండా చేయగలిగిందని పేర్కొన్నారు. మరిన్ని ... మిగతా 6వ పేజీలో

అత్యంత బలంగా భారత్

1971తో పోలిస్తే ఇప్పుడు బలమైన ఆయుధ సంపత్తి మన సొంతం. 250 యుద్ధ నౌకలు, బ్రహ్మోస్ క్రూయిజ్ మిస్సైల్స్, అధునాతన యుద్ధ విమానాలు సుఖోయ్ 30, రాఫెల్ వంటివి ఉన్నాయి. ఎయిర్ క్రాఫ్టులు సొంతంగా తయారుచేసుకుంటున్నాం. మిస్సైల్స్‌ను పడగొట్టే రాకెట్స్ తయారు చేశాం. అత్యాధునిక జామర్ వ్యవస్థ ఉంది. జామర్స్ ద్వారా మిస్సైల్ ఫ్రీక్వెన్సీని పట్టుకుని జామ్ చేసే సామర్థ్యం కలిగి ఉన్నాం. సబ్ మెరైన్స్, న్యూక్లియర్ సబ్ మెరైన్స్ ఉన్నాయి. 25 సబ్ మెరైన్‌లు ఉంటే అందులో ఎనిమిది సబ్ మెరైన్‌లు న్యూక్లియర్ వార్ హెడ్స్‌ను రిలీజ్ చేసే సామర్థ్యం కలిగి ఉన్నాయి.

పారిశుధ్య పనులను పరిశీలించిన మేయర్

రాత్రిపూట నగరంలో తనిఖీలు

- ఎటువంటి అలసత్వం, లోపాలు లేకుండా చూడాల్సిందిగా అధికారులకు ఆదేశం



పారిశుధ్య పనులపై అధికారులతో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

వెంకోజీపాలెం, మే 10(ఆంధ్రజ్యోతి): నగరాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచేందుకుగాను రాత్రి పారిశుధ్య కార్మికుల పనితీరును మెరుగుపరచడంపై జీవీఎంసీ ప్రజారోగ్య అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం రాత్రి ఆయన ఆర్కే బీచ్, జగదాంబ జంక్షన్ పరిసరాల్లో రాత్రిపూట చేపడుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. మేయర్ ... మిగతా 6వ పేజీలో

ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు

- అక్కయ్యపాలెం నుంచి ప్రారంభం
- నెలకు 200 యూనిట్లు మించి వినియోగించే వారికి తొలి ప్రాధాన్యం
- బిల్లు ముందుగానే కట్టాల్సి ఉంటుందంటున్న అధికారులు
- ఎప్పటికప్పుడు రీచార్జ్ చేసుకోవాలి



విద్యుత్ స్మార్ట్‌మీటర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ప్రభుత్వం ముందు వీటిని వ్యవసాయ విద్యుత్ వినియోగదారుల కోసమని ప్రకటించింది. ఆ తరువాత ప్రతి వినియోగదారుడికి అందిస్తామని పేర్కొంది. విద్యుత్ బిల్లులు వంద శాతం ముందుగానే వసూలు చేసుకోవడానికి వీటిని తీసుకువచ్చారనేది సుస్పష్టం. అయితే ప్రభుత్వ సంస్థల నుంచే తమకు బిల్లుల ఇబ్బంది ఉంది కాబట్టి ముందుగా ఆ కార్యాలయాలకే మీటర్లు ఏర్పాటుచేస్తామని విశాఖ సర్కిల్ అధికారులు తెలిపారు. జిల్లాలో మూడు వేల ప్రభుత్వ కార్యాలయాలు ఉండగా, గత ఏడాది ఆగస్టులో తొలి స్మార్ట్ మీటర్‌ను సీతమ్మధారలోని ప్రజారోగ్య శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఏర్పాటుచేశారు. ఆ తరువాత వాణిజ్య వినియోగదారులకు బిగిస్తామని, అనంతరం ఎక్కువ విద్యుత్ అంటే నెలకు 200 యూనిట్లు దాటి ఉపయోగించే వారికి ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 17.45 లక్షల మంది విద్యుత్ వినియోగదారులు ఉండగా, విశాఖ సర్కిల్ అధికారులు 1.19 లక్షల స్మార్ట్ మీటర్లు సరిపోతాయని అంచనా వేసుకున్నారు. ఆ మేరకు ఆర్డర్ పెట్టి తెప్పించుకుంటున్నారు. ఈ మీటరు ఒక్కింటికి అన్ని ఖర్చులతోను రూ.6 వేలు పడుతుంది. అయితే వినియోగదారుల నుంచి ఎటువంటి చార్జీలు వసూలు చేయబోమని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ సంస్థలకు స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ దాదాపు పూర్తయిపోయింది. ఆ తరువాత వాణిజ్య వినియోగదారులకు వీటిని ఇస్తున్నారు. ఆ విభాగం కూడా పూర్తయితే ఆ తరువాత ఎక్కువ విద్యుత్ వినియోగించే గృహాలకు ఏర్పాటుచేస్తామని చెబుతున్నారు. అయితే ప్రయోగాత్మకంగా నగరంలోని అక్కయ్యపాలెంలో రెండు రోజుల క్రితం సాధారణ గృహాలకు ఈ స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ ... మిగతా 6వ పేజీలో

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ

- ఇకపై 7 ఏడు రకాలు
- ఉమ్మడి జిల్లాలో మొత్తం 3,158 పాఠశాలలు, పూర్తయిన కసరత్తు...
- ప్రభుత్వానికి నివేదిక
- నేడే, రేపో అధికారికంగా ఉత్తర్వులు

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 117ను ఇటీవల కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నేపథ్యంలో ఐదు రకాల పాఠశాలలను ఏర్పాటు చేయాలని తొలుత భావించిన విద్యా శాఖ... తాజాగా తొమ్మిదిగా విభజించాలని నిర్ణయించింది. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎక్కడ కూడా ప్రాథమిక పాఠశాలలు మూసివేయనందున శాటిలైట్ పాఠశాలల ఏర్పాటు అవసరం పడలేదు. దీంతో మిగిలిన జిల్లాలకు భిన్నంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో మాత్రం ఏడు రకాల పాఠశాలలు మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు. అవి...ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక, మోడల్ ప్రాథమిక పాఠశాలలు, యూపీ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకూ ఉన్న 3,158 పాఠశాలలను ఏడు రకాలుగా మార్పు చేస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీని ప్రకారం 228 ఫౌండేషన్ పాఠశాలలు, 1,921 బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 563 మోడల్ ప్రాథమిక పాఠశాలలు, 89 యూపీ పాఠశాలలు, 237 ఉన్నత పాఠశాలలు, 88 ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 32 ఉన్నత పాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఉంటాయి. వీటికి సంబంధించి ఒకటి, రెండు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు వెలువడనున్నాయి. కొత్తగా అమలులోకి రానున్న విధానం ప్రకారం అనకాపల్లి జిల్లాలో 1,396, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,200, విశాఖపట్నం జిల్లాలో 562 పాఠశాలలు ఉంటాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 36 ఫౌండేషన్, 925 బేసిక్ ప్రాథమిక, 199 మోడల్ ప్రాథమిక, 13 యూపీ, 16 ఉన్నత, 4 ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 9 ఉన్నత పాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఉంటాయి. అలాగే అనకాపల్లి జిల్లాలో 151 ఫౌండేషన్,764 బేసిక్ ప్రాథమిక, 187 మోడల్ ప్రాథమిక, 55 యూపీ, 145 ఉన్నత పాఠశాలలు, 78 ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలు,18 ఉన్నతపాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఉంటాయి. అలాగే విశాఖపట్నం జిల్లాలో 41 ఫౌండేషన్, 232 బేసిక్ ప్రాథమిక, 178 మోడల్ ప్రాథమిక, 21 యూపీ, 76 ఉన్నత పాఠశాలలు, 10 ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 5 ఉన్నతపాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమికపాఠశాలలు ఉంటాయి.

ఏప్రిల్‌లో పెరిగిన విమానయానం



విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): గత ఏడాదితో పోల్చుకుంటే విశాఖపట్నం విమానాశ్రయం నుంచి ఈ ఏడాది ఏప్రిల్‌లో విమానాల సంఖ్య, దానికి తగ్గట్టుగానే ప్రయాణికుల సంఖ్య పెరిగాయి. విమానాలు 7.32 శాతం పెరగ్గా, ప్రయాణికులు 11.58 శాతం పెరిగారు. 2024 ఏప్రిల్‌లో 1,776 విమానాలు రాకపోకలు సాగించగా, ఈ ఏప్రిల్‌లో వాటి సంఖ్య 130 పెరిగి 1,906కు చేరింది. అలాగే గత ఏప్రిల్‌లో ప్రయాణికుల సంఖ్య 2,19,265 మంది కాగా ఈ ఏప్రిల్‌లో 2,44,665 మంది ప్రయాణించారు. 25,400 మంది పెరిగారు. అంతర్జాతీయ విమాన సర్వీసులు విషయానికి వచ్చేసరికి గత ఏప్రిల్‌లో 58 రాకపోకలు సాగించగా, ఈ ఏప్రిల్‌లో వాటి సంఖ్య 86కు పెరిగింది. అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య గత ఏప్రిల్‌లో 8,009 కాగా ఈ ఏప్రిల్‌లో 9,801 మంది ప్రయాణించారని ఏపీ విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు కుమార్‌రాజా, నరేశ్‌కుమార్, డీఎస్ వర్మలు తెలిపారు. విశాఖ నుంచి మరిన్ని దేశీయ, అంతర్జాతీయ విమానాలు నడపడానికి సహకరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్యులపై ఫిర్యాదు

తగరపువలస, మే 10 (ఆంధ్రజ్యోతి) : సంగివలస వద్ద ఉన్న ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి వైద్యులపై దివీస్ ఉద్యోగి ఎర్రంశెట్టి జనార్దన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం.. రేలు గుంట మండలం కొవ్వూరు గ్రామానికి చెందిన జనార్దన్ ఉద్యోగ రీత్యా మూడేళ్లుగా తగరపువలసలో ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం అతని భార్య రేవతి (24) బాత్ రూమ్‌లో జారిపడడంతో కుడి చెయ్యి విరిగింది. వెంటనే ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో చేర్చారు. శనివారం ఆమె కోమాలోకి వెళ్లింది. వైద్యం వికటించడం వల్లే తన భార్య కోమాలోకి వెళ్లిందని జనార్దన్ ఆరోపిస్తున్నారు. మంగళవారం ఉదయం ఆస్పత్రికి తీసుకువచ్చామని, తనకు హెల్త్ కార్డు ఉందని, అనుమతి కోసం రెండు రోజులు వరకు వేచి చూశానన్నారు. ఆపరేషన్ కోసం మత్తు మందు ఇచ్చిన తరువాత సీరియస్ అయినట్టు తెలిపారు. ఈమేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈవిషయమై 'ఆంధ్రజ్యోతి' ఆస్పత్రి వర్గాలను సంప్రతించగా బీపీ డౌన్ అయిపోవడం వల్ల ఈవిధంగా జరిగిందన్నారు. పోలీసులు ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. అలాగే వైద్యుల నుంచి కూడా వివరాలు తీసుకున్నారు.

గీతం ఆస్పత్రికి ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు

ఎండాడ, మే 10 (ఆంధ్రజ్యోతి) : గీతం ఆస్పత్రికి జాతీయస్థాయిలో నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఆఫ్ హాస్పటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ఎన్‌ఏబీహెచ్) గుర్తింపు లభించిందని జిమ్సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి తెలిపారు. శనివారం ఆమె జిమ్సర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అత్యుత్తమ ప్రమాణాలతో సామాన్యులకు వైద్య సేవలందించడం, ఆస్పత్రి నిర్వహణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు చెందిన ఎన్‌ఏబీహెచ్ ఈ సర్టిఫికెట్ మంజూరు చేసిందని చెప్పారు. ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు వెనుక వైద్య నిపుణులు, పారా మెడికల్ సిబ్బంది కృషి ఉందన్నారు. సమావేశంలో ఆమెతో పాటు జిమ్సర్ అక్రిడిటేషన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కృష్ణ కార్తీక్ భోగవల్లి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీవీ నరసింహారావు, ఎన్‌ఏబీహెచ్ గీతం పర్యవేక్షకురాలు డాక్టర్ ప్రభావతి ఉన్నారు.

18న జాబ్‌మేళా

ఎండాడ, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఎండాడలో డాక్టర్ అంబేడ్కర్ పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యాక్ట్ డిగ్రీ కళాశాలలో జేసీఐ సహకారాలతో ఈనెల 18న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ఛైర్మన్ బి. రాజారావు, సెక్రటరీ జేవీ ప్రభాకర్ తెలిపారు. శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. జాబ్ మేళాకు 20 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. పద్మారావును కలిసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

'స్థల వివాదంపై స్పందించాలి'

కొమ్మాది, మే 10 (ఆంధ్రజ్యోతి) : తాము ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇంటికి కొంతమంది వచ్చి తీవ్రస్థాయిలో బెదిరిస్తున్నారని ఆరో వార్డులోని పీఎంపాలెంకు చెందిన టీడీపీ నాయకురాలు షేక్ జహనారా ఆరోపించారు. శనివారం ఆమె తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెదిరింపులకు దిగుతున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు.ఎంతో కాలం నుంచి తాము అదే ఇంట్లో నివాసం ఉంటున్నామని, ఇంటి పత్రాలు కూడా తమ వద్ద ఉన్నాయని చెప్పారు. కానీ కొన్ని రోజులుగా ఒక వ్యక్తి ఆ స్థలం తనదంటూ ఇంటిపై దాడికి వస్తున్నారన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని ఆమె కోరారు.

నేడు నరసింహస్వామి జయంత్యుత్సవం

భీమునిపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం నరసింహుని జయంత్యుత్సవం నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ప్రధానార్చకుడు రొంపిచర్ల సింగరాచార్యులు తెలిపారు. తొలుత స్వామివారికి విశ్వక్సేన, పుణ్యాహవచనం, పంచ్రదవ్యారాధన, కలశారాధన, నవగ్రహ మండపారాధన చేసి, అభిషేకాలు చేస్తారు.

మామూళ్ల వసూలు ముమ్మాటికీ వాస్తవం

... 5వ పేజీ తరువాయి

చూసుకుంటున్నారని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే ఇంటెలిజెన్స్ వర్గాలు మాత్రం దీనిపై లోతుగా విచారణ జరిపినట్టు సమాచారం. వారంతా సాధారణ వ్యక్తుల్లా మద్యం వ్యాపారులతో మాటలు కలిపి మద్యం దుకాణం/బార్ నిర్వహణకు సంబంధించిన సాధకబాధకలను ఆరా తీసినట్టు తెలిసింది. ఈ క్రమంలో పోలీసులకు నెలవారీ మామూళ్లు ఇవ్వాలని ఒత్తిళ్లు పెరగడంతో తప్పనిసరి పరిస్థితిలో చేయాల్సి వస్తోందని చెప్పినట్టు సమాచారం. దీంతో ఆయా వివరాలను ఉన్నతాధికారులకు చేరవేశారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంలో పేర్కొన్నట్టు మద్యం వ్యాపారుల నుంచి పోలీసులు మామూళ్లు గుంజుతుండడం వాస్తవమేనని నిర్ధారించి, సమగ్ర నివేదిక తయారుచేసి ఇటీవల ప్రభుత్వానికి పంపించినట్టు తెలిసింది.



అసంపూర్తిగా ఉన్న సర్వీసు రోడ్డు



కొంతమేరకు వేసిన బీటీ రోడ్డు

అసంపూర్తిగా ఎండాడ సర్వీసు రోడ్డు

- 300 మీటర్లు వేసి, 700 మీటర్లు వదిలేశారు
- అధ్వాన రోడ్డుతో అవస్థలు

ఎండాడ, మే 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు పరిధిలోని ఎండాడ కూడలి నుంచి పెట్రోల్ బంకు వరకు ఉన్న సర్వీసురోడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండాడ శరవేగంగా అభివృద్ధి చెందుతుండడంతో ఈ ప్రాంతంలో నిర్మాణాలు ఊపందుకున్నాయి. విశ్వవిద్యాలయాలు, ఐటీ కంపెనీలు, కళాశాలలు ఉండడంతో నిత్యం ట్రాఫిక్ రద్దీ ఉంటోంది. ఈ నేపథ్యంలో ఎండాడ డబుల్ రోడ్డు నుంచి వచ్చే వాహనాలు ఎండాడ కూడలి నుంచి నేరుగా జాతీయ రహదారిపైకి వెళ్తుండడంతో కూడలిలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నియంత్రణలో భాగంగా గత టీడీపీ ప్రభుత్వం ఎండాడ కూడలి నుంచి ఎండాడ చెరువును ఆనుకుని ఉన్న పెట్రోల్ బంక్ వరకు సర్వీసు రోడ్డుకు ప్రతిపాదన చేసింది. ఎండాడ కూడలి నుంచి పెట్రోల్ బంకు వరకు సర్వీసు రోడ్డుకు అనుకూలంగా గ్రావెల్ వేసి మట్టి రోడ్డు సిద్ధం చేశారు. ఈలోగా ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. ఎండాడ కూడలి నుంచి చెరువును ఆనుకుని ఉన్న బంక్ వరకు కిలోమీటర్ సర్వీసు రోడ్డు వేయాల్సి ఉండగా అందులో మూడు వందల మీటర్ల మేరకు పనులు పూర్తి కాగా మిగతా 700 మీటర్ల పనులు అసంపూర్తిగా వదిలేశారు. ఎండాడ కూడలి నుంచి బంకు వరకు మధ్యలో అనేక కొత్త కాలనీలు ఏర్పడ్డాయి. అపార్ట్‌మెంట్లు విపరీతంగా పెరిగాయి. దీంతో వాహనాల రాకపోకలు పెరిగాయి. మట్టి రోడ్డు కావడం, పనులు అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలు బారిన పడుతున్నారు. అలానే మట్టి రోడ్డు వల్ల దుమ్ము ధూళి రేగుతుండడంతో వాహనదారులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనికితోడు ఈ రోడ్డులో వాహనాల పార్కింగ్ అధికమైంది. ఇక్కడ అనేక మెకానిక్ షెడ్లు ఉండడంతో వాహనదారులు ఇష్టానుసారం పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పనుల పూర్తికి రూ. కోటి అవసరం

అసంపూర్తిగా ఉన్న 700 మీటర్ల సర్వీసు రోడ్డు నిర్మాణం పూర్తికి కోటి రూపాయల వరకు అవసరం. కానీ పాలకులు, అధికారులు ఇప్పటి వరకు ప్రతిపాదనలు సిద్ధం చేయకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవసరం లేని చోట రహదారులు వేస్తున్నారని, అవసరమైన సర్వీసు రోడ్డును పూర్తి చేయకపోవడం విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇద్దరు ఇంజనీర్లకు తాత్కాలిక బాధ్యతలు

సింహాచలం, మే 10 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందిన విషయం తెలి సిందే. ఈ ఘటనకు కారణమైన వారిని ప్రభుత్వం త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగా సస్పెండ్ చేసింది. వారిలో దేవస్థానంలో పనిచేస్తున్న కార్యనిర్వాహక ఇంజినీరు దండు గణపతి శ్రీనివాసరాజు, డీఈఈ సూర్యనారాయణ మూర్తి, ఏఈ కె. బాజ్జీ కూడా ఉన్నారు. వారి స్థానంలో ప్రస్తుతం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఈఈ బండారు రాంబాబుకు సింహగిరిపై ఈఈగా అదనపు బాధ్యతను, ఏఈగా సానా లోకేశ్‌కు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ.. దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ శనివారం ఆదేశాలిచ్చారు.

సీపీఐ నేత గున్నారావుకు నివాళి

భీమునిపట్నం (రూరల్), మే 10 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ నేత తెడ్లాపు గున్నారావు నాలుగో వర్ధంతి సభ స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం జరిగింది. ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కార్యదర్శి కె. ఈశ్వరరావు ఈ సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి గున్నారావు చేసిన సేవల్ని కొనియాడారు. అంతకముందు పలువురు గున్నారావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు.కార్యక్రమంలో సీపీఐ భీమిలి జోన్ కార్యదర్శి రాంబాబు, ఎం. అప్పలరాజు ఆదినారాయణ, అప్పలసూరి, తౌడు బాబు పాల్గొన్నారు.

వైసీపీ ఆనందపురం మండల అధ్యక్షుడిగా సత్యనారాయణ

ఆనందపురం, మే 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మండల అధ్యక్షుడిగా చందక పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన బంక సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఆ పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం గండిగుండం గ్రామంలో మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ప్రతిఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు. గెలుపోటములు సహజమని, వాటిని దృష్టిలో పెట్టుకోకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోరాడ వెంకటరావు, మజ్జి వెంకటరావు, గండ్రెడ్డి శ్రీనివాసరావు, పాండ్రంకి శ్రీను, కోరాడ ముసలి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

భీమునిపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. సాయంత్రం నగరానికి చెందిన నాట్య పరిమల మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యం, అన్నమాచార్య సంకీర్తనలు అలపించారు.

పద్మనాభునికి నిత్య పూజలు



పద్మనాభం, మే 10 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని గిరిపై ఉన్న అనంత పద్మనాభుని ఆలయంలో 15 నెలల తరు వాత శనివారం నుంచి నిత్య పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ పునర్నిర్మాణం పూర్తి కావడంతో అయిదు రోజులుగా ఆలయ శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహించారు. ఈమేరకు అర్చకుడు వెంకటాచారి స్వామివారికి నిత్యారాధన కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామివారికి పంచామృతాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతుని మూలవిరాట్టును విశేషంగా అలంకరించారు. రోడ్డు కూడా అందుబాటులోకి రావడంతో భక్తులు వాహనాల్లో గిరిపైకి చేరుకొని స్వామివారికి పూజలు చేశారు. కాగా గిరిపై ఉన్న అనంత పద్మనాభుని ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. అయిదు రోజులుగా ఆలయ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపట్టడంతో ఆలయ ఆవరణతో పాటు పరిసర ప్రదేశాలు చెత్తతో నిండడంతో గ్రామంలోని మహిళలు పరిసరాలను శుభ్రం చేశారు.

నౌకాయానంపై ప్రభావం చూపని యుద్ధ వాతావరణం

విశాఖ నుంచి అండమాన్‌కు బయలుదేరిన ప్రయాణికుల నౌక

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో యుద్ధ వాతావరణ ప్రభావం విశాఖపట్నం పోర్టుపై ఎటువంటి ప్రభావం చూపలేదు. ప్రయాణికుల నౌకలతో పాటు వాణిజ్య నౌకలన్నీ యథాప్రకారం రాకపోకలు సాగిస్తున్నాయి. విశాఖపట్నం-అండమాన్ మధ్య ప్రయాణికుల నౌకలు నిత్యం తిరుగుతుంటాయి. యుద్ధ భయం వల్ల ఈ సర్వీసు రద్దు అవుతుందేమోనని చాలామంది భయపడ్డారు. కానీ అటువంటిదేమీ లేకుండానే శనివారం ఇక్కడి నుంచి అండమాన్ నౌక ఎంవీ క్యాంప్‌బెల్ బే బయలుదేరి వెళ్లింది. ఈ నౌకలకు నెల రోజుల ముందుగానే పత్రికల్లో ప్రకటన ఇచ్చి టికెట్లు విక్రయిస్తారు. ఉత్తరాంధ్రాతో పాటు ఒడిశా(బరంపురం)కు చెందినవారు అండమాన్‌లో ఉపాధి అవకాశాల కోసం పెద్ద సంఖ్యలో వెళుతుంటారు. వారే ఈ నౌకల్లో అధికంగా ప్రయాణిస్తారు. షెడ్యూల్ ప్రకారం అండమాన్ ఉంచి ఈ నౌక ఈ నెల ఎనిమిదో తేదీనే వచ్చింది. శనివారం సాయంత్రం ప్రయాణికులను ఎక్కించుకొని చీకటి పడ్డాక బయలుదేరిందని పోర్టు వర్గాలు తెలిపాయి. సుమారు మూడు రోజులు సముద్రంలో ప్రయాణించి గమ్యం చేరుకుంటుంది. నౌక రద్దు కాకుండా బయలుదేరడంపై ప్రయాణికులు సంతోషం వ్యక్తంచేశారు.

ఖాకీల కలెక్షన్

... 5వ పేజీ తరువాయి

సక్రమంగా పట్టించుకోవడం లేదని, తనను ఇబ్బంది పెడుతున్నందున సన్మార్గంలో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేస్తే, తనను విడాకులు తీసుకోవాలని సదరు అధికారిణి ఒత్తిడి చేయడంతోపాటు, ఆమె భర్త స్నేహితుడైన వ్యక్తి ద్వారా కూడా ఒత్తిడి చేయించారంటూ బాధితురాలు ఫిర్యాదు చేశారు. సీపీ స్పందించి సదరు అధికారిణి నుంచి ఆ కేసును మరొకరికి బదిలీ చేయడంతోపాటు విచారణ జరిపి తనకు అసలు విషయం తెలియజేయాలని నార్త్ ఏసీపీ అప్పలరాజును ఆదేశించారు. ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న ఒక స్టేషన్ సీఐ నైట్ రౌండ్స్ ఉన్నప్పుడు ఒక హోటల్‌లో కూర్చొని వసూళ్ల గురించి హెడ్‌కానిస్టేబుల్‌తో చర్చించుకుంటారని ఆ స్టేషన్ సిబ్బందే చెబుతున్నారు. స్టేషన్‌లో వసూళ్ల బాధ్యతలు చూస్తున్న సదరు హెడ్‌కానిస్టేబుల్ గతంలో కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో పనిచేసినప్పుడు కూడా ఇలాంటి ఆరోపణలే వెల్లువెత్తడంతో ఈస్ట్ సబ్‌డివిజన్‌కు బదిలీ చేశారు. ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉన్న ఒక స్టేషన్‌లో ఏఎస్ఐ ఒకరు వసూళ్ల బాధ్యతను భుజానవేసుకున్నారు. వెస్ట్ సబ్‌డివిజన్‌లో జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఒక పోలీస్ స్టేషన్‌లో బ్లూకోల్ట్స్ బాధ్యతలు చూస్తున్న కానిస్టేబుల్ వసూళ్ల బాధ్యత చూస్తున్నారు. ద్వారకా సబ్‌డివిజన్‌లోని వాణిజ్య సముదాయాలు కలిగివున్న ఒక స్టేషన్‌లో మరొక కానిస్టేబుల్ వసూళ్ల బాధ్యతలు చూసుకుంటున్నారని ఉన్నతాధికారులకు ఇప్పటికే ఫిర్యాదు అందినట్టు తెలిసింది. ఈ వ్యవహారాలపై సీపీ శంఖబ్రతబాగ్చికి సమాచారం అందించాల్సిన స్పెషల్‌బ్రాంచి విభాగం తన బాధ్యతలను నిర్వర్తించడంతో విఫలమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి స్టేషన్ పరిధిలో జరిగే అన్నిరకాల వ్యవహారాలతోపాటు శాఖాపరంగా అంతర్గత వ్యవహారాలు, అవినీతిపై సమాచారం సేకరించేందుకు స్పెషల్‌బ్రాంచి విభాగం నుంచి ఒక్కో కానిస్టేబుల్ ఉంటారు. అయినప్పటికీ వారు కూడా స్టేషన్ సిబ్బందితో కుమ్మక్కు అయిపోవడం, గతంలో వారు స్టేషన్‌లో అలాంటి విధుల్లో పనిచేయడం వల్లే అవినీతి, నిర్లక్ష్యాన్ని ఉన్నతాధికారులకు చేరవేయడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సీపీ స్టేషన్లలోని అవినీతిపై దృష్టిసారించాలని నగరవాసులు కోరుతున్నారు.

నేటి నుంచి పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు

మూడు రోజుల పాటు నిర్వహణ

పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా), మే 10 (ఆంధ్రజ్యోతి): మన్యంవాసుల ఆరాధ్య దేవత పాడేరు మోద కొండమ్మ ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ, ఐటీడీఏ యంత్రాంగం ఏర్పాట్లుచేశాయి. మోదకొండమ్మను అత్తవారి ఇంటి నుంచి పుట్టింటికి తీసుకు వచ్చే తంతుతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.స్థానిక ఆలయం (అత్తవారిల్లు) నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలను ఆది వారం ఉదయం భారీ ఊరేగింపుతో పుట్టిల్లుగా భావించే శతకంపట్టు పందిరిలో ఉంచుతారు. సోమ, మంగళవారాలు కూడా శతకంపట్టులోనే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మంగళవారం సాయంత్రం శతకంపట్టు నుంచి అమ్మవారిని తిరిగి ఆల యానికి చేర్చడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించారు. పాత మీటర్లు తీసేసి, కొత్తవి ఇస్తున్నారు.

స్మార్ట్ మీటర్లు కొందరికే...

- శ్యాంబాబు, ఎస్ఈ, విశాఖ సర్కిల్

స్మార్ట్ మీటర్లు విద్యుత్ వినియోగదారులు అందరికీ ఇవ్వం. ఎక్కువ విద్యుత్ అంటే నెలకు 200 యూనిట్లు పైబడి ఉపయోగించే వారికి మాత్రమే ఏర్పాటు చేస్తాం. మిగిలిన వారికి పాత మీటర్లే ఉంటాయి. గ్రూపు హౌస్‌లు, అపార్ట్‌మెంట్లలో ఉండేవారికి తప్పనిసరి అనే నిబంధన కూడా లేదు. తక్కువ విద్యుత్ ఉపయోగించుకొని, ప్రభుత్వ రాయితీ పొందే వర్గాలకు ఇవ్వరు. స్మార్ట్ మీటర్ల వ్యయం వినియోగదారుల నుంచి వసూలు చేస్తారనే అపోహలు కూడా ఉన్నాయి. ఈపీడీసీఎల్ ఎప్పుడూ మీటర్ల వ్యయం వినియోగదారుల నుంచి వసూలు చేయలేదు. అది సంస్థ ఆస్తిగానే ఉంటుంది. కాకపోతే స్మార్ట్ మీటరు పెట్టుకునేవారు ముందుగానే వారి సగటు వినియోగం ఎంతో ఆ మొత్తంతో రీచార్జి చేసుకోవలసి ఉంటుంది.

పారిశుధ్య పనులను పరిశీలించిన మేయర్

... 5వ పేజీ తరువాయి

ముందుగా ఆర్కే బీచ్ వద్ద ఉన్న పారిశుధ్య కార్మికుల హాజరుపట్టికను తనిఖీ చేసి, రోజూ ఎన్ని గంటలకు హాజరవుతున్నారని కాంట్రాక్టర్‌ను ఆరా తీశారు. కార్మికులతో మాట్లాడుతూ వారికి సరఫరా చేసిన చీపుళ్లను తనిఖీ చేసి నాణ్యత బాగుండలేదని, వాటిని మార్చాలని, ఇంకా కార్మికులకు అవసరమైన డస్ట్ బిన్లు, తోపుడుబండ్లు సమకూర్చాలని సహాయ వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజును ఆదేశించారు. బీచ్‌లో ప్రతి దుకాణం దగ్గర డస్ట్ బిన్ తప్పకుండా ఉండాలని, అందుకు సహకరించని వారి షాపులను తొలగించాలని సూచించారు. బీచ్ కాలుష్యానికి గురికాకుండా సందర్శకులకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. అనంతరం జగదాంబ జంక్షన్‌లో పనులు పరిశీలించారు. కొన్ని షాపుల వద్ద అధికంగా వ్యర్థాలు రోడ్లపై వేస్తున్నారని ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు కొందరు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. అటువంటి దుకాణాలు, షోరూమ్స్ వద్ద ప్రత్యేకంగా డస్ట్ బిన్స్ వారే ఏర్పాటుచేసుకుని జీవీఎంసీ వాహనాలకు రోజూ అందించేలా నోటీసులు జారీచేయాలని అధికారులకు సూచించారు. రాత్రి పారిశుధ్య పనులలో ఎటువంటి అలసత్వం, లోపాలు లేకుండా నిత్యం విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సహాయ వైద్యాధికారి సునీల్‌కుమార్‌ను ఆదేశించారు.



కొండ దిగువన దేవస్థానం బస్సు టికెట్ల కోసం క్యూలో ఉన్న భక్తులు

అప్పన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

సింహాచలం, మే 10 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌ఘడ్, ఒడిశా సరిహద్దు గ్రామాల నుంచి కూడా తరలివచ్చారు. వేకువజామున సింహాచలం చేరుకుని అక్కడి నుంచి అటవీ ప్రాంతంలో కొలువుదీరిన భైరవస్వామిని దర్శించుకుని కొందరు మెట్ల మార్గంలోను, మరి కొందరు రోడ్డు మార్గంలోను సింహగిరికి చేరుకున్నారు. పవిత్ర గంగధారలో పుణ్యస్నానాలు ఆచరించి,అప్పన్నను దర్శించుకున్నారు. భక్తులు అధికంగా రావడంతో సింహగిరి మాడవీధుల్లో, గంగధార, కేశఖండనశాల, ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద సందడి నెలకొంది.

వైభవంగా నిత్య కల్యాణం

వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్ర నామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు పూర్తిచేశారు. అనంతరం శాస్త్రోక్తముగా కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.



పాదయాత్రలో పాల్గొన్న సీపీఐ నాయకులు

మతం ముసుగులో బీజేపీ రాజకీయం

సీపీఐ నాయకుల ధ్వజం

కంచరపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని సీపీఐ రాష్ట్ర సమితి సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వర్రావు, జె.వి. సత్యనారాయణమూర్తి ఆరోపించారు. సీపీఐ విశాఖ జిల్లా మహాసభలు సందర్భంగా శనివారం కంచరపాలెం మెట్టు నుంచి ఐటీఐ జంక్షన్ వరకు ప్రజా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఐటీఐ జంక్షన్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో నాయకులు మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 2014లో ఇచ్చిన హామీలనే నెరవేర్చలేదన్నారు. ఏటా రెండ కోట్ల ఉద్యోగాల కల్పన, నల్లధనాన్ని వెలికితీసి ప్రజలకు పంచుతామన్న బీజేపీ హామీలు ఏమయ్యాయంటూ ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాల హామీతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వాటి అమలును పక్కన పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై మే 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 12 ఏళ్లుగా కనీస వేతనాలు సవరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి అమరావతి తప్ప మరేమీ కనిపించడం లేదన్నారు. నెల రోజుల క్రితం రిజిస్టరైన సంస్థకు విశాఖలో కేవలం 99 పైసలకు భూములు కేటాయించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, పార్టీ నాయకులు మానం ఆంజనేయులు, ఎ.జె.స్టాలిన్, సీహెచ్. రాఘవేంద్రరావు, డి.ఆదినారాయణ, పి.చంద్రశేఖర్, ఎం.మన్మథరావు, రాంబాబు పాల్గొన్నారు.

60 ఎకరాల అన్యాక్రాంతానికి కుట్ర

... 5వ పేజీ తరువాయి

భూములకు నిరభ్యంతర పత్రాలు ఇవ్వాలని ఆదేశించారు. విశాఖ రూరల్ మండలం మధురవాడ సర్వేనంబరు 370/1, 367/1, 352/3, కొమ్మాది సర్వే నంబరు 114/1, 150/2, ముడసర్లోవలో 31/2, ఆనందపురం మండలం తర్లువాడలో సర్వే నంబరు 3/3, పెందుర్తి మండలం ఎస్ఆర్ పురంలో సర్వేనంబరు 99, గాజువాక మండలం వడ్లపూడిలో సర్వే నంబరు 122/1, శనివాడలో సర్వేనంబరు 92, తలారివానిపాలెంలో 35/4లో భూములతోపాటు జిల్లాలో మరికొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూములకు రమారమి 60 నుంచి 70 ఎకరాలకు నిరభ్యంతర పత్రాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు పేర్కొన్న కొన్ని సర్వే నంబర్లలో భూములకు ఎన్‌వోసీ ఇవ్వాలని అధికారులను మౌఖికంగా ఆదేశించారు. ఆ భూములకు ఎన్‌వోసీ ఇవ్వలేమని, కొన్ని భూములు సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ఉన్నాయని, మిగిలినవి ప్రభుత్వ భూములేనని పేర్కొంటూ...వాటిపై కోర్టులో కేసులు ఉన్నాయని నివేదించారు. అయితే సదరు ఉన్నతాధికారి ఈ ఏడాది జనవరి నుంచి ఒక్కొక్క దానికి నిరభ్యంతర పత్రాలు జారీచేయాలని ఆదేశించారు. ఈ విధంగా సుమారు 12 నుంచి 15 సర్వే నంబర్లకు ఆదేశాలు వచ్చాయి.

ముడసర్లోవ రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో భూములకు ఎటువంటి పట్టాలు ఇవ్వకూడదు. అందుకు అనుగుణంగా చాలాకాలం క్రితం ఇచ్చిన పట్టాలను అప్పట్లోనే రద్దు చేసినా వాటిపై కొందరు పోరాటం చేస్తున్నారు. నీటి ప్రవాహాలు, చెరువులు, వాగులు ఎవరికీ ఇవ్వరాదని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దీని ప్రకారం ముడసర్లోవలో నీటి ప్రవాహం ఉన్న ప్రాంతంలో భూములకు నిరభ్యంతర పత్రాలు ఇవ్వకూడదు. ఇదే తీర్పు మేరకు వడ్లపూడిలో చెరువుకు ఎన్‌వోసీ ఇవ్వకూడదు. ఇంకా పక్కాగా ప్రభుత్వ భూమి అని తేలిన చోట్ల కూడా ఎన్‌వోసీ ఇవ్వాలని సదరు ఉన్నతాధికారి ఆదేశించారు. ఆయా భూములకు ఎన్‌వోసీ ఇవ్వలేమని జిల్లా యంత్రాంగం ఇటీవల ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అప్పటికే రెవెన్యూ ఉన్నతాధికారిని ఆ స్థానం నుంచి తప్పించిన ప్రభుత్వం...జిల్లాల్లో ఎన్‌వోసీ ఇవ్వాలని ఆయన సిఫారసు చేసిన భూములపై ఆరా తీసింది. ఎన్‌వోసీ ఇవ్వాలన్న భూముల వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు?...అన్నదానిపై వివరాలు సేకరిస్తుంది.

భారత్‌తో పెట్టుకుంటే పాక్ నాశనమే

.. 5వ పేజీ తరువాయి

వివరాలు ఆయన మాటల్లోనే...

పాకిస్థాన్‌తో యుద్ధంలో సేవలు..

1970లో నౌకాదళంలో కమిషన్డ్ ఆఫీసర్‌గా చేరా. విధుల్లో చేరిన ఏడాదికే అంటే 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో పాల్గొన్నాను. అరేబియా మహాసముద్రంలో పాకిస్థాన్ యుద్ధ విమానాలు, జలాంతర్గాములను వేటాడేందుకు 'ఐఎన్ఎస్ కుఠార్' యుద్ధనౌకలో సిగ్నల్ కమ్యూని కేషన్ ఆఫీసర్‌గా పనిచేశాను. మరో రెండు యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ ఖుక్రీ, కిర్పాన్ కూడా అదే సముద్రంలో సేవలు అందించాయి. పాకి స్థాన్‌కు చెందిన జలాంతర్గామి దాడిలో (టార్పెడోలు ఫైరింగ్) ఐఎన్ఎస్ ఖుక్రీ మునిగిపోయింది. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో సిబ్బంది ప్రాణాలను మేము కాపాడాం. పద్దెనిమిది రోజులపాటు జరిగిన యుద్ధంలో పాక్ విమానాలు, సబ్‌మెరైన్స్‌పై దాడి చేసే లక్ష్యంతో ముందుకుకదిలాం. నాడు పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో భారత్ అద్భుతమైన పోరాటాన్ని కొనసాగించింది. కరాచీ కూడా ఆధీనంలోకి వచ్చింది. అప్పుడు కాల్పుల విరమణ ప్రకటన రాకపోయి ఉండి ఉంటే ఇప్పుడు ఇటువంటి పరిస్థితులు ఉండేవి కావు. కానీ, ప్రభుత్వం అప్పటి పరిస్థితుల దృష్ట్యా కాల్పుల విరమణ ప్రకటించడంతో భారత సైన్యం వెనక్కి వచ్చింది.

త్రివిధ దళాలు సర్వసన్నద్ధం

భారత్ త్రివిధ దళాలు నిరంతరం సర్వసన్నద్ధంగా ఉంటాయి. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసే సిబ్బంది దేశభక్తితో పనిచేస్తారు. ప్రాణాలు ఇచ్చేందుకు కూడా వెనుకాడరు. ఇక పాకిస్థాన్‌తో యుద్ధం అంటే వేయి రెట్లు కసి, వేగంతో సైన్యం ముందుకు కదులుతుంది. ప్రభుత్వం ముందుకు వెళ్లాలని భావిస్తే మాత్రం పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పడం ఖాయం. ఈ విషయంలో భారత్ శక్తి, సామర్థ్యాలకు తిరుగులేదు.

పాకిస్థాన్ చేసేదేమీ లేదు..

పహల్గాంలో ఉగ్రమూకలు అమాయకులైన పర్యాటకులను చంపారు. మనం ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేస్తే, పాకిస్థానేమో భారత్‌పై దాడులకు తెగబడుతోంది. అంటే, ఇంకా పాకిస్థాన్ బుద్ధి మారలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో పాకిస్థాన్ చేసేది ఏమీ లేదు. అగ్రరాజ్యాలు అయిన అమెరికా, రష్యా మన వైపు ఉన్నాయి. కరాచీ పోర్టుపై భారత్ దాడి చేసినట్టు చెబుతున్నారు. అదే జరిగితే పాక్ కోలుకోవడం ఇప్పట్లో సాధ్యం కాదు. మరోవైపు బలూచిస్తాన్ వాళ్లు తిరగబడుతుండడంతో అంత ర్యుద్ధంతో అల్లాడుతోంది. అక్కడ క్షేత్రస్థాయిలో అత్యంత దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. భారత్ సైన్యం దేశభక్తితో పని చేస్తుంది. ఎదుర్కోవడం పాకిస్థాన్‌కు అంత సులభం కాదు.

కాశీ అన్నపూర్ణదేవిగా పోలమాంబ అమ్మవారు



పూజలు అందుకుంటున్న పోలమాంబ అమ్మవారు

మద్దిలపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి) : వాజీపాలెం గ్రామదేవత పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శనివారం అమ్మవారిని కాశీ అన్నపూర్ణదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. శ్రీకృష్ణ సేవాసంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో సాయంత్రం సినీ డూప్స్‌తో నిర్వహించిన నాటకప్రదర్శనలు అలరించాయి.

నేడు టీటీడీ కల్యాణ మండపంలో పుష్ప సంకల్పం

ఎంవీపీ కాలనీ, మే 10 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో బిల్వపత్ర పుష్పయాగం ఈ నెల 12న నిర్వహించనున్నారు. అక్కడకు అవసరమైన కలువ, తామర, మల్లె, గులాబి, సంపెంగ తదితర పుష్పాలను ఆదివారం ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపంలో సంకల్పం చేసి పంపించనున్నట్టు వేంకటేశ్వర స్వామిభక్తులు హిమాంశు ప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల భక్తులు హాజరుకావచ్చని పేర్కొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

వెంకోజీపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఎంఎంటీసీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం పెద్ద ఎత్తున భక్తులు క్యూ కట్టారు. దీంతో పలు స్వచ్ఛంద సంస్థలు ప్రసాదంతో పాటు మజ్జిగను కూడా పంపిణీ చేశాయి. ఎండలో వచ్చే భక్తులు భగవంతుడి దర్శనం అనంతరం బయటకు వచ్చి ప్రసాదం తీసుకుని, మజ్జిగను తాగి సేద తీరారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణలు గోత్రనామాలతోపూజలు నిర్వహించారు. ఆలయం బయట ఆలయ కమిటీ కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజరు బి.సన్యాసిరావులు వివిధ దాతలతో మజ్జిగను పంపిణీ చేయించి వేసవిలో భక్తులకు అందించారు. దీంతో ఆలయానికి వచ్చిన భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

సినిమా గైడ్

● **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)

● **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 13, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 40 దొండకాయలు 26, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)48, బరబాటి 34, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 90, బద్దచిక్కుడు 48, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 90, కీరదోస 34, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 38, కంద 84, దేముడు చిక్కుడు 44, గోరుచిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 26, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

పార్కు స్థలంలో వాణిజ్య సముదాయం నిర్మాణామా?

- పిఠాపురం పార్కు వ్యవహారంలో స్టేటస్ కో విధించిన హైకోర్టు
- పార్కులో పరికరాల తొలగింపుపై ఆగ్రహం
- జీవీఎంసీ అధికారుల తీరుపై ఆక్షేపణ



షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం చదును చేసిన పార్కు స్థలం

మద్దిలపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ పార్కులోని కొంతభాగంలో జీవీఎంసీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించే ప్రయత్నాలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. పార్కులోని జిమ్ పరికరాలు, క్రీడా సామగ్రి తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్కు స్థలాల్లో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టడం చట్ట వ్యతిరేకమని తేల్చిచెప్పింది. పార్కు స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించవద్దని జీవీఎంసీని ఆదేశిస్తూ పార్కు స్థలంపై స్టేటస్ కో ఇచ్చింది.

1978లో పిఠాపురం కాలనీ లే అవుట్ వేసి నిబంధనల ప్రకారం కాలనీవాసులకు ఓపెన్ స్పేస్ కింద విడిచిపెట్టిన స్థలంలో పార్కు నిర్మించారు. పార్కులోని కొంత భాగంలో 1990లో జీవీఎంసీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించింది. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆ భవనం స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి ప్రతిపాదించారు. జీవీఎంసీ రూ.1.68 కోట్లు మంజూరు చేసింది. అయితే పాత భవనం స్థలానికి పార్కులోని కొంత భాగం ఆక్రమించుకుని పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు.

ఈ క్రమంలో పార్కులో అక్రమ వ్యాపారాలు, నిర్మాణాలు ఉన్నాయని, వాటిని తొలగించాలని ఆయన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ ఫిర్యాదుతో జీవీఎంసీ సిబ్బంది పార్కులోని క్రీడాపరికరాలు, బెంచీలు తొలగించి స్థలాన్ని చదును చేశారు. దీంతో కాలనీ సంఘం వారు జీవీఎంసీ అధికారులను అడ్డుకున్నారు. పార్కు స్థలం ఆక్రమించుకునే ప్రయత్నం జరుగుతోందంటూ ఈ నెల 6న హైకోర్టును ఆశ్రయించారు. కాలనీ వాసులు వాదనలు విన్న హైకోర్టు జీవీఎంసీ చర్యలను తప్పుబడుతూ శనివారం పార్కు స్థలంపై స్టేటస్-కో ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పిఠాపురం కాలనీ అసోసియేషన్ అధ్యక్షురాలు రమాప్రభ, కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గకుండా జీవీఎంసీ అధికారులు పార్కును పరిరక్షించాలని కోరారు.

కృష్ణా కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ల సందడి

- ప్రభుత్వ ఆదేశాలతో విద్యార్థుల ప్రవేశాలపై అధ్యాపకుల ప్రత్యేక శ్రద్ధ



కృష్ణా కళాశాల గేటు వద్దే అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్న అధ్యాపకులు


మద్దిలపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పెరగాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అధ్యాపకులు పరుగులుపెడుతున్నారు. పదో తరగతి విద్యార్థులు వివరాలు తెలుసుకుని వారి ఇళ్లకు వెళ్తున్నారు. వేసవి సెలవుల్లోనైతం కళాశాలలు తెరచిసిబ్బంది మొత్తం అడ్మిషన్లపైనే దృష్టి సారిస్తున్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు గేటు వద్దకే మకాం మార్చారు. కృష్ణా కళాశాల ప్రాంగణంలో వొకేషనల్, జనరల్ రెండు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలలు అడ్మిషన్లలో పోటీ పడుతున్నాయి.

కృష్ణా కళాశాల ప్రవేశ ద్వారం నుంచి కార్యాలయం వరకు వెళ్లాలంటే 300 మీటర్ల దూరం ఉంటుంది. విద్యార్థులకు అంతా దూరం కూడా రానీయకుండా ప్రవేశ ద్వారం వద్ద చెట్ల కింద కుర్చీలు వేసుకుని ఒకేషనల్, జనరల్ కళాశాలల అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థులకు అక్కడే వివరాలు తీసుకుని దరఖాస్తులు అందిస్తున్నారు. మరి కొంతమంది అధ్యాపకులు ప్రైవేటు స్కూల్స్‌లో టెన్త్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల చిరునామాలు తీసుకుని వారి ఇళ్లకు వెళ్తున్నారు. తల్లిదండ్రులకు కృష్ణా కళాశాలలో సదుపాయాలు, ఫీజుల వివరాలు వివరించి కళాశాలలో చేర్పించాలని కోరుతున్నారు.

ఈ నెల 31 వరకూ తొలి విడత అడ్మిషన్లను చేపడతారు. వేసవి సెలవుల అనంతరం కళాశాల తరగతులు ప్రారంభమైన తర్వాత రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుంది. అక్కడకు మరికొన్ని రోజుల అనంతరం మూడో విడతగా అడ్మిషన్లు చేపడతారు.

శంఖుచక్రనామాల వెలుగుల సమయం పెంపు

- వేకువ జామున 4 నుంచి 6 గంటల వరకూ..
- సాయంత్రం 6 నుంచి 10:30 గంటల వరకూ వెలిగేలా చర్యలు



కైలాసగిరిపై వెలుగుతూ కనిపిస్తున్న శంఖుచక్రనామాలు

ఎంవీపీ కాలనీ, మే 10 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిపై శంఖుచక్ర నామాల వెలుగుల సమయాన్ని పెంచారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి చూస్తే నగరానికి ప్రత్యేక ఆకర్షణగా కనిపించే విధంగా కైలాసగిరిపై శంఖుచక్ర నామాల వెలుగులు కనిపిస్తుంటాయి. అయితే ఇవి సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి తొమ్మిదింటి వరకూ మాత్రమే వెలుగుతున్నాయి. నగరవాసుల వినతి మేరకు వీఎమ్మార్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ వీటి వెలుగుల సమయాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. దీంతో సాయంత్రం ఆరు నుంచి రాత్రి పదిన్నర వరకూ ఉంచడమే కాకుండా తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకూ కూడా వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

కళావిహీనంగా అబ్దుల్ కలాం పార్కు

- కూలిన ప్రహరీ గోడలు
- విరిగిన వాకింగ్ ట్రాక్ పలకలు
- రాత్రిపూట పశువుల సంచారం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు




నిస్తేజంగా ఉన్న పార్కు లోపల ప్రాంతం

వెంకోజీపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల ఆటపాటలతో... వృద్ధుల ఆహ్లాదంతో.. యువకుల వ్యాయామాలతో కళకళలాడాల్సిన 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కు నేడు అస్తవ్యస్తంగా మారింది. ఐదేళ్ల క్రితం గత టీడీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న ఈ పార్కుకు చుట్టూ ప్రహారీ గోడ నిర్మాణం, రెండు గేట్లు, వాకింగ్ ట్రాక్, బోరింగ్ వంటివి ఏర్పాటు చేశారు. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్కు నిర్వహణ గురించి కనీసం పట్టించుకోలేదు. స్థానిక కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఆమె భర్త అప్పారావు దృష్టికి ఎన్నిసార్లు విన్నవించినా వారు పట్టించుకున్నదే లేదు. సరికదా.. ఈ పార్కులో సచివాలయం నిర్మాణం చేపడతామంటూ అప్పటి మేయర్ గొలగాని హరివెంకట కుమారి చేతుల మీదుగా శంకుస్థాపన కూడా చేయించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో పార్కులో కట్టడాలు వద్దంటూ ఉత్తర్వులు రావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఆ తర్వాత తూతూ మంత్రంగా పార్కులో మూడు వ్యాయాయ సామాగ్రిని షాడో కార్పొరేటర్ మొల్లి అప్పారావు ఏర్పాటు చేయించి చేతులు దులుపుకున్నారు.

అయితే కూటమి ప్రభుత్వం వచ్చినప్పటికీ ఈ పార్కు దుస్థితి మారలేదు. నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం పార్కులో వాకింగ్ ట్రాక్‌పై పలకలు విరిగి అస్తవ్యస్తంగా తయారైంది. చిన్న గేటు పూర్తిగా విరిగి మూలకు చేరింది. అంతేకాకుండా పార్కులో కొన్ని ప్రైవేటు శుభకార్యాలు చేసుకునేందుకు అవకాశం ఇస్తుండడంతో ఎవరో ఒక వైపు గోడను విరగొట్టేశారు. ఇటీవల గాలికి పార్కుకు మరో పక్క భారీ చెట్టు నేల కొరిగి గోడను విరగొట్టేసింది. దీంతో పార్కు పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది.

ఈ పార్కులో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఇక్కడ కొందరు స్థానిక యువత షటిల్, కరాటే శిక్షణ, పాదచారులలో సందడిగా కనిపిస్తుంది. సెలవు రోజుల్లో పిల్లలు చేరి ఆడుతుంటారు. అయితే ఒకప్పటిగా పార్కు సుందరంగా లేదు. కళావిహీనంగా తయారైంది. పిల్లలు ఆడేందుకు క్రీడా సామగ్రి లేదు. పెద్దలు కూర్చునేందుకు సరైన సదుపాయం లేదు. పరిసరాలు కూడా అధ్వానంగా తయారయ్యాయి. పార్కుకు గేట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో పశు సంచారం ఎక్కువైంది. పర్యవేక్షణ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది.

అందరికీ అందుబాటులో ప్రాంతంలో ఉన్న ఈ పార్కును అభివృద్ధి చేయాలని ఎన్నిసార్లు స్థానికులు, ఆటగాళ్లు, వ్యాయామం చేసే వారు కోరుతున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు. దీంతో రోజురోజుకూ ఈ పార్కు కళావిహీనంగా తయారవుతోంది. ఇప్పటికైనా పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పార్కులో సంచరిస్తున్న పశువులు



వాకింగ్ ట్రాక్‌పై విరిగిన సిమెంటు పలకలు

ఎవరో తవ్వేశారు..! ఎవరూ పూడ్చరూ..!!

- ఏఎస్ రాజా మైదానం రహదారి సమీపంలో గోతులు



ఏఎస్ రాజా మైదానం సమీపంలో తవ్వేసిన ఫుట్‌పాత్

ఎంవీపీ కాలనీ, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ డబుల్ రోడ్డు ఏఎస్ రాజా మైదానం సమీపంలో దొంగలు రోడ్డు, ఫుట్‌పాత్ తవ్వేసి టెలిఫోన్ కేబుళ్లను ఎత్తుకుపోయారు. ఈ వ్యవహారంపై కేసు నమోదైంది. ఇది జరిగి దాదాపు మూడు నెలలు కావొస్తోంది. కానీ జీవీఎంసీ అధికారులు ఇప్పటికీ వీటిని పూడ్చలేదు. ఫుట్‌పాత్ సగం తవ్వేసి ఉంది. దానిని ఆనుకుని రోడ్డును తవ్వి, ఆ మట్టిని కూడా రోడ్డుపైనే గుట్టగా ఉంచేశారు. ఈ రహదారి బాగా రద్దీగా ఉంటుంది. ముఖ్యంగా సాయంత్రం, రాత్రి ఎక్కువ గా వాహన రద్దీ ఉంటుంది. దీనివల్ల వాహన రాకపోకలకే కాకుండా, పాదచారులకు చాలా ఇబ్బంది ఎదురవుతోంది. దీనికి బీఎస్ఎన్ఎల్ అధికారులు బాధ్యత వహిస్తారో, జీవీఎంసీ ముందుకు వస్తుందో గాని వెంటనే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, పాదచారులు, స్థానికులు కోరుతున్నారు. ఎవరో గోతులు తవ్వేశారు! ఎవరూ పూడ్చరు.. మేం మాత్రం ఇబ్బందులు పడుతున్నామంటున్నారు స్థానికులు.

అంధకారంలో శ్రీకాంత్ నగర్

- పది రోజులుగా వెలగని వీధి దీపాలు

ఆరిలోవ, మే 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీకాంత్ నగర్‌లో గల పలు వీధుల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో ఈ ప్రాంతం సాయంత్రం తర్వాత గాఢాంధకారంగా మారుతోంది. గత పది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. దీంతో రాత్రి వేళల్లో వివిధ పనులపై వెళ్లిన వారు ఇంటికి చేరేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా.. మహిళలు, పిల్లలు, వృద్ధులు రాత్రి వేళల్లో బయటకు రావడానికి ఇబ్బందిగా ఉందంటూ వాపోతున్నారు. ఈ ప్రాంతంలో కుక్కలు అధికంగా ఉండడంతో చీకట్లో మరింత ఇబ్బందిగా మారుతోంది. కొన్నిసార్లు గుంపులుగా ఉన్న కుక్కలు చీకట్లో వచ్చే వాహనాలను చూసి పెద్దగా అరుస్తూ ద్విచక్ర వాహనాలను వెంబడిస్తున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు.ఈ సమస్య గురించి ఎవరికి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు మండి పడుతున్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా చెప్పండి వెంటనే పరిష్కరించేస్తామంటూ మాటలు చెప్పే ప్రజా ప్రతినిధులు తీరా సమస్య వస్తే పట్టించుకోకపోవడం అన్యాయం అంటున్నారు. అలాగే అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్రమత్తతతో నేరాల నియంత్రణ

- గొలుసు దొంగతనాల విషయంలో మహిళలు కొన్ని జాగ్రత్తలు పాటించాలి
- వేసవి సెలవుల్లో ఊర్లకు వెళితే సమాచారం ఇవ్వండి
- 'ఆంధ్రజ్యోతి'తో ద్వారకా జోన్ ఏసీపీ (నేర విభాగం) డి.లక్ష్మణరావు



ఇటీవల తరచూ జరుగుతున్న గొలుసు దొంగతనాలు, ఇళ్ల చోరీల విషయంలో ప్రజలు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే నేరం జరగకుండా చేయవచ్చని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. నేరం జరిగిన తర్వాత ఇబ్బంది పడే కంటే ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మేలు జరుగుతుందని ద్వారకా జోన్ ఏసీపీ (నేర విభాగం) డి.లక్ష్మణరావు తెలిపారు. ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ గొలుసు దొంగతనాల వల్ల బంగారం కోల్పోవడమే కాకుండా, దుండగులు మెడలో గొలుసు తెంచే ప్రయత్నంలో బాధితులు ప్రమాదాల పాలవుతున్నారన్నారు. ఒక్కోసారి ప్రాణాల మీదకు కూడా వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇక వేసవి సెలవుల్లో ఇళ్లకు తాళం వేసి, సొంతూర్లకు పయనమయ్యేవారు పోలీసులకు ముందస్తు సమాచారం, ఎల్‌హెచ్ఎంఎస్ యాప్ వినియోగించుకోవడం ద్వారా నేరం జరగకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి.

గొలుసు దొంగతనాల నుంచి రక్షణ కోసం..

- మహిళలు వాహనంపై ప్రయాణించేటప్పుడు ఉదయం, సాయంత్రం.. నడక, ఉదయం పువ్వులు కోసేటప్పుడు, నిర్మానుష్య రహదారుల్లో, రాత్రులు వీధుల్లో నడిచేటప్పుడు మెడలోని బంగారు వస్తువులు కనిపించకుండా వస్త్రం, చీర, చున్నీ వంటివి కప్పుకోవాలి.
- ఇంటి వద్దకు ఎవరైనా వచ్చి, నీళ్లు కావాలనో, చిరునామా అడగడానికో, ఇల్లు అద్దెకు కావాలనో, ఇతరత్రా మాటలు కలపడానికి కొత్త వ్యక్తులు వస్తే, తలుపు లేదా గ్రిల్ తెరవకుండా మాట్లాడాలి. ఇంట్లోకి చొరబడే అవకాశం ఇవ్వకూడదు. అలాగే వారి చేతికి అందనంత దూరంగా నిలబడాలి.
- రోడ్డు మీద వెళ్లేటప్పుడు, ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు అపరిచిత వ్యక్తులతో సంభాషణ వద్దు.

ఊరు వెళితే..

- వేసవి సెలవులకు ఇల్లు తాళం వేసి ఊరు వెళదామనుకుంటే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్ఎంఎస్) యాప్ ద్వారా పోలీసులకు రిక్వెస్ట్ పెట్టుకుంటే ఒక కెమెరా ఇంటిలో అమరుస్తారు. ఆధునిక సాంతిక పరిజ్ఞానం ద్వారా ఇంట్లోకి ఎవరైనా చొరబడితే పోలీసులకు తెలుస్తుంది.
- ఊరు వెళుతున్నట్టు స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే నైట్ బీట్‌ను ఆ ఇంటివైపు పంపించి, పర్యవేక్షిస్తారు.
- విలువైన వస్తువులు బ్యాంకు లాకర్‌లో ఉంచాలి. లేదా మీతో పాటు తీసుకొని వెళ్లడమో, మరో భద్రమైన చోట ఉంచడమో చేయాలి.
- అత్యవసర సమయాల్లో 112 నెంబరుకు ఫోన్ చేయాలి.

- ఆంధ్రజ్యోతి, ఎంవీపీ కాలనీ

చందనోత్సవ మృతులకు నివాళులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

వెంకోజీపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం చందనోత్సవంలో గోడ కూలి దుర్మరణం పాలైన 15వ వార్డు పాత వెంకోజీపాలెం ఉమానగర్‌కు చెందిన గుజ్జారి మహాలక్ష్మి, పిల్లా ఉమామహేశ్వరరావు, పిల్లా శైలజ, పైలా వెంకటరత్నంలకు శనివారం దినకార్యం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని మృతులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, అప్పారి గిరిబాబు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, చెల్లుబోయిన గోవింద్, మహేష్, సోని, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మ తొలగించరా!



పిఠాపురం కాలనీ రామాలయం వద్ద వేలాడుతున్న చెట్టుకొమ్మ

మద్దిలపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 22వ వార్డు పిఠాపురం కాలనీ రామాలయం వీధి మార్గంలో చెట్టు కొమ్మ విరిగి వేలాడుతోంది. నాలుగు రోజుల నుంచి కొమ్మలు వేలాడుతున్నా జీవీఎంసీ సిబ్బంది తొలిగించే ప్రయత్నం చేయలేదు. పారిశుధ్య కార్మికులు ఇక్కడే చెత్త తీసుకుని వెళ్తున్నారు తప్ప విరిగిన కొమ్మలు గురించి పట్టించుకోవడం లేదు. ఇటీవల సీతమ్మధార రోడ్డులో చెట్టు కొమ్మ విరిగిపడి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన జరిగినప్పటి నుంచి స్థానికులు వేలాడుతున్న కొమ్మ కింద నుంచి రాకపోకలు మానేశారు. అధికారులు స్పందించి చెట్టు కొమ్మలు తొలగించాలని కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌లపై నిర్మాణ సామగ్రి వ్యాపారాలు



ఫుట్‌పాత్‌పై వేసిన పిక్క

ఆరిలోవ, మే 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డుపాంతాలయిన 13 వ వార్డులోని కేంద్రకారాగారానికి సమీపంలో గల రామకృష్ణాపురంలో ఫుట్ పాత్‌లపై ఇసుక, పిక్క తదితర భవన నిర్మాణ సామగ్రి వ్యాపారాలు చేస్తున్నారు. దీనివల్ల ఈ ప్రాంతంలో మార్నింగ్ వాకింగ్ చేసే వారు నడవడానికి వీలు లేకుండా పోతోంది ఈ విషయాన్ని అధికారులు కూడా పట్టించుకోవడం లేదని వాకర్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ఫుట్‌పాత్ వ్యాపారాలను అరికట్టాలని కోరుతున్నారు.

పాక్‌కు గుణపాఠంతోనే ప్రజలకు ఆనందం

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని ఉత్తర ఎమ్మెల్యే పూజలు



మాధవధారలోని కుంచుమాంబ ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు

మాధవధార, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల ఏరివేతకు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడం పట్ల విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు హర్షం వ్యక్తం చేశారు. ఆయన 50వవార్డులోని మాధవధార గ్రామ దేవత శ్రీ కుంచమాంబ ఆలయాన్ని స్థానిక నాయకులతో కలసి శనివారం సందర్శించారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ ఆధ్వర్యంలో కుంచుమాంబ ఆలయం వద్ద ప్రత్యేకపూజలు జరిపారు. పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజా క్షేమం కోరుతూ ఆలయ ఆవరణలో కొబ్బరికాయలు కొట్టారు. భారత సైన్యానికి ప్రజలు, రాజకీయ పార్టీల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఇంఛార్జి సురేష్‌బాబు, 51వవార్డు టీడీపీ అధ్యక్షులు సనపల కీర్తి, టి.శ్రీనివాస్, డి.కుమారి, శాంతి హాజరయ్యారు.

సైనికుల క్షేమం కోరుతూ పూజలు



సీతమ్మధారలోని గ్రీన్‌పార్కు కాలనీ వినాయక ఆలయంలో పూజ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నగర అధ్యక్షుడు పరశురామరాజు, ఇతర నాయకులు

సీతమ్మధార, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత సైనికులు, ప్రజలు క్షేమంగా ఉండాలని ప్రార్థించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామరాజు పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 14వ వార్డు సీతమ్మధార గ్రీన్ పార్క్ కాలనీలోని వినాయక ఆలయంలో వార్డు అధ్యక్షుడు రాకేష్ ఆధ్వర్యంలో శనివారం పూజ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పరుశురామరాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్ణయాలు భారత ప్రజల మనోభావాలకు అద్దం పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉత్తర నియోజకవర్గం కన్వీనర్ ఎం.సురేష్‌బాబు, బీజేవైఎం జనరల్ సెక్రటరీ శంకర్, ఆ పార్టీ ఇతర నాయకులు సంజీవరావు, విజయరామరాజు పాల్గొన్నారు.

పీజీ డిప్లొమో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్, మే 10 (ఆంధ్రజ్యోతి) : సెంచూరియన్ విశ్వవిద్యాలయంతో కలిసి స్వస్థ సూచన్ ఇనిస్టిట్యూట్‌లో కాస్మోటాలజీ, న్యూట్రిషిన్‌లో పీజీ డిప్లొమో కోర్సులు ప్రారంభయ్యాయని విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ తెలిపారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమో కోర్సులను అందించడానికి సెంచూరియన్ విశ్వవిద్యాలయంతో ముఖ్యమైన విద్యా సహకారాన్ని ప్రకటించడం లక్ష్యంగా కోర్సులు ఏర్పాటు చేశారన్నారు.

నౌకాయానంపై ప్రభావం చూపని యుద్ధవాతావరణం

అండమాన్‌కు బయలుదేరిన ప్రయాణికుల నౌక



అండమాన్ బయలుదేరిన ఎంవీ క్యాంప్‌బెల్ బే నౌక (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో యుద్ధ వాతావరణ ప్రభావం విశాఖపట్నం పోర్టుపై ఎటువంటి ప్రభావం చూపలేదు. ప్రయాణికుల నౌకలతో పాటు వాణిజ్య నౌకాలన్నీ యథాప్రకారం రాకపోకలు సాగిస్తున్నాయి. విశాఖపట్నం-అండమాన్ మధ్య ప్రయాణికుల నౌకలు నిత్యం తిరుగుతుంటాయి. యుద్ధ భయం వల్ల ఈ సర్వీసు రద్దు అవుతుందేమోనని చాలామంది భయపడ్డారు. కానీ అటువంటిదేమీ లేకుండానే శనివారం ఇక్కడి నుంచి అండమాన్ నౌక ఎంవీ క్యాంప్‌బెల్ బే బయలుదేరి వెళ్లింది. ఈ నౌకలకు నెల రోజుల ముందుగానే పత్రికల్లో ప్రకటన ఇచ్చి టికెట్లు విక్రయిస్తారు. ఉత్తరాంధ్రాతో పాటు ఒడిశా(బరంపురం)కు చెందినవారు అండమాన్‌లో ఉపాధి అవకాశాల కోసం పెద్ద సంఖ్యలో వెళుతుంటారు. వారే ఈ నౌకల్లో అధికంగా ప్రయాణిస్తారు. షెడ్యూల్ ప్రకారం అండమాన్ ఉంచి ఈ నౌక ఈ నెల ఎనిమిదో తేదీనే వచ్చింది. శనివారం సాయంత్రం ప్రయాణికులను ఎక్కించుకొని చీకటి పడ్డాక బయలుదేరిందని పోర్టు వర్గాలు తెలిపాయి. సుమారు మూడు రోజులు సముద్రంలో ప్రయాణించి గమ్యం చేరుకుంటుంది.

ఖాకీల కలెక్షన్

... 5వ పేజీ తరువాయి

సక్రమంగా పట్టించుకోవడం లేదని, తనను ఇబ్బంది పెడుతున్నందున సన్మార్గంలో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేస్తే, తనను విడాకులు తీసుకోవాలని సదరు అధికారిణి ఒత్తిడి చేయడంతోపాటు, ఆమె భర్త స్నేహితుడైన వ్యక్తి ద్వారా కూడా ఒత్తిడి చేయించారంటూ బాధితురాలు ఫిర్యాదు చేశారు. సీపీ స్పందించి సదరు అధికారిణి నుంచి ఆ కేసును మరొకరికి బదిలీ చేయడంతోపాటు విచారణ జరిపి తనకు అసలు విషయం తెలియజేయాలని నార్త్ ఏసీపీ అప్పలరాజును ఆదేశించారు. ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న ఒక స్టేషన్ సీఐ నైట్ రౌండ్స్ ఉన్నప్పుడు ఒక హోటల్‌లో కూర్చొని వసూళ్ల గురించి హెడ్‌కానిస్టేబుల్‌తో చర్చించుకుంటారని ఆ స్టేషన్ సిబ్బందే చెబుతున్నారు. స్టేషన్‌లో వసూళ్ల బాధ్యతలు చూస్తున్న సదరు హెడ్‌కానిస్టేబుల్ గతంలో కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో పనిచేసినప్పుడు కూడా ఇలాంటి ఆరోపణలే వెల్లువెత్తడంతో ఈస్ట్ సబ్‌డివిజన్‌కు బదిలీ చేశారు. ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉన్న ఒక స్టేషన్‌లో ఏఎస్‌ఐ ఒకరు వసూళ్ల బాధ్యతను భుజానవేసుకున్నారు. వెస్ట్ సబ్‌డివిజన్‌లో జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఒక పోలీస్ స్టేషన్‌లో బ్లూకోట్స్ బాధ్యతలు చూస్తున్న కానిస్టేబుల్ వసూళ్ల బాధ్యత చూస్తున్నారు. ద్వారకా సబ్‌డివిజన్‌లోని వాణిజ్య సముదాయాలు కలిగివున్న ఒక స్టేషన్‌లో మరొక కానిస్టేబుల్ వసూళ్ల బాధ్యతలు చూసుకుంటున్నారని ఉన్నతాధికారులకు ఇప్పటికే ఫిర్యాదు అందినట్టు తెలిసింది. ఈ వ్యవహారాలపై సీపీ శంఖబ్రతబాగ్చికి సమాచారం అందించాల్సిన స్పెషల్‌బ్రాంచి విభాగం తన బాధ్యతలను నిర్వర్తించడంతో విఫలమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి స్టేషన్ పరిధిలో జరిగే అన్నిరకాల వ్యవహారాలతోపాటు శాఖాపరంగా అంతర్గత వ్యవహారాలు, అవినీతిపై సమాచారం సేకరించేందుకు స్పెషల్‌బ్రాంచి విభాగం నుంచి ఒక్కో కానిస్టేబుల్ ఉంటారు. అయినప్పటికీ వారు కూడా స్టేషన్ సిబ్బందితో కుమ్మక్కు అయిపోవడం, గతంలో వారు స్టేషన్‌లో అలాంటి విధుల్లో పనిచేయడం వల్లే అవినీతి, నిర్లక్ష్యాన్ని ఉన్నతాధికారులకు చేరవేయడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సీపీ స్టేషన్లలోని అవినీతిపై దృష్టిసారించాలని నగరవాసులు కోరుతున్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన మేయర్

... 5వ పేజీ తరువాయి

ముందుగా ఆర్కే బీచ్ వద్ద ఉన్న పారిశుధ్య కార్మికుల హాజరుపట్టికను తనిఖీ చేసి...రోజూ కార్మికులు ఎన్ని గంటలకు హాజరవుతున్నారని కాంట్రాక్టర్‌ను ఆరా తీశారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ వారికి సరఫరా చేసిన చీపుళ్లను తనిఖీ చేసి నాణ్యత బాగుండలేదని, వాటిని మార్చాలని, ఇంకా కార్మికులకు అవసరమైన డస్ట్ బిన్లు, తోపుడుబండ్లు సమకూర్చాలని సహాయ వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజును ఆదేశించారు. బీచ్‌లో ప్రతి దుకాణం దగ్గర డస్ట్ బిన్ తప్పకుండా ఉండాలని, అందుకు సహకరించని వారి షాపులను తొలగించాలని సూచించారు. బీచ్ కాలుష్యానికి గురికాకుండా సందర్శకులకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. అనంతరం జగదాంబ జంక్షన్‌లో పనులు పరిశీలించారు. కొన్ని షాపుల వద్ద అధికంగా వ్యర్థాలు రోడ్లపై వేస్తున్నారని ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు కొందరు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. అటువంటి దుకాణాలు, షోరూమ్స్ వద్ద ప్రత్యేకంగా డస్ట్ బిన్స్ వారే ఏర్పాటుచేసుకుని జీవీఎంసీ వాహనాలకు రోజూ అందించేలా నోటీసులు జారీచేయాలని అధికారులకు సూచించారు. రాత్రి పారిశుధ్య పనులలో ఎటువంటి అలసత్వం, లోపాలు లేకుండా నిత్యం విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సహాయ వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్‌ను మేయర్ ఆదేశించారు.

60 ఎకరాల అన్యాక్రాంతానికి కుట్ర

... 5వ పేజీ తరువాయి

భూములకు నిరభ్యంతర పత్రాలు ఇవ్వాలని ఆదేశించారు. విశాఖ రూరల్ మండలం మధురవాడ సర్వేనంబరు 370/1, 367/1, 352/3, కొమ్మాది సర్వే నంబరు 114/1, 150/2, ముడసర్లోవలో 31/2, ఆనందపురం మండలం తర్లువాడలో సర్వే నంబరు 3/3, పెందుర్తి మండలం ఎస్ఆర్ పురంలో సర్వేనంబరు 99, గాజువాక మండలం వడ్లపూడిలో సర్వే నంబరు 122/1, శనివాడలో సర్వేనంబరు 92, తలారివానిపాలెంలో 35/4లో భూములతోపాటు జిల్లాలో మరికొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూములకు రమారమి 60 నుంచి 70 ఎకరాలకు నిరభ్యంతర పత్రాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు పేర్కొన్న కొన్ని సర్వే నంబర్లలో భూములకు ఎన్‌వోసీ ఇవ్వాలని అధికారులను మౌఖికంగా ఆదేశించారు. ఆ భూములకు ఎన్‌వోసీ ఇవ్వలేమని, కొన్ని భూములు సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ఉన్నాయని, మిగిలినవి ప్రభుత్వ భూములేనని పేర్కొంటూ...వాటిపై కోర్టులో కేసులు ఉన్నాయని నివేదించారు. అయితే సదరు ఉన్నతాధికారి ఈ ఏడాది జనవరి నుంచి ఒక్కొక్క దానికి నిరభ్యంతర పత్రాలు జారీచేయాలని ఆదేశించారు. ఈ విధంగా సుమారు 12 నుంచి 15 సర్వే నంబర్లకు ఆదేశాలు వచ్చాయి. ముడసర్లోవ రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో భూములకు ఎటువంటి పట్టాలు ఇవ్వకూడదు. అందుకు అనుగుణంగా చాలాకాలం క్రితం ఇచ్చిన పట్టాలను అప్పట్లోనే రద్దు చేసినా వాటిపై కొందరు పోరాటం చేస్తున్నారు. నీటి ప్రవాహాలు, చెరువులు, వాగులు ఎవరికీ ఇవ్వరాదని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దీని ప్రకారం ముడసర్లోవలో నీటి ప్రవాహం ఉన్న ప్రాంతంలో భూములకు నిరభ్యంతర పత్రాలు ఇవ్వకూడదు. ఇదే తీర్పు మేరకు వడ్లపూడిలో చెరువుకు ఎన్‌వోసీ ఇవ్వకూడదు. ఇంకా పక్కాగా ప్రభుత్వ భూమి అని తేలిన చోట్ల కూడా ఎన్‌వోసీ ఇవ్వాలని సదరు ఉన్నతాధికారి ఆదేశించారు. ఆయా భూములకు ఎన్‌వోసీ ఇవ్వలేమని జిల్లా యంత్రాంగం ఇటీవల ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అప్పటికే రెవెన్యూ ఉన్నతాధికారిని ఆ స్థానం నుంచి తప్పించిన ప్రభుత్వం...జిల్లాల్లో ఎన్‌వోసీ ఇవ్వాలని ఆయన సిఫారసు చేసిన భూములపై ఆరా తీసింది. ఎన్‌వోసీ ఇవ్వాలన్న భూముల వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు?...అన్నదానిపై వివరాలు సేకరిస్తుంది.

భారత్‌తో పెట్టుకుంటే పాక్ నాశనమే

... 5వ పేజీ తరువాయి

వివరాలు ఆయన మాటల్లోనే...

పాకిస్థాన్‌తో యుద్ధంలో సేవలు..

1970లో నౌకాదళంలో కమిషన్డ్ ఆఫీసర్‌గా చేరా. విధుల్లో చేరిన ఏడాదికే అంటే 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో పాల్గొన్నాను. అరేబియా మహా సముద్రంలో పాకిస్థాన్ యుద్ధ విమానాలు, జలాంతర్గాములను వేటాడేందుకు 'ఐఎన్ఎస్ కుఠార్' యుద్ధనౌకలో సిగ్నల్ కమ్యూని కేషన్ ఆఫీసర్‌గా పనిచేశాను. మరో రెండు యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ ఖుక్రీ, కిర్పాన్ కూడా అదే సముద్రంలో సేవలు అందించాయి. పాకిస్థాన్‌కు చెందిన జలాంతర్గామి దాడిలో (టార్పెడోలు ఫైరింగ్) ఐఎన్ఎస్ ఖుక్రీ మునిగి పోయింది. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో సిబ్బంది ప్రాణాలను మేము కాపాడాం. పద్దెనిమిది రోజులపాటు జరిగిన యుద్ధంలో పాక్ విమా నాలు, సబ్ మెరైన్స్‌పై దాడి చేసే లక్ష్యంతో ముందుకుకదిలాం. నాడు పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో భారత్ అద్భుతమైన పోరాటాన్ని కొనసాగించింది. కరాచీ కూడా ఆధీనంలోకి వచ్చింది. అప్పుడు కాల్పుల విరమణ ప్రకటన రాకపోయి ఉండి ఉంటే ఇప్పుడు ఇటువంటి పరిస్థితులు ఉండేవి కావు. కానీ, ప్రభుత్వం అప్పటి పరిస్థితుల దృష్ట్యా కాల్పుల విరమణ ప్రకటించడంతో భారత సైన్యం వెనక్కి వచ్చింది.

త్రివిధ దళాలు సర్వసన్నద్ధం

భారత్ త్రివిధ దళాలు నిరంతరం సర్వసన్నద్ధంగా ఉంటాయి. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసే సిబ్బంది దేశభక్తితో పనిచేస్తారు. ప్రాణాలు ఇచ్చేందుకు కూడా వెనుకాడరు. ఇక పాకిస్థాన్‌తో యుద్ధం అంటే వేయి రెట్లు కసి, వేగంతో సైన్యం ముందుకు కదులుతుంది. ప్రభుత్వం ముందుకు వెళ్లాలని భావిస్తే మాత్రం పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పడం ఖాయం. ఈ విషయంలో భారత్ శక్తి, సామర్థ్యాలకు తిరుగులేదు.

పాకిస్థాన్ చేసేదేమీ లేదు..

పహల్గాంలో ఉగ్రమూకలు అమాయకులైన పర్యాటకులను చంపారు. మనం ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేస్తే, పాకిస్థానేమో భారత్‌పై దాడులకు తెగబడుతోంది. అంటే, ఇంకా పాకిస్థాన్ బుద్ధి మారలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో పాకిస్థాన్ చేసేది ఏమీ లేదు. అగ్రరాజ్యాలు అయిన అమెరికా, రష్యా మన వైపు ఉన్నాయి. కరాచీ పోర్టుపై భారత్ దాడి చేసినట్టు చెబుతున్నారు. అదే జరిగితే పాక్ కోలుకోవడం ఇప్పట్లో సాధ్యం కాదు. మరోవైపు బలూచిస్తాన్ వాళ్లు తిరగబడుతుండడంతో అంత ర్యుద్ధంతో అల్లాడుతోంది. అక్కడ క్షేత్రస్థాయిలో అత్యంత దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. అన్నింటికంటే భారత్ సైన్యం దేశభక్తితో పని చేస్తుంది. కాబట్టి, మన సైన్యాన్ని ఎదుర్కోవడం పాకిస్థాన్‌కు అంత సులభం కాదు.

వెయిట్ లిఫ్టింగ్‌లో పృథ్వికి రజతం



విజేతలతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్సు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా యూత్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో అప్పనేని పృథ్వి ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పతకం అందించాడు. బిహార్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శనివారం 55 కిలోల పురుషుల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించిన పృథ్వి...స్నాచ్‌లో 98 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 114 కిలోల (207 కిలోలు) బరువెత్తి రజత పతకం సాధించాడు. 55 కిలోల వెయిట్ కేటగిరికి ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ కార్యదర్శి ఆనందే గౌడ, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కంచరాన సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు పతకాలు అందించి అభినందించారు.

కంటి ఆస్పత్రి గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కవిత



విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ కంటి ఆస్పత్రి గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా డి.కవిత శనివారం బాధ్యతలు చేపట్టారు. కేజీహెచ్‌లో హెడ్ నర్సుగా పనిచేసిన ఆమె పదోన్నతిపై కంటి ఆస్పత్రికి వచ్చారు. ఈ సందర్భంగా నర్సింగ్ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

మహనీయులకు సాహితీవేత్తల ఘన నివాళి



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

కంచరపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి): సాహితీ స్రవంతి విశాఖ జిల్లా సమావేశం శనివారం కంచరపాలెం బీఎస్ఆర్ భవనంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు పొలమరశెట్టి ప్రాన్సిస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సభ్యులు పాల్గొని మహనీయులకు ఘనంగా నివాళులర్పించారు. మే డే, అల్లూరి సీతారామరాజు వర్ధంతి, రవీంద్రనాథ్ ఠాగూర్‌ల జయంతి తదితర కార్యక్రమాల నేపథ్యంలో మహనీయుల సేవలను కొనియాడారు. అనంతరం సభ్యుల ఆధ్వర్యంలో సాహితీ ప్రక్రియలు కవిత, పాట, పద్యాలతో సమావేశం కొనసాగింది. ఈ కార్యక్రమంలో సభ్యులు డా.కె.వి.రమణ, ఉమాశంకర్, ఎం.ఆనంద్ శర్మ, హరి వెంకటరమణ, రెడ్డి రామకృష్ణ సంతోషమ్మ, గోపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించారు. పాత మీటర్లు తీసేసి, కొత్తవి ఇస్తున్నారు.

స్మార్ట్ మీటర్లు కొందరికే...

స్మార్ట్ మీటర్లు విద్యుత్ వినియోగదారులు అందరికీ ఇవ్వం. ఎక్కువ విద్యుత్ అంటే నెలకు 200 యూనిట్లు పైబడి ఉపయోగించే వారికి మాత్రమే ఏర్పాటుచేస్తాం. మిగిలిన వారికి పాత మీటర్లే ఉంటాయి. గ్రూపు హౌస్‌లు, అపార్ట్‌మెంట్లలో ఉండేవారికి తప్పనిసరి అనే నిబంధన కూడా లేదు. తక్కువ విద్యుత్ ఉపయోగించుకొని, ప్రభుత్వ రాయితీ పొందే వర్గాలకు ఇవ్వరు. స్మార్ట్ మీటర్ల వ్యయం వినియోగదారుల నుంచి వసూలు చేస్తారనే అపోహలు కూడా ఉన్నాయి. ఈపీడీసీఎల్ ఎప్పుడూ మీటర్ల వ్యయం వినియోగదారుల నుంచి వసూలు చేయలేదు. అది సంస్థ ఆస్తిగానే ఉంటుంది. కాకపోతే స్మార్ట్ మీటరు పెట్టుకునేవారు ముందుగానే వారి సగటు వినియోగం ఎంతో ఆ మొత్తంతో రీచార్జి చేసుకోవలసి ఉంటుంది.

- శ్యాంబాబు, ఎస్ఈ, విశాఖ సర్కిల్

మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్న కేంద్రం

- సీపీఐ జిల్లా మహాసభల ప్రారంభ ర్యాలీలో నాయకులు ధ్వజం



ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

కంచరపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని సీపీఐ రాష్ట్ర సమితి సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరావు, జె.వి.సత్యనారాయణమూర్తి ఆరోపించారు. సీపీఐ విశాఖ జిల్లా మహాసభలు సందర్భంగా శనివారం కంచరపాలెం మెట్టు నుంచి ఐటీఐ జంక్షన్ వరకు ప్రజా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఐటీఐ జంక్షన్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో నాయకులు మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 2014లో ఇచ్చిన హామీలనే నెరవేర్చలేదన్నారు. ఏటా రెండ కోట్ల ఉద్యోగాల కల్పన, నల్లధనాన్ని వెలికితీసి ప్రజలకు పంచుతామన్న బీజేపీ హామీలు ఏమయ్యాయంటూ ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాల హామీతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వాటి అమలును పక్కన పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై మే 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 12 ఏళ్లుగా కనీస వేతనాలు సవరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి అమరావతి తప్ప మరేమీ కనిపించడం లేదన్నారు. నెల రోజుల క్రితం రిజిస్టరైన సంస్థకు విశాఖలో కేవలం 99 పైసలకు భూములు కేటాయించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, పార్టీ నాయకులు మానం అంజనేయులు, ఎ.జె.స్టాలిన్, సీహెచ్.రాఘవేంద్రరావు, డి.ఆదినారాయణ, పి.చంద్రశేఖర్, ఎం.మన్మధరావు, రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వైభవ వేంకటేశ్వరస్వామి

మాదవధార, మే 10 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 23వ వార్షిక కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 8న ఆరంభమైన ఉత్సవాలు 12 వరకు కొనసాగనున్నాయి. శనివారం స్వామి వారికి సుప్రభాత సేవతో పూజావిధులు ఆరంభించారు. శ్రీవారికి చక్రస్నానం, వసంతోత్సవం జరిపారు. యుద్ధ వాతావరణంలో జరుగుతున్న వేడుకల్లో ఈ రోజు స్వామి ఆలయంలో ఆలయ సిబ్బంది, అర్చకులు అంతా జెండాలు, మూడు రంగుల చేతి బాండ్లు ధరించి పాల్గొన్నారు. ఉదయం ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు భారత్- పాకిస్థాన్‌ల మధ్య శాంతియుత వాతావరణం నెలకొనాలని ఆకాక్షించారు. ప్రధాని మోదీ నాయకత్వానికి మద్దతుగా సైన్యానికి జేజేలు పలుకుతున్న ప్రజలను ప్రశంసించారు. ఆలయ ఆవరణలో మహా అన్నదానం జరిపి స్వామి ప్రసాదాల్ని అందజేశారు. సాయంత్రం 6 గంటలకు పుష్పాంజలి, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ, సిబ్బంది, అర్చకులు ఉత్సవ నిర్వహణ చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు దివ్య తిరు కల్యాణ మహోత్సవానికి హాజరయ్యారు.

మామూళ్ల వసూలు ముమ్మాటికీ వాస్తవం

... 5వ పేజీ తరువాయి

చూసుకుంటున్నారని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే ఇంటెలిజెన్స్ వర్గాలు మాత్రం దీనిపై లోతుగా విచారణ జరిపినట్టు సమాచారం. వారంతా సాధారణ వ్యక్తుల్లా మద్యం వ్యాపారులతో మాటలు కలిపి మద్యం దుకాణం/బార్ నిర్వహణకు సంబంధించిన సాధకబాధకలను ఆరా తీసినట్టు తెలిసింది. ఈ క్రమంలో పోలీసులకు నెలవారీ మామూళ్లు ఇవ్వాలని ఒత్తిళ్లు పెరగడంతో తప్పనిసరి పరిస్థితిలో చేయాల్సి వస్తోందని చెప్పినట్టు సమాచారం. దీంతో ఆయా వివరాలను ఉన్నతాధికారులకు చేరవేశారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంలో పేర్కొన్నట్టు మద్యం వ్యాపారుల నుంచి పోలీసులు మామూళ్లు గుంజుతుండడం వాస్తవమేనని నిర్ధారించి, సమగ్ర నివేదిక తయారుచేసి ఇటీవల ప్రభుత్వానికి పంపించినట్టు తెలిసింది.

విద్యుత్ లోకోషెడ్‌లో రైల్వే జీఎం తనిఖీలు



తనిఖీల్లో జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్, డీఆర్ఎం లలిత్ బొహ్రా తదితరులు

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే, విశాఖలోని విద్యుత్ లోకోషెడ్‌లో తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శనివారం తనిఖీలు చేశారు. విద్యుత్ లోకోషెడ్‌లోని వీల్ షాప్, ట్రాక్షన్ కన్వర్టర్ పవర్ మాడ్యూల్ మరమ్మతుల విభాగం, ట్రాక్షన్ మోటారు బేరింగ్ పరీక్ష మిషన్, ట్రాక్షన్ మోటారు రోటరీ బ్యాలన్సింగ్ మిషన్లను తనిఖీ చేశారు. అలాగే బోరో స్కోప్, హోటల్ లోడ్ కన్వర్టర్, హెవీ లిఫ్టింగ్ బే ఎక్స్‌టెన్షన్ పనులను పరిశీలించారు. అనంతరం లోకోషెడ్‌లో వివిధ నిర్వహణ సౌకర్యాలు, యూనిట్లు, ఇతర సదుపాయాలు పరిశీలించి సాంకేతిక నిపుణులు, సిబ్బందితో పలు అంశాలపై చర్చించి అభిప్రాయాలు సేకరించారు. అలాగే లోకో షెడ్ విస్తరణతోపాటు చేపట్టాల్సిన అభివృద్ధి కార్యకలాపాలు, పురోగతిలో ఉన్న నిర్మాణ పనులు వంటి అంశాలపై డివిజనల్ అధికారులతో సమీక్షించారు. ఈ పర్యటనలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు

పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా), మే 10 (ఆంధ్రజ్యోతి): మన్యంవాసుల ఆరాధ్య దేవత పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ, ఐటీడీఏ యంత్రాంగం ఏర్పాట్లుచేశాయి. మోదకొండమ్మను అత్తవారి ఇంటి నుంచి పుట్టింటికి తీసుకువచ్చే తంతుతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. స్థానిక ఆలయం (అత్తవారిల్లు) నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలను ఆదివారం ఉదయం భారీ ఊరేగింపుతో పుట్టిల్లుగా బావించే శతకంపట్టు పందిరిలో ఉంచుతారు. సోమ, మంగళవారాలు కూడా శతకంపట్టులోనే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మంగళవారం సాయంత్రం శతకంపట్టు నుంచి అమ్మవారిని తిరిగి ఆలయానికి చేర్చడం (అనుపోత్సవం)తో ఉత్సవాలు ముగుస్తాయి.

సెవెన్‌హిల్స్‌లో అవయవ మార్పిడి వైద్య సేవలు

మహారాణిపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో గుండె, ఊపిరితిత్తులు అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభిస్తున్నట్లు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కె.ఆర్.బాలక్రిష్ణన్ తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో తొలిసారిగా ఈ క్లినికల్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. నాలుగేళ్ల చిన్నారుల నుంచి పెద్దవయసు వారికి అవయవమార్పిడి చికిత్స నిర్వహిస్తామని తెలిపారు. సీఈవో వింగ్ కమాండర్ ఎంకే బోస్, డాక్టర్ సురేష్ రావు, డాక్టర్ సుమిత్రా రాయ్ పాల్గొన్నారు.

ప్రేమ సమాజం ముంగిట పెళ్లి సందడి



నూతన వధువును ఆశీర్వదించడానికి వచ్చిన సీపీ బాగ్చికి ప్రేమ సమాజం నిర్వాహకుల సత్కారం



నేడు పెళ్లి బంధంతో ఒక్కటి కానున్న జంట రాఘవేంద్ర, ఆశ్రిత శివజ్యోతి

డాబాగార్డెన్స్, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రేమ సమాజం ముంగిట పెళ్లి సందడి నెలకొంది. ప్రేమించుకున్న అంధుల జంట పెద్దలు, ఇతర ప్రముఖుల ఆశీస్సులతో ఆదివారం వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారు. ఇందుకు శుభారంభంగా శనివారం ఉదయం పెళ్లి రాట వేశారు. కంచర్ల అన్నపూర్ణాదేవి వేదికగా ప్రేమ సమాజంలో ఆశ్రయం పొందిన ఆశ్రిత శివజ్యోతి, అనంతపురం జిల్లా బుక్కపట్నం గ్రామానికి చెందిన ఎనుముల గంగన్న, నారాయణమ్మల కనిష్ఠ పుత్రుడు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి రాఘవేంద్రల వివాహానికి అంతా సిద్ధమైంది. మండపాన్ని సుందరగా తీర్చిదిద్దారు. ఆంగ్ల భాషలోని ఓ చిన్న సందేహ నివృత్తికి రాఘవేంద్రను సంప్రదించిన ఆశ్రిత.. క్రమంగా ఆ పరిచయం ప్రేమకు దారితీసి పెళ్లి పీటల వరకు తీసుకురావడం విశేషం.కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి రాఘవేంద్ర తనలాగే కంటి చూపులేని యువతిని తన జీవితభాగస్వామిగా ఎంచుకోవడం, ఇద్దరూ విద్యావంతులు కావడం, వీరికి పెద్దల ఆశీర్వాదం లభించడంతో వీరిని కలిపేందుకు ప్రేమ సమాజం నడుంబిగించింది.

ప్రేమ సమాజం ప్రాంగణంలో శనివారం పెళ్లి రాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శివజ్యోతిని పెళ్లి కుమార్తెగా ముస్తాబు చేశారు. ఆమెకు తాళిబొట్టు, వెండిమెట్టలు, పసుపు కుంకుమ, స్వీట్లను డాక్టర్ కందుల నాగరాజు, నళినిదేవి దంపతులు అందజేశారు. మద్దిలపాలెం ప్రాంతానికి చెందిన వ్యాపారవేత్త పార్దు కోసూరు మంగళసూత్రం అందజేసి అందరినీ ఆనందానికి గురిచేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమ సమాజం అధ్యక్షుడు బుద్ధ శివాజీ అధ్యక్షత వహించగా కార్పొరేటర్ కందుల నాగరాజు, నళిని దేవి, టూ టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎర్రంనాయుడు, ఈస్ట్ ట్రాఫిక్ సర్కిల్ 1 సీఐ ఎం.శ్రీను, సమాజం కార్యదర్శి హరిమోహన్‌రావు, సభ్యులు ఎస్.అప్పలరాజు, ప్రేమ గణపతిరావు, గంట్ల శ్రీనుబాబు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వధువుకు సీపీ ఆశీర్వాదం

వధువును ఆశీర్వదించేందుకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ప్రేమ సమాజానికి వచ్చారు. పెళ్లి కుమార్తెను ఆశీర్వదించారు. ఇద్దరూ జీవితంలో ఉన్నతస్థానాలకు వెళ్లాలని, అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

కాశీ అన్నపూర్ణదేవిగా పోలమాంబ అమ్మవారు



పూజలు అందుకుంటున్న పోలమాంబ అమ్మవారు

మద్దిలపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి) : వాజీపాలెం గ్రామదేవత పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శనివారం అమ్మవారిని కాశీ అన్నపూర్ణదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. శ్రీకృష్ణ సేవాసంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో సాయంత్రం సినీ డూప్స్‌తో నిర్వహించిన నాటకప్రదర్శనలు అలరించాయి.

నేడు టీటీడీ కల్యాణ మండపంలో పుష్ప సంకల్పం

ఎంవీపీ కాలనీ, మే 10 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలోని శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో బిల్వపత్ర పుష్పయాగం ఈ నెల 12న నిర్వహించనున్నారు. అక్కడకు అవసరమైన కలువ, తామర, మల్లె, గులాబి, సంపెంగ తదితర పుష్పాలను ఆదివారం ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపంలో సంకల్పం చేసి పంపించనున్నట్టు వేంకటేశ్వర స్వామిభక్తులు హిమాంశు ప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల భక్తులు హాజరుకావచ్చని పేర్కొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

వెంకోజీపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ ఎంఎంటీసీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం పెద్ద ఎత్తున భక్తులు క్యూ కట్టారు. దీంతో పలు స్వచ్ఛంద సంస్థలు ప్రసాదంతో పాటు మజ్జిగను కూడా పంపిణీ చేశాయి. ఎండలో వచ్చే భక్తులు భగవంతుడి దర్శనం అనంతరం బయటకు వచ్చి ప్రసాదం తీసుకుని, మజ్జిగను తాగి సేద తీరారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణలు గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. ఆలయం బయట ఆలయ కమిటీ కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజరు బి.సన్యాసిరావులు వివిధ దాతలతో మజ్జిగను పంపిణీ చేయించి వేసవిలో భక్తులకు అందించారు. దీంతో ఆలయానికి వచ్చిన భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

సినిమా గైడ్

- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 13, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 40 దొండకాయలు 26, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)48, బరబాటి 34, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 90, బద్దచిక్కుడు 48, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 90, కీరదోస 34, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 38, కంద 84, దేముడు చిక్కుడు 44, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 26, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240

పార్కు స్థలంలో వాణిజ్య సముదాయం నిర్మాణామా?

- పితాపురం పార్కు వ్యవహారంలో స్టేటస్ కో విధించిన హైకోర్టు
- పార్కులో పరికరాల తొలగింపుపై ఆగ్రహం
- జీవీఎంసీ అధికారుల తీరుపై ఆక్షేపణ



షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం చదును చేసిన పార్కు స్థలం

మద్దిలపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డు పితాపురం కాలనీ పార్కులోని కొంతభాగంలో జీవీఎంసీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించే ప్రయత్నాలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. పార్కులోని జిమ్ పరికరాలు, క్రీడా సామగ్రి తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్కు స్థలాల్లో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టడం చట్ట వ్యతిరేకమని తేల్చిచెప్పింది. పార్కు స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించవద్దని జీవీఎంసీని ఆదేశిస్తూ పార్కు స్థలంపై స్టేటస్ కో ఇచ్చింది.

1978లో పితాపురం కాలనీ లే అవుట్ వేసి నిబంధనల ప్రకారం కాలనీవాసులకు ఓపెన్ స్పేస్ కింద విడిచిపెట్టిన స్థలంలో పార్కు నిర్మించారు. పార్కులోని కొంత భాగంలో 1990లో జీవీఎంసీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించింది. ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆ భవనం స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి ప్రతిపాదించారు. జీవీఎంసీ రూ.1.68 కోట్లు మంజూరు చేసింది. అయితే పాత భవనం స్థలానికి పార్కులోని కొంత భాగం ఆక్రమించుకుని పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయాలని అధికారులకు కార్పొరేటర్ సూచించారు.

ఈ క్రమంలో పార్కులో అక్రమ వ్యాపారాలు, నిర్మాణాలు ఉన్నాయని, వాటిని తొలగించాలని ఆయన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ ఫిర్యాదుతో జీవీఎంసీ సిబ్బంది పార్కులోని క్రీడాపరికరాలు, బెంచీలు తొలగించి స్థలాన్ని చదును చేశారు. దీంతో కాలనీ సంఘం వారు జీవీఎంసీ అధికారులను అడ్డుకున్నారు. పార్కు స్థలం ఆక్రమించుకునే ప్రయత్నం జరుగుతోందంటూ ఈ నెల 6న హైకోర్టును ఆశ్రయించారు. కాలనీ వాసులు వాదనలు విన్న హైకోర్టు జీవీఎంసీ చర్యలను తప్పుబడుతూ శనివారం పార్కు స్థలంపై స్టేటస్-కో ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పితాపురం కాలనీ అసోసియేషన్ అధ్యక్షురాలు రమాప్రభ, కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గకుండా జీవీఎంసీ అధికారులు పార్కును పరిరక్షించాలని కోరారు.

కృష్ణా కళాశాలలో ఇంటర్ అడ్మిషన్ల సందడి

- ప్రభుత్వ ఆదేశాలతో విద్యార్థుల ప్రవేశాలపై అధ్యాపకుల ప్రత్యేక శ్రద్ధ



కృష్ణా కళాశాల గేటు వద్దే అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్న అధ్యాపకులు


మద్దిలపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు పెరగాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అధ్యాపకులు పరుగులుపెడుతున్నారు. పదో తరగతి విద్యార్థులు వివరాలు తెలుసుకుని వారి ఇళ్లకు వెళ్తున్నారు. వేసవి సెలవుల్లోసైతం కళాశాలలు తెరచిసిబ్బంది మొత్తం అడ్మిషన్లపైనే దృష్టి సారిస్తున్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు గేటు వద్దకే మకాం మార్చారు. కృష్ణా కళాశాల ప్రాంగణంలో వొకేషనల్, జనరల్ రెండు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలలు అడ్మిషన్లలో పోటీ పడుతున్నాయి.

కృష్ణా కళాశాల ప్రవేశ ద్వారం నుంచి కార్యాలయం వరకు వెళ్లాలంటే 300 మీటర్ల దూరం ఉంటుంది. విద్యార్థులకు అంతా దూరం కూడా రానీయకుండా ప్రవేశ ద్వారం వద్ద చెట్ల కింద కుర్చీలు వేసుకుని ఒకేషనల్, జనరల్ కళాశాల అధ్యాపకులు విధులు నిర్వహిస్తున్నారు. అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థులకు అక్కడే వివరాలు తీసుకుని దరఖాస్తులు అందిస్తున్నారు. మరి కొంతమంది అధ్యాపకులు ప్రైవేటు స్కూల్స్‌లో టెన్త్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల చిరునామాలు తీసుకుని వారి ఇళ్లకు వెళ్తున్నారు. తల్లిదండ్రులకు కృష్ణా కళాశాలలో సదుపాయాలు, ఫీజుల వివరాలు వివరించి కళాశాలలో చేర్పించాలని కోరుతున్నారు.

ఈ నెల 31 వరకూ తొలి విడత అడ్మిషన్లను చేపడతారు. వేసవి సెలవుల అనంతరం కళాశాల తరగతులు ప్రారంభమైన తర్వాత రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుంది. అక్కడకు మరికొన్ని రోజుల అనంతరం మూడో విడతగా అడ్మిషన్లు చేపడతారు.

శంఖుచక్రనామాల వెలుగుల సమయం పెంపు

- వేకువ జామున 4 నుంచి 6 గంటల వరకూ..
- సాయంత్రం 6 నుంచి 10:30 గంటల వరకూ వెలిగేలా చర్యలు



కైలాసగిరిపై వెలుగుతూ కనిపిస్తున్న శంఖుచక్రనామాలు

ఎంవీపీ కాలనీ, మే 10 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిపై శంఖుచక్ర నామాల వెలుగుల సమయాన్ని పెంచారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి చూస్తే నగరానికి ప్రత్యేక ఆకర్షణగా కనిపించే విధంగా కైలాసగిరిపై శంఖుచక్ర నామాల వెలుగులు కనిపిస్తుంటాయి. అయితే ఇవి సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి తొమ్మిదింటి వరకూ మాత్రమే వెలుగుతున్నాయి. నగరవాసుల వినతి మేరకు వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ వీటి వెలుగుల సమయాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. దీంతో సాయంత్రం ఆరు నుంచి రాత్రి పదిన్నర వరకూ ఉంచడమే కాకుండా తెల్లవారు జామున నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకూ కూడా వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

కళావిహీనంగా అబ్దుల్ కలాం పార్కు


- కూలిన ప్రహరీ గోడలు
- విరిగిన వాకింగ్ ట్రాక్ పలకలు
- రాత్రిపూట పశువుల సంచారం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నిస్తేజంగా ఉన్న పార్కు లోపల ప్రాంతం

వెంకోజీపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల ఆటపాటలతో... వృద్ధుల ఆహ్లాదంతో.. యువకుల వ్యాయామాలతో కళకళలాడాల్సిన 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కు నేడు అస్తవ్యస్తంగా మారింది. ఐదేళ్ల క్రితం గత టీడీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న ఈ పార్కుకు చుట్టూ ప్రహరి గోడ నిర్మాణం, రెండు గేట్లు, వాకింగ్ ట్రాక్, బోరింగ్ వంటివి ఏర్పాటు చేశారు. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వ హయాంలో పార్కు నిర్వహణ గురించి కనీసం పట్టించుకోలేదు. స్థానిక కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఆమె భర్త అప్పారావు దృష్టికి ఎన్నిసార్లు విన్నవించినా వారు పట్టించుకున్నదే లేదు. సరికదా.. ఈ పార్కులో సచివాలయం నిర్మాణం చేపడతామంటూ అప్పటి మేయర్ గొలగాని హరివెంకట కుమారి చేతుల మీదుగా శంకుస్థాపన కూడా చేయించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో పార్కులో కట్టడాలు వద్దంటూ ఉత్తర్వులు రావడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఆ తర్వాత తూతూ మంత్రంగా పార్కులో మూడు వ్యాయాయ సామాగ్రిని షాడో కార్పొరేటర్ మొల్లి అప్పారావు ఏర్పాటు చేయించి చేతులు దులుపుకున్నారు.

అయితే కూటమి ప్రభుత్వం వచ్చినప్పటికీ ఈ పార్కు దుస్థితి మారలేదు. నిర్వహణ లేకపోవడంతో ప్రస్తుతం పార్కులో వాకింగ్ ట్రాక్‌పై పలకలు విరిగి అస్తవ్యస్తంగా తయారైంది. చిన్న గేటు పూర్తిగా విరిగి మూలకు చేరింది. అంతేకాకుండా పార్కులో కొన్ని ప్రైవేటు శుభకార్యాలు చేసుకునేందుకు అవకాశం ఇస్తుండడంతో ఎవరో ఒక వైపు గోడను విరగొట్టేశారు. ఇటీవల గాలికి పార్కుకు మరో పక్క భారీ చెట్టు నేల కొరిగి గోడను విరగొట్టేసింది. దీంతో పార్కు పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది.



పార్కులో సంచరిస్తున్న పశువులు



వాకింగ్ ట్రాక్‌పై విరిగిన సిమెంటు పలకలు

ఈ పార్కులో ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఇక్కడ కొందరు స్థానిక యువత షటిల్, కరాటే శిక్షణ, పాదచారులలో సందడిగా కనిపిస్తుంది. సెలవు రోజుల్లో పిల్లలు చేరి ఆడుతుంటారు. అయితే ఒకప్పటిగా పార్కు సుందరంగా లేదు. కళావిహీనంగా తయారైంది. పిల్లలు ఆడేందుకు క్రీడా సామగ్రి లేదు. పెద్దలు కూర్చునేందుకు సరైన సదుపాయం లేదు. పరిసరాలు కూడా అధ్వానంగా తయారయ్యాయి. పార్కుకు గేట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో పశు సంచారం ఎక్కువైంది. పర్యవేక్షణ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది.

అందరికీ అందుబాటులో ప్రాంతంలో ఉన్న ఈ పార్కును అభివృద్ధి చేయాలని ఎన్నిసార్లు స్థానికులు, ఆటగాళ్లు, వ్యాయామం చేసే వారు కోరుతున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు. దీంతో రోజురోజుకూ ఈ పార్కు కళావిహీనంగా తయారవుతోంది. ఇప్పటికైనా పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎవరో తవ్వేశారు..! ఎవరూ పూడ్చరూ..!!

- ఏఎస్ రాజా మైదానం రహదారి సమీపంలో గోతులు



ఏఎస్ రాజా మైదానం సమీపంలో తవ్వేసిన ఫుట్‌పాత్

ఎంవీపీ కాలనీ, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ డబుల్ రోడ్డు ఏఎస్ రాజా మైదానం సమీపంలో దొంగలు రోడ్డు, ఫుట్‌పాత్ తవ్వేసి టెలిఫోన్ కేబుళ్లను ఎత్తుకుపోయారు. ఈ వ్యవహారంపై కేసు నమోదైంది. ఇది జరిగి దాదాపు మూడు నెలలు కావొస్తోంది. కానీ జీవీఎంసీ అధికారులు ఇప్పటికీ వీటిని పూడ్చలేదు. ఫుట్‌పాత్ సగం తవ్వేసి ఉంది. దానిని ఆనుకుని రోడ్డును తవ్వి, ఆ మట్టిని కూడా రోడ్డుపైనే గుట్టగా ఉంచేశారు. ఈ రహదారి బాగా రద్దీగా ఉంటుంది. ముఖ్యంగా సాయంత్రం, రాత్రి ఎక్కువ గా వాహన రద్దీ ఉంటుంది. దీనివల్ల వాహన రాకపోకలకే కాకుండా, పాదచారులకు చాలా ఇబ్బంది ఎదురవుతోంది. దీనికి బీఎస్ఎన్ఎల్ అధికారులు బాధ్యత వహిస్తారో, జీవీఎంసీ ముందుకు వస్తుందో గాని వెంటనే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, పాదచారులు, స్థానికులు కోరుతున్నారు. ఎవరో గోతులు తవ్వేశారు! ఎవరూ పూడ్చరు.. మేం మాత్రం ఇబ్బందులు పడుతున్నామంటున్నారు స్థానికులు.

అంధకారంలో శ్రీకాంత్ నగర్

- పది రోజులుగా వెలగని వీధి దీపాలు

ఆరిలోవ, మే 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీకాంత్ నగర్‌లో గల పలు వీధుల్లో వీధిలైట్లు వెలగకపోవడంతో ఈ ప్రాంతం సాయంత్రం తర్వాత గాఢాంధకారంగా మారుతోంది. గత పది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొని ఉంది. దీంతో రాత్రి వేళల్లో వివిధ పనులపై వెళ్లిన వారు ఇంటికి చేరేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా.. మహిళలు, పిల్లలు, వృద్ధులు రాత్రి వేళల్లో బయటకు రావడానికి ఇబ్బందిగా ఉందంటూ వాపోతున్నారు. ఈ ప్రాంతంలో కుక్కలు అధికంగా ఉండడంతో చీకట్లో మరింత ఇబ్బందిగా మారుతోంది. కొన్నిసార్లు గుంపులుగా ఉన్న కుక్కలు చీకట్లో వచ్చే వాహనాలను చూసి పెద్దగా అరుస్తూ ద్విచక్ర వాహనాలను వెంబడిస్తున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు.ఈ సమస్య గురించి ఎవరికి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు మండి పడుతున్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా చెప్పండి వెంటనే పరిష్కరించేస్తామంటూ మాటలు చెప్పే ప్రజా ప్రతినిధులు తీరా సమస్య వస్తే పట్టించుకోకపోవడం అన్యాయం అంటున్నారు. అలాగే అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్రమత్తతతో నేరాల నియంత్రణ

- గొలుసు దొంగతనాల విషయంలో మహిళలు కొన్ని జాగ్రత్తలు పాటించాలి
- వేసవి సెలవుల్లో ఊర్లకు వెళితే సమాచారం ఇవ్వండి
- 'ఆంధ్రజ్యోతి'తో ద్వారకా జోన్ ఏసీపీ (నేర విభాగం) డి.లక్ష్మణరావు



ఇటీవల తరచూ జరుగుతున్న గొలుసు దొంగతనాలు, ఇళ్ల చోరీల విషయంలో ప్రజలు కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే నేరం జరగకుండా చేయవచ్చని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. నేరం జరిగిన తర్వాత ఇబ్బంది పడే కంటే ముందే తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల మేలు జరుగుతుందని ద్వారకా జోన్ ఏసీపీ (నేర విభాగం) డి.లక్ష్మణరావు తెలిపారు. ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడుతూ గొలుసు దొంగతనాల వల్ల బంగారం కోల్పోవడమే కాకుండా, దుండగులు మెడలో గొలుసు తెంచే ప్రయత్నంలో బాధితులు ప్రమాదాల పాలవుతున్నారన్నారు. ఒక్కోసారి ప్రాణాల మీదకు కూడా వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇక వేసవి సెలవుల్లో ఇళ్లకు తాళం వేసి, సొంతూర్లకు పయనమయ్యేవారు పోలీసులకు ముందస్తు సమాచారం, ఎల్‌హెచ్ఎంఎస్ యాప్ వినియోగించుకోవడం ద్వారా నేరం జరగకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలివి.

గొలుసు దొంగతనాల నుంచి రక్షణ కోసం..

- మహిళలు వాహనంపై ప్రయాణించేటప్పుడు ఉదయం, సాయంత్రం.. నడక, ఉదయం పువ్వులు కోసేటప్పుడు, నిర్మానుష్య రహదారుల్లో, రాత్రులు వీధుల్లో నడిచేటప్పుడు మెడలోని బంగారు వస్తువులు కనిపించకుండా వస్త్రం, చీర, చున్నీ వంటివి కప్పుకోవాలి.
- ఇంటి వద్దకు ఎవరైనా వచ్చి, నీళ్ల కావాలనో, చిరునామా అడగడానికో, ఇల్లు అద్దెకు కావాలనో, ఇతరత్రా మాటలు కలపడానికి కొత్త వ్యక్తులు వస్తే, తలుపు లేదా గ్రిల్ తెరవకుండా మాట్లాడాలి. ఇంట్లోకి చొరబడే అవకాశం ఇవ్వకూడదు. అలాగే వారి చేతికి అందనంత దూరంగా నిలబడాలి.
- రోడ్డు మీద వెళ్లేటప్పుడు, ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు అపరిచిత వ్యక్తులతో సంభాషణ వద్దు.

ఊరు వెళితే..

- వేసవి సెలవులకు ఇల్లు తాళం వేసి ఊరు వెళదామనుకుంటే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్ఎంఎస్) యాప్ ద్వారా పోలీసులకు రిక్వెస్ట్ పెట్టుకుంటే ఒక కెమెరా ఇంటిలో అమరుస్తారు. ఆధునిక సాంతిక పరిజ్ఞానం ద్వారా ఇంట్లోకి ఎవరైనా చొరబడితే పోలీసులకు తెలుస్తుంది.
- ఊరు వెళుతున్నట్టు స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే నైట్ బీట్‌ను ఆ ఇంటివైపు పంపించి, పర్యవేక్షిస్తారు.
- విలువైన వస్తువులు బ్యాంకు లాకర్‌లో ఉంచాలి. లేదా మీతో పాటు తీసుకొని వెళ్లడమో, మరో భద్రమైన చోట ఉంచడమో చేయాలి.
- అత్యవసర సమయాల్లో 112 నెంబరుకు ఫోన్ చేయాలి.

- ఆంధ్రజ్యోతి, ఎంవీపీ కాలనీ

చందనోత్సవ మృతులకు నివాళులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

వెంకోజీపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం చందనోత్సవంలో గోడ కూలి దుర్మరణం పాలైన 15వ వార్డు పాత వెంకోజీపాలెం ఉమానగర్‌కు చెందిన గుజ్జారి మహాలక్ష్మి, పిల్లా ఉమామహేశ్వరరావు, పిల్లా శైలజ, పైలా వెంకటరత్నంలకు శనివారం దినకార్యం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని మృతులకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ 15వ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, అప్పారి గిరిబాబు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, చెల్లుబోయిన గోవింద్, మహేష్, సోని, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మ తొలగించరా!



పితాపురం కాలనీ రామాలయం వద్ద వేలాడుతున్న చెట్టుకొమ్మ

మద్దిలపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 22వ వార్డు పితాపురం కాలనీ రామాలయం వీధి మార్గంలో చెట్టు కొమ్మ విరిగి వేలాడుతోంది. నాలుగు రోజుల నుంచి కొమ్మలు వేలాడుతున్నా జీవీఎంసీ సిబ్బంది తొలిగించే ప్రయత్నం చేయలేదు. పారిశుధ్య కార్మికులు ఇక్కడే చెత్త తీసుకుని వెళ్తున్నారు తప్ప విరిగిన కొమ్మలు గురించి పట్టించుకోవడం లేదు. ఇటీవల సీతమ్మధార రోడ్డులో చెట్టు కొమ్మ విరిగిపడి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన జరిగినప్పటి నుంచి స్థానికులు వేలాడుతున్న కొమ్మ కింద నుంచి రాకపోకలు మానేశారు. అధికారులు స్పందించి చెట్టు కొమ్మలు తొలగించాలని కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌లపై నిర్మాణ సామగ్రి వ్యాపారాలు



ఫుట్‌పాత్‌పై వేసిన పిక్క

ఆరిలోవ, మే 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డుపాంతాలయిన 13 వ వార్డులోని కేంద్రకారాగారానికి సమీపంలో గల రామకృష్ణాపురంలో ఫుట్ పాత్‌లపై ఇసుక, పిక్క తదితర భవన నిర్మాణ సామగ్రి వ్యాపారాలు చేస్తున్నారు. దీనివల్ల ఈ ప్రాంతంలో మార్నింగ్ వాకింగ్ చేసే వారు నడవడానికి వీలు లేకుండా పోతోంది ఈ విషయాన్ని అధికారులు కూడా పట్టించుకోవడం లేదని వాకర్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ఫుట్‌పాత్ వ్యాపారాలను అరికట్టాలని కోరుతున్నారు.

పాక్‌కు గుణపాఠంతోనే ప్రజలకు ఆనందం

ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని ఉత్తర ఎమ్మెల్యే పూజలు



మాధవధారలోని కుంచుమాంబ ఆలయం వద్ద పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు

మాధవధార, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదుల ఏరివేతకు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావడం పట్ల విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు హర్షం వ్యక్తం చేశారు. ఆయన 50వవార్డులోని మాధవధార గ్రామ దేవత శ్రీ కుంచమాంబ ఆలయాన్ని స్థానిక నాయకులతో కలసి శనివారం సందర్శించారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్ ఆధ్వర్యంలో కుంచుమాంబ ఆలయం వద్ద ప్రత్యేకపూజలు జరిపారు. పాకిస్థాన్‌కు తగిన గుణపాఠం చెప్పడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజా క్షేమం కోరుతూ ఆలయ ఆవరణలో కొబ్బరికాయలు కొట్టారు. భారత సైన్యానికి ప్రజలు, రాజకీయ పార్టీల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ బీజేపీ ఇంఛార్జి సురేష్‌బాబు, 51వవార్డు టీడీపీ అధ్యక్షులు సనపల కీర్తి, టి.శ్రీనివాస్, డి.కుమారి, శాంతి హాజరయ్యారు.

సైనికుల క్షేమం కోరుతూ పూజలు



సీతమ్మధారలోని గ్రీన్‌పార్కు కాలనీ వినాయక ఆలయంలో పూజ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నగర అధ్యక్షుడు పరశురామరాజు, ఇతర నాయకులు

సీతమ్మధార, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత సైనికులు, ప్రజలు క్షేమంగా ఉండాలని ప్రార్థించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామరాజు పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ 14వ వార్డు సీతమ్మధార గ్రీన్ పార్క్ కాలనీలోని వినాయక ఆలయంలో వార్డు అధ్యక్షుడు రాకేష్ ఆధ్వర్యంలో శనివారం పూజ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పరశురామరాజు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్ణయాలు భారత ప్రజల మనోభావాలకు అద్దం పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఉత్తర నియోజకవర్గం కన్వీనర్ ఎం.సురేష్‌బాబు, బీజేవైఎం జనరల్ సెక్రటరీ శంకర్, ఆ పార్టీ ఇతర నాయకులు సంజీవరావు, విజయరామరాజు పాల్గొన్నారు.

పీజీ డిప్లొమో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్, మే 10 (ఆంధ్రజ్యోతి) : సెంచూరియన్ విశ్వవిద్యాలయంతో కలిసి స్వస్థ సూచన్ ఇనిస్టిట్యూట్‌లో కాస్మోటాలజీ, న్యూట్రిషిన్‌లో పీజీ డిప్లొమో కోర్సులు ప్రారంభయ్యాయని విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ తెలిపారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమో కోర్సులను అందించడానికి సెంచూరియన్ విశ్వవిద్యాలయంతో ముఖ్యమైన విద్యా సహకారాన్ని ప్రకటించడం లక్ష్యంగా కోర్సులు ఏర్పాటు చేశారన్నారు.

నౌకాయానంపై ప్రభావం చూపని యుద్ధవాతావరణం

అండమాన్‌కు బయలుదేరిన ప్రయాణికుల నౌక



అండమాన్ బయలుదేరిన ఎంవీ క్యాంప్‌బెల్ బే నౌక (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో యుద్ధ వాతావరణ ప్రభావం విశాఖపట్నం పోర్టుపై ఎటువంటి ప్రభావం చూపలేదు. ప్రయాణికుల నౌకలతో పాటు వాణిజ్య నౌకాలన్నీ యథాప్రకారం రాకపోకలు సాగిస్తున్నాయి. విశాఖపట్నం-అండమాన్ మధ్య ప్రయాణికుల నౌకలు నిత్యం తిరుగుతుంటాయి. యుద్ధ భయం వల్ల ఈ సర్వీసు రద్దు అవుతుందేమోనని చాలామంది భయపడ్డారు. కానీ అటువంటిదేమీ లేకుండానే శనివారం ఇక్కడి నుంచి అండమాన్ నౌక ఎంవీ క్యాంప్‌బెల్ బే బయలుదేరి వెళ్లింది. ఈ నౌకలకు నెల రోజుల ముందుగానే పత్రికల్లో ప్రకటన ఇచ్చి టికెట్లు విక్రయిస్తారు. ఉత్తరాంధ్రాతో పాటు ఒడిశా(బరంపురం)కు చెందినవారు అండమాన్‌లో ఉపాధి అవకాశాల కోసం పెద్ద సంఖ్యలో వెళుతుంటారు. వారే ఈ నౌకల్లో అధికంగా ప్రయాణిస్తారు. షెడ్యూల్ ప్రకారం అండమాన్ ఉంచి ఈ నౌక ఈ నెల ఎనిమిదో తేదీనే వచ్చింది. శనివారం సాయంత్రం ప్రయాణికులను ఎక్కించుకొని చీకటి పడ్డాక బయలుదేరిందని పోర్టు వర్గాలు తెలిపాయి. సుమారు మూడు రోజులు సముద్రంలో ప్రయాణించి గమ్యం చేరుకుంటుంది.

ఖాకీల కలెక్షన్

... 5వ పేజీ తరువాయి

సక్రమంగా పట్టించుకోవడం లేదని, తనను ఇబ్బంది పెడుతున్నందున సన్మార్గంలో పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేస్తే, తనను విడాకులు తీసుకోవాలని సదరు అధికారిణి ఒత్తిడి చేయడంతోపాటు, ఆమె భర్త స్నేహితుడైన వ్యక్తి ద్వారా కూడా ఒత్తిడి చేయించారంటూ బాధితురాలు ఫిర్యాదు చేశారు. సీపీ స్పందించి సదరు అధికారిణి నుంచి ఆ కేసును మరొకరికి బదిలీ చేయడంతోపాటు విచారణ జరిపి తనకు అసలు విషయం తెలియజేయాలని నార్త్ ఏసీపీ అప్పలరాజును ఆదేశించారు. ఈస్ట్ సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న ఒక స్టేషన్ సీఐ నైట్ రౌండ్స్ ఉన్నప్పుడు ఒక హోటల్‌లో కూర్చొని వసూళ్ల గురించి హెడ్‌కానిస్టేబుల్‌తో చర్చించుకుంటారని ఆ స్టేషన్ సిబ్బందే చెబుతున్నారు. స్టేషన్‌లో వసూళ్ల బాధ్యతలు చూస్తున్న సదరు హెడ్‌కానిస్టేబుల్ గతంలో కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో పనిచేసినప్పుడు కూడా ఇలాంటి ఆరోపణలే వెల్లువెత్తడంతో ఈస్ట్ సబ్‌డివిజన్‌కు బదిలీ చేశారు. ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉన్న ఒక స్టేషన్‌లో ఏఎస్ఐ ఒకరు వసూళ్ల బాధ్యతను భుజానవేసుకున్నారు. వెస్ట్ సబ్‌డివిజన్‌లో జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఒక పోలీస్ స్టేషన్‌లో బ్లూకోట్స్ బాధ్యతలు చూస్తున్న కానిస్టేబుల్ వసూళ్ల బాధ్యత చూస్తున్నారు. ద్వారకా సబ్‌డివిజన్‌లోని వాణిజ్య సముదాయాలు కలిగివున్న ఒక స్టేషన్‌లో మరొక కానిస్టేబుల్ వసూళ్ల బాధ్యతలు చూసుకుంటున్నారని ఉన్నతాధికారులకు ఇప్పటికే ఫిర్యాదు అందినట్టు తెలిసింది. ఈ వ్యవహారాలపై సీపీ శంఖబ్రతబాగ్చికి సమాచారం అందించాల్సిన స్పెషల్‌బ్రాంచి విభాగం తన బాధ్యతలను నిర్వర్తించడంతో విఫలమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి స్టేషన్ పరిధిలో జరిగే అన్నిరకాల వ్యవహారాలతోపాటు శాఖాపరంగా అంతర్గత వ్యవహారాలు, అవినీతిపై సమాచారం సేకరించేందుకు స్పెషల్‌బ్రాంచి విభాగం నుంచి ఒక్కో కానిస్టేబుల్ ఉంటారు. అయినప్పటికీ వారు కూడా స్టేషన్ సిబ్బందితో కుమ్మక్కు అయిపోవడం, గతంలో వారు స్టేషన్‌లో అలాంటి విధుల్లో పనిచేయడం వల్లే అవినీతి, నిర్లక్ష్యాన్ని ఉన్నతాధికారులకు చేరవేయడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సీపీ స్టేషన్లలోని అవినీతిపై దృష్టిసారించాలని నగరవాసులు కోరుతున్నారు.

మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్న కేంద్రం

» సీపీఐ జిల్లా మహాసభల ప్రారంభ ర్యాలీలో నాయకులు ధ్వజం



ర్యాలీలో పాల్గొన్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

కంచరపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని సీపీఐ రాష్ట్ర సమితి సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరావు, జె.వి.సత్యనారాయణమూర్తి ఆరోపించారు. సీపీఐ విశాఖ జిల్లా మహాసభలు సందర్భంగా శనివారం కంచరపాలెం మెట్టు నుంచి ఐటీఐ జంక్షన్ వరకు ప్రజా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఐటీఐ జంక్షన్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో నాయకులు మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 2014లో ఇచ్చిన హామీలనే నెరవేర్చలేదన్నారు. ఏటా రెండ కోట్ల ఉద్యోగాల కల్పన, నల్లధనాన్ని వెలికితీసి ప్రజలకు పంచుతామన్న బీజేపీ హామీలు ఏమయ్యాయంటూ ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాల హామీతో అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వాటి అమలును పక్కన పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 12 ఏళ్లగా కనీస వేతనాలు సవరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వానికి అమరావతి తప్ప మరేమీ కనిపించడం లేదన్నారు. నెల రోజుల క్రితం రిజిస్టరైన సంస్థకు విశాఖలో కేవలం 99 పైసలకు భూములు కేటాయించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, పార్టీ నాయకులు మానం ఆంజనేయులు, ఎ.జె.స్టాలిన్, సీహెచ్.రాఘవేంద్రరావు, డి.ఆదినారాయణ, పి.చంద్రశేఖర్, ఎం.మన్మధరావు, రాంబాబు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో పృథ్వికి రజతం



విజేతలతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్స్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా యూత్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో అప్పనేని పృథ్వి ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పతకం అందించాడు. బిహార్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శనివారం 55 కిలోల పురుషుల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించిన పృథ్వి...స్నాచ్‌లో 98 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 114 కిలోల (207 కిలోలు) బరువెత్తి రజత పతకం సాధించాడు. 55 కిలోల వెయిట్ కేటగిరికి ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ కార్యదర్శి ఆనందే గౌడ, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కంచరాన సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు పతకాలు అందించి అభినందించారు.

కంటి ఆస్పత్రి గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కవిత



విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ కంటి ఆస్పత్రి గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా డి.కవిత శనివారం బాధ్యతలు చేపట్టారు. కేజీహెచ్‌లో హెడ్ నర్సుగా పనిచేసిన ఆమె పదోన్నతిపై కంటి ఆస్పత్రికి వచ్చారు. ఈ సందర్భంగా నర్సింగ్ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వైభవ వేంకటేశ్వరస్వామి

మాధవధార, మే 10 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 23వ వార్షిక కల్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 8న ఆరంభమైన ఉత్సవాలు 12 వరకు కొనసాగనున్నాయి. శనివారం స్వామి వారికి సుప్రభాత సేవతో పూజావిధులు ఆరంభించారు. శ్రీవారికి చక్రస్నానం, వసంతోత్సవం జరిపారు. యుద్ధ వాతావరణంలో జరుగుతున్న వేడుకల్లో ఈ రోజు స్వామి ఆలయంలో ఆలయ సిబ్బంది, అర్చకులు అంతా జెండాలు, మూడు రంగుల చేతి బాండ్లు ధరించి పాల్గొన్నారు. ఉదయం ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు భారత్- పాకిస్థాన్‌ల మధ్య శాంతియుత వాతావరణం నెలకొనాలని ఆకాక్షించారు. ప్రధాని మోదీ నాయకత్వానికి మద్దతుగా సైన్యానికి జేజేలు పలుకుతున్న ప్రజలను ప్రశంసించారు. ఆలయ ఆవరణలో మహా అన్నదానం జరిపి స్వామి ప్రసాదాల్ని అందజేశారు. సాయంత్రం 6 గంటలకు పుష్పాంజలి, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ, సిబ్బంది, అర్చకులు ఉత్సవ నిర్వహణ చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు దివ్య తిరు కల్యాణ మహోత్సవానికి హాజరయ్యారు.

మామూళ్ల వసూలు ముమ్మాటికీ వాస్తవం

... 5వ పేజీ తరువాయి

చూసుకుంటున్నారని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే ఇంటెలిజెన్స్ వర్గాలు మాత్రం దీనిపై లోతుగా విచారణ జరిపినట్టు సమాచారం. వారంతా సాధారణ వ్యక్తుల్లా మద్యం వ్యాపారులతో మాటలు కలిపి మద్యం దుకాణం/బార్ నిర్వహణకు సంబంధించిన సాధకబాధకలను ఆరా తీసినట్టు తెలిసింది. ఈ క్రమంలో పోలీసులకు నెలవారీ మామూళ్లు ఇవ్వాలని ఒత్తిళ్లు పెరగడంతో తప్పనిసరి పరిస్థితిలో చేయాల్సి వస్తోందని చెప్పినట్టు సమాచారం. దీంతో ఆయా వివరాలను ఉన్నతాధికారులకు చేరవేశారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంలో పేర్కొన్నట్టు మద్యం వ్యాపారుల నుంచి పోలీసులు మామూళ్లు గుంజుతుండడం వాస్తవమేనని నిర్ధారించి, సమగ్ర నివేదిక తయారుచేసి ఇటీవల ప్రభుత్వానికి పంపించినట్టు తెలిసింది.

పారిశుధ్య పనులను పరిశీలించిన మేయర్

... 5వ పేజీ తరువాయి

ముందుగా ఆర్కే. బీచ్ వద్ద ఉన్న పారిశుధ్య కార్మికుల హాజరుపట్టికను తనిఖీ చేసి...రోజూ కార్మికులు ఎన్ని గంటలకు హాజరవుతున్నారని కాంట్రాక్టర్‌ను ఆరా తీశారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ వారికి సరఫరా చేసిన చీపుళ్లను తనిఖీ చేసి నాణ్యత బాగుండలేదని, వాటిని మార్చాలని, ఇంకా కార్మికులకు అవసరమైన డస్ట్ బిన్లు, తోపుడుబండ్లు సమకూర్చాలని సహాయ వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజును ఆదేశించారు. బీచ్‌లో ప్రతి దుకాణం దగ్గర డస్ట్ బిన్ తప్పకుండా ఉండాలని, అందుకు సహకరించని వారి షాపులను తొలగించాలని సూచించారు. బీచ్ కాలుష్యానికి గురికాకుండా సందర్శకులకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. అనంతరం జగదాంబ జంక్షన్‌లో పనులు పరిశీలించారు. కొన్ని షాపుల వద్ద అధికంగా వ్యర్థాలు రోడ్లపై వేస్తున్నారని ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు కొందరు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. అటువంటి దుకాణాలు, షోరూమ్స్ వద్ద ప్రత్యేకంగా డస్ట్ బిన్స్ వారే ఏర్పాటుచేసుకుని జీవీఎంసీ వాహనాలకు రోజూ అందించేలా నోటీసులు జారీచేయాలని అధికారులకు సూచించారు. రాత్రి పారిశుధ్య పనులలో ఎటువంటి అలసత్వం, లోపాలు లేకుండా నిత్యం విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సహాయ వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్‌ను మేయర్ ఆదేశించారు.

మహనీయులకు సాహితీవేత్తల ఘన నివాళి



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

కంచరపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి): సాహితీ స్రవంతి విశాఖ జిల్లా సమావేశం శనివారం కంచరపాలెం టీఎస్ఆర్ భవనంలో జరిగింది. జిల్లా అధ్యక్షుడు పొలమరశెట్టి ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సభ్యులు పాల్గొని మహనీయులకు ఘనంగా నివాళులర్పించారు. మే డే, అల్లూరి సీతారామరాజు వర్ధంతి, రవీంద్రనాథ్ ఠాగూర్‌ల జయంతి తదితర కార్యక్రమాల నేపథ్యంలో మహనీయుల సేవలను కొనియాడారు. అనంతరం సభ్యుల ఆధ్వర్యంలో సాహితీ ప్రక్రియలు కవిత, పాట, పద్యాలతో సమావేశం కొనసాగింది. ఈ కార్యక్రమంలో సభ్యులు డా.కె.వి.రమణ, ఉమాశంకర్, ఎం.ఆనంద్ శర్మ, హరి వెంకటరమణ, రెడ్డి రామకృష్ణ సంతోషమ్మ, గోపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లోకోషెడ్‌లో రైల్వే జీఎం తనిఖీలు



తనిఖీల్లో జీఎం పరమేశ్వర్ ఫంక్వాల్, డీఆర్ఎం లలిత్ బొహ్రా తదితరులు

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే, విశాఖలోని విద్యుత్ లోకోషెడ్‌లో తూర్పుకోస్తారైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శనివారం తనిఖీలు చేశారు. విద్యుత్ లోకోషెడ్‌లోని వీల్ షాప్, ట్రాక్షన్ కన్వర్టర్ పవర్ మాడ్యూల్ మరమ్మతుల విభాగం, ట్రాక్షన్ మోటారు బేరింగ్ పరీక్ష మిషన్, ట్రాక్షన్ మోటారు రోటరీ బ్యాలన్సింగ్ మిషన్లను తనిఖీ చేశారు. అలాగే బోరో స్కోప్, హోటల్ లోడ్ కన్వర్టర్, హెవీ లిఫ్టింగ్ బే ఎక్స్‌టెన్షన్ పనులను పరిశీలించారు. అనంతరం లోకో షెడ్‌లో వివిధ నిర్వహణ సౌకర్యాలు, యూనిట్లు, ఇతర సదుపాయాలు పరిశీలించి సాంకేతిక నిపుణులు, సిబ్బందితో పలు అంశాలపై చర్చించి అభిప్రాయాలు సేకరించారు. అలాగే లోకో షెడ్ విస్తరణతోపాటు చేపట్టాల్సిన అభివృద్ధి కార్యకలాపాలు, పురోగతిలో ఉన్న నిర్మాణ పనులు వంటి అంశాలపై డివిజనల్ అధికారులతో సమీక్షించారు. ఈ పర్యటనలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు

పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా), మే 10 (ఆంధ్రజ్యోతి): మన్యంవాసుల ఆరాధ్య దేవత పాడేరు మోదకొండమ్మ ఉత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ, ఐటీడీఏ యంత్రాంగం ఏర్పాట్లుచేశాయి. మోదకొండమ్మను అత్తవారి ఇంటి నుంచి పుట్టింటికి తీసుకువచ్చే తంతుతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. స్థానిక ఆలయం (అత్తవారిల్లు) నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలను ఆదివారం ఉదయం భారీ ఊరేగింపుతో పుట్టిల్లుగా భావించే శతకంపట్టు పందిరిలో ఉంచుతారు. సోమ, మంగళవారాలు కూడా శతకంపట్టులోనే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మంగళవారం సాయంత్రం శతకంపట్టు నుంచి అమ్మవారిని తిరిగి ఆలయానికి చేర్చడం (అనుపోత్సవం)తో ఉత్సవాలు ముగుస్తాయి.

సెవెన్‌హిల్స్‌లో అవయవ మార్పిడి వైద్య సేవలు

మహారాణిపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని ఎంజీఎం సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో గుండె, ఊపిరితిత్తులు అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభిస్తున్నట్లు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కె.ఆర్.బాలక్రిష్ణన్ తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో తొలిసారిగా ఈ క్లినికల్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. నాలుగేళ్ల చిన్నారుల నుంచి పెద్దవయసు వారికి అవయవమార్పిడి చికిత్స నిర్వహిస్తామని తెలిపారు. సీఈవో వింగ్ కమాండర్ ఎంకే బోస్, డాక్టర్ సురేష్ రావు, డాక్టర్ సుమిత్రా రాయ్ పాల్గొన్నారు.

60 ఎకరాల అన్యాక్రాంతానికి కుట్ర

... 5వ పేజీ తరువాయి

భూములకు నిరభ్యంతర పత్రాలు ఇవ్వాలని ఆదేశించారు. విశాఖ రూరల్ మండలం మధురవాడ సర్వేనంబరు 370/1, 367/1, 352/3, కొమ్మాది సర్వే నంబరు 114/1, 150/2, ముడసర్లోవలో 31/2, ఆనందపురం మండలం తర్లువాడలో సర్వే నంబరు 3/3, పెందుర్తి మండలం ఎస్ఆర్ పురంలో సర్వేనంబరు 99, గాజువాక మండలం వడ్లపూడిలో సర్వే నంబరు 122/1, శనివాడలో సర్వేనంబరు 92, తలారివానిపాలెంలో 35/4లో భూములతోపాటు జిల్లాలో మరికొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూములకు రమారమి 60 నుంచి 70 ఎకరాలకు నిరభ్యంతర పత్రాలు ఇవ్వాలని ఆయన ఆదేశించారు. జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు పేర్కొన్న కొన్ని సర్వే నంబర్లలో భూములకు ఎన్‌వోసీ ఇవ్వాలని అధికారులను మౌఖికంగా ఆదేశించారు. ఆ భూములకు ఎన్‌వోసీ ఇవ్వలేమని, కొన్ని భూములు సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధంగా ఉన్నాయని, మిగిలినవి ప్రభుత్వ భూములేనని పేర్కొంటూ...వాటిపై కోర్టులో కేసులు ఉన్నాయని నివేదించారు. అయితే సదరు ఉన్నతాధికారి ఈ ఏడాది జనవరి నుంచి ఒక్కొక్క దానికి నిరభ్యంతర పత్రాలు జారీచేయాలని ఆదేశించారు. ఈ విధంగా సుమారు 12 నుంచి 15 సర్వే నంబర్లకు ఆదేశాలు వచ్చాయి. ముడసర్లోవ రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో భూములకు ఎటువంటి పట్టాలు ఇవ్వకూడదు. అందుకు అనుగుణంగా చాలాకాలం క్రితం ఇచ్చిన పట్టాలను అప్పట్లోనే రద్దు చేసినా వాటిపై కొందరు పోరాటం చేస్తున్నారు. నీటి ప్రవాహాలు, చెరువులు, వాగులు ఎవరికీ ఇవ్వరాదని సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. దీని ప్రకారం ముడసర్లోవలో నీటి ప్రవాహం ఉన్న ప్రాంతంలో భూములకు నిరభ్యంతర పత్రాలు ఇవ్వకూడదు. ఇదే తీర్పు మేరకు వడ్లపూడిలో చెరువుకు ఎన్‌వోసీ ఇవ్వకూడదు. ఇంకా పక్కాగా ప్రభుత్వ భూమి అని తేలిన చోట్ల కూడా ఎన్‌వోసీ ఇవ్వాలని సదరు ఉన్నతాధికారి ఆదేశించారు. ఆయా భూములకు ఎన్‌వోసీ ఇవ్వలేమని జిల్లా యంత్రాంగం ఇటీవల ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అప్పటికే రెవెన్యూ ఉన్నతాధికారిని ఆ స్థానం నుంచి తప్పించిన ప్రభుత్వం...జిల్లాల్లో ఎన్‌వోసీ ఇవ్వాలని ఆయన సిఫారసు చేసిన భూములపై ఆరా తీసింది. ఎన్‌వోసీ ఇవ్వాలన్న భూముల వెనుక ఉన్న వ్యక్తులు ఎవరు?...అన్నదానిపై వివరాలు సేకరిస్తుంది.

ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు

... 5వ పేజీ తరువాయి

ప్రారంభించారు. పాత మీటర్లు తీసేసి, కొత్తవి ఇస్తున్నారు.

స్మార్ట్ మీటర్లు కొందరికే...

స్మార్ట్ మీటర్లు విద్యుత్ వినియోగదారులు అందరికీ ఇవ్వం. ఎక్కువ విద్యుత్ అంటే నెలకు 200 యూనిట్లు పైబడి ఉపయోగించే వారికి మాత్రమే ఏర్పాటుచేస్తాం. మిగిలిన వారికి పాత మీటర్లే ఉంటాయి. గ్రూపు హౌస్‌లు, అపార్ట్‌మెంట్లలో ఉండేవారికి తప్పనిసరి అనే నిబంధన కూడా లేదు. తక్కువ విద్యుత్ ఉపయోగించుకొని, ప్రభుత్వ రాయితీ పొందే వర్గాలకు ఇవ్వరు. స్మార్ట్ మీటర్ల వ్యయం వినియోగదారుల నుంచి వసూలు చేస్తారనే అపోహలు కూడా ఉన్నాయి. ఈపీడీసీఎల్ ఎప్పుడూ మీటర్ల వ్యయం వినియోగదారుల నుంచి వసూలు చేయలేదు. అది సంస్థ ఆస్తిగానే ఉంటుంది. కాకపోతే స్మార్ట్ మీటరు పెట్టుకునేవారు ముందుగానే వారి సగటు వినియోగం ఎంతో ఆ మొత్తంతో రీచార్జి చేసుకోవలసి ఉంటుంది.

- శ్యాంబాబు, ఎస్ఈ, విశాఖ సర్కిల్

ప్రేమ సమాజం ముంగిట పెళ్లి సందడి



నూతన వధువును ఆశీర్వదించడానికి వచ్చిన సీపీ బాగ్చికి ప్రేమ సమాజం నిర్వాహకుల సత్కారం



నేడు పెళ్లి బంధంతో ఒక్కటి కానున్న జంట రాఘవేంద్ర, ఆశ్రిత శివజ్యోతి

డాబాగార్డెన్స్, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రేమ సమాజం ముంగిట పెళ్లి సందడి నెలకొంది. ప్రేమించుకున్న అంధుల జంట పెద్దలు, ఇతర ప్రముఖుల ఆశీస్సులతో ఆదివారం వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారు. ఇందుకు శుభారంభంగా శనివారం ఉదయం పెళ్లి రాట వేశారు. కంచర్ల అన్నపూర్ణాదేవి వేదికగా ప్రేమ సమాజంలో ఆశ్రయం పొందిన ఆశ్రిత శివజ్యోతి, అనంతపురం జిల్లా బుక్కపట్నం గ్రామానికి చెందిన ఎనుముల గంగన్న, నారాయణమ్మల కనిష్ఠ పుత్రుడు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి రాఘవేంద్రల వివాహానికి అంతా సిద్ధమైంది. మండపాన్ని సుందరగా తీర్చిదిద్దారు. ఆంగ్ల భాషలోని ఓ చిన్న సందేహ నివృత్తికి రాఘవేంద్రను సంప్రదించిన ఆశ్రిత.. క్రమంగా ఆ పరిచయం ప్రేమకు దారితీసి పెళ్లి పీటల వరకు తీసుకురావడం విశేషం.కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి రాఘవేంద్ర తనలాగే కంటి చూపులేని యువతిని తన జీవితభాగస్వామిగా ఎంచుకోవడం, ఇద్దరూ విద్యావంతులు కావడం, వీరికి పెద్దల ఆశీర్వాదం లభించడంతో వీరిని కలిపేందుకు ప్రేమ సమాజం నడుంబిగించింది.

ప్రేమ సమాజం ప్రాంగణంలో శనివారం పెళ్లి రాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శివజ్యోతిని పెళ్లి కుమార్తెగా ముస్తాబు చేశారు. ఆమెకు తాళిబొట్టు, వెండిమెట్టలు, పసుపు కుంకుమ, స్వీట్లను డాక్టర్ కందుల నాగరాజు, నళిని దేవి దంపతులు అందజేశారు. మద్దిలపాలెం ప్రాంతానికి చెందిన వ్యాపారవేత్త పార్డు కోసూరు మంగళసూత్రం అందజేసి అందరినీ ఆనందానికి గురిచేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమ సమాజం అధ్యక్షుడు బుద్ధ శివాజీ అధ్యక్షత వహించగా కార్పొరేటర్ కందుల నాగరాజు, నళిని దేవి, టూ టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎర్రంనాయుడు, ఈస్ట్ ట్రాఫిక్ సర్కిల్ 1 సీఐ ఎం.శ్రీను, సమాజం కార్యదర్శి హరిమోహన్‌రావు, సభ్యులు ఎస్.అప్పలరాజు, ప్రేమ గణపతిరావు, గంట్ల శ్రీనుబాబు, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వధువుకు సీపీ ఆశీర్వాదం

వధువును ఆశీర్వదించేందుకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ప్రేమ సమాజానికి వచ్చారు. పెళ్లి కుమార్తెను ఆశీర్వదించారు. ఇద్దరూ జీవితంలో ఉన్నతస్థానాలకు వెళ్లాలని, అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

భారత్‌తో పెట్టుకుంటే పాక్ నాశనమే

... 5వ పేజీ తరువాయి

వివరాలు ఆయన మాటల్లోనే...

పాకిస్థాన్‌తో యుద్ధంలో సేవలు..

1970లో నౌకాదళంలో కమిషన్డ్ ఆఫీసర్‌గా చేరా. విధుల్లో చేరిన ఏడాదికే అంటే 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో పాల్గొన్నాను. అరేబియా మహా సముద్రంలో పాకిస్థాన్ యుద్ధ విమానాలు, జలాంతర్గాములను వేటాడేందుకు 'ఐఎన్ఎస్ కుఠార్' యుద్ధనౌకలో సిగ్నల్ కమ్యూని కేషన్ ఆఫీసర్‌గా పనిచేశాను. మరో రెండు యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ ఖుక్రీ, కిర్పాన్ కూడా అదే సముద్రంలో సేవలు అందించాయి. పాకిస్థాన్‌కు చెందిన జలాంతర్గామి దాడిలో (టార్పెడోలు ఫైరింగ్) ఐఎన్ఎస్ ఖుక్రీ మునిగి పోయింది. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో సిబ్బంది ప్రాణాలను మేము కాపాడాం. పద్దెనిమిది రోజులపాటు జరిగిన యుద్ధంలో పాక్ విమా నాలు, సబ్ మెరైన్స్‌పై దాడి చేసే లక్ష్యంతో ముందుకుకదిలాం. నాడు పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో భారత్ అద్భుతమైన పోరాటాన్ని కొనసాగించింది. కరాచీ కూడా ఆధీనంలోకి వచ్చింది. అప్పుడు కాల్పుల విరమణ ప్రకటన రాకపోయి ఉండి ఉంటే ఇప్పుడు ఇటువంటి పరిస్థితులు ఉండేవి కావు. కానీ, ప్రభుత్వం అప్పటి పరిస్థితుల దృష్ట్యా కాల్పుల విరమణ ప్రకటించడంతో భారత సైన్యం వెనక్కి వచ్చింది.

త్రివిధ దళాలు సర్వసన్నద్ధం

భారత్ త్రివిధ దళాలు నిరంతరం సర్వసన్నద్ధంగా ఉంటాయి. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసే సిబ్బంది దేశభక్తితో పనిచేస్తారు. ప్రాణాలు ఇచ్చేందుకు కూడా వెనుకాడరు. ఇక పాకిస్థాన్‌తో యుద్ధం అంటే వేయి రెట్లు కసి, వేగంతో సైన్యం ముందుకు కదులుతుంది. ప్రభుత్వం ముందుకు వెళ్లాలని భావిస్తే మాత్రం పాకిస్థాన్‌కు తగిన బుద్ధి చెప్పడం ఖాయం. ఈ విషయంలో భారత్ శక్తి, సామర్థ్యాలకు తిరుగులేదు.

పాకిస్థాన్ చేసేదేమీ లేదు..

పహల్గాంలో ఉగ్రమూకలు అమాయకులైన పర్యాటకులను చంపారు. మనం ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేస్తే, పాకిస్థానేమో భారత్‌పై దాడులకు తెగబడుతోంది. అంటే, ఇంకా పాకిస్థాన్ బుద్ధి మారలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో పాకిస్థాన్ చేసేది ఏమీ లేదు. అగ్రరాజ్యాలు అయిన అమెరికా, రష్యా మన వైపు ఉన్నాయి. కరాచీ పోర్టుపై భారత్ దాడి చేసినట్టు చెబుతున్నారు. అదే జరిగితే పాక్ కోలుకోవడం ఇప్పట్లో సాధ్యం కాదు. మరోవైపు బలూచిస్తాన్ వాళ్లు తిరగబడుతుండడంతో అంత ర్యుద్ధంతో అల్లాడుతోంది. అక్కడ క్షేత్రస్థాయిలో అత్యంత దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. అన్నింటికంటే భారత్ సైన్యం దేశభక్తితో పని చేస్తుంది. కాబట్టి, మన సైన్యాన్ని ఎదుర్కోవడం పాకిస్థాన్‌కు అంత సులభం కాదు.



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

కార్మిక హక్కుల సాధన కోసం సమ్మె చేద్దాం

సీఐటీయూ ప్లాంట్ అధ్యక్షుడు రామస్వామి

ఉక్కుటౌన్‌షిప్, మే 10 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల సాధన కోసం సమ్మె చేద్దామని సీఐటీయూ ప్లాంట్ అధ్యక్షుడు యు.రామస్వామి అన్నారు. స్టీల్‌ప్లాంటులో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీలో కర్మాగారానికి రూ.1,594 కోట్లు రావాల్సి ఉందన్నారు. స్టీల్‌ప్లాంటుకు గతనెల రూ.72 కోట్ల లాభం వచ్చిందని పేర్కొన్నారు. ప్లాంట్ పరిస్థితి బాగుంటే కార్మికులకు పూర్తి జీతాలు ఇస్తామని యాజమాన్యం చెప్పిందని, అలాగే నిలిపివేసిన ఆర్థిక ప్రయోజనాలను పునరుద్ధరిస్తామన్నందున వాటిని తక్షణమే అమలు చేయాలని కోరారు. గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరాం మాట్లాడుతూ ప్లాంటులో మానవ వనరుల కొరత అధికంగా ఉందని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్మిక హక్కుల కోసం ఈ నెల 20న జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొనవలసిందిగా కోరారు. సమావేశంలో నాయకులు పి.శ్రీనివాసరాజు, అప్పారావు, రాజు, మరిడయ్య, మహేశ్, సత్యనారాయణ, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో స్వచ్ఛ భారత్

గాజువాక, మే 10 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే అన్ని విధాల ప్రగతి సాధ్యపడుతుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పని ప్రదేశంతో పాటు అన్ని పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. సీఐ పార్థసారథి మాట్లాడుతూ స్టేషన్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొండా ఎల్లాజీరావు, రోహిణి, అనిత, అప్పలరాజు, ప్రకాశ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో రక్తదాన శిబిరం

ఉక్కుటౌన్‌షిప్, మే 10 (ఆంధ్రజ్యోతి): పాత గాజువాక జంక్షన్‌లో మహాత్మా, మదర్ థెరెసా ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం వేసవిని పురస్కరించుకుని అత్యవసర రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు రక్తాన్ని అందించేందుకు గాను ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ట్రస్టు ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రజలకు రక్తం అందించేందుకు ఎప్పటికప్పుడు శిబిరాలను నిర్వహిస్తున్నామని, యువత అధిక సంఖ్యలో వీటిలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వందేభారత్ బ్లడ్ బ్యాంక్ సంస్థ చైర్మన్ వినోద్‌బాలు, ప్రతినిధులు జాగరపు శ్రీను, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సింగిల్**: మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్**: జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 13, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 22, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 38, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 30, క్యాబేజీ 16, క్యారెట్ 40 దొండకాయలు 26, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది) 48, బరబాటి 34, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 90, బద్ద చిక్కుడు 48, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 90, కీరదోస 34, క్యాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడ దుంపలు 38, కంద 84, దేముడుచిక్కుడు 44, గోరుచిక్కుడు 30, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 26, క్రరపెండలం 18, బూడిద గుమ్మడికాయ 30, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	110
లైవ్ ధర	130
విత్ స్కిన్	230
స్కిన్‌లెస్	240



చెరువు చేపలకు భలే గిరాకీ

సముద్రంలో మత్స్య వేట నిషేధంతో వీటికి పెరిగిన డిమాండ్ ▸▸ కిలో రూ.150 నుంచి రూ.200 మధ్య విక్రయాలు



గోపాలపట్నం మార్కెట్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న చెరువు చేపలు

గోపాలపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఏటా సముద్రంలో చేపల వేటను సుమారు 61 రోజుల పాటు నిషేధం విధిస్తుండడంతో మహా నగరంలో చెరువు చేపలకు మంచి గిరాకీ ఏర్పడుతోంది. ఈ క్రమంలో ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు ప్రభుత్వం వేట నిషేధించింది. దీంతో మార్కెట్లో సముద్ర చేపలు లభించడం లేదు. నిషేధ గడువు ముగిసిన తరువాతే సముద్ర చేపలు మళ్లీ మార్కెట్లో కనిపిస్తాయి. అప్పటిరకు చెరువు చేపల వ్యాపారమే కీలకంగా మారుతుందని చెప్పక తప్పదు. నగరంలో మాంసాహార వినియోగం అధిక మొత్తంలో ఉండడంతో అన్ని బజార్లలో ప్రతినెలా టన్నుల కొద్దీ చేపలను విక్రయిస్తుంటారు. సంద్రంలో మత్స్యవేట నిషేధంతో ప్రస్తుతం నగరంలోని అన్ని బజార్లలో చేపల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

నగరానికి చేపల దిగుమతి ఇలా..

నగరంలో చేపలకు గల డిమాండ్‌ను బట్టి ఆయా బజార్లకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్ద మొత్తంలో చెరువు చేపలు దిగుమతి అవుతున్నాయి. వారంలో మూడు రోజుల పాటు టన్నులకొద్దీ చేపలు నగరానికి చేరుతాయి. అలాగే జిల్లాలోని డ్యామ్‌ల నుంచి, విజయనగర పరిసర ప్రాంతాల్లోని కొన్ని చెరువుల నుంచి నగరానికి పెద్ద మొత్తంలో చేపలు దిగుమతి అవుతాయి. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి వచ్చే చేపల లోడ్‌లు రాంపురం వద్ద గల హోల్‌సేల్ యార్డుకు... అక్కడ నుంచి నగరంలోని రిటైల్ మార్కెట్‌కు చేరుతాయి. ఈ హోల్‌సేల్ మార్కెట్ నుంచే రిటైల్ వర్తకులు చేపలు కొనుగోలు చేసి ప్రధాన కూడళ్లలో విక్రయిస్తుంటారు.

ఉత్తరాంధ్ర చేపలకు మరింత డిమాండ్

సాధారణంగా ఉభయ గోదావరి జిల్లాల నుంచి నగరానికి వచ్చే చేపలు ఆయా ప్రాంతాల్లోని చెరువుల నుంచి లభించినవే. ఈ చేపలను చెరువుల్లో మేతలు వేసి పెంచుతుంటారు. కాగా ఉమ్మడి విశాఖ జిల్లాలోని మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ డ్యామ్‌తో పాటు తగరపువలస, ఆనందరపురం, దేవరాపల్లితో పాటు ఎస్.కోట ప్రాంతాల్లో గల చెరువులతో పాటు విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల్లో గల చేపల చెరువుల్లో సహజసిద్ధంగా పెరిగిన చేపలకు నగరంలో మంచి గిరాకీ ఉంది. సహజసిద్ధంగా ఏడాది పాటు చెరువుల్లో పెరిగే ఆయా ప్రాంతాల్లోని చేపలు వేసవిలో చెరువులు ఎండిపోతున్న తరుణంలో మార్కెట్లకు తరలిస్తుంటారు. దీంతో ఈ చేపలను ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రాంతాలకు కూడా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఎగుమతి చేయడంతో పాటు నగరంలోని పలు బజార్లలో విక్రయిస్తున్నారు.

ధరలిలా..

ప్రస్తుతం బజార్లలో లభించే బొచ్చు, శీలావతి, బంగారుపాప, జడ్డువ, చందువ.. వంటి రకాల చేపలకు ఎక్కువగా డిమాండ్ ఉంది. ఆయా చేపల సైజును బట్టి మార్కెట్లో ధర ఉంటుంది. వీటిలో సుమారు 5 కిలోల బరువు ఉండే చేపల ధర కాస్త అధికంగా ఉంటుంది. కాగా ఆయా చేపల ధర కిలో రూ.150 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. అయితే చేపల్లో పోషక విలువలు అధికంగా ఉండడంతో మాంసాహారప్రియులు ధరతో సంబంధం లేకుండా వీటిని కొనుగోలు చేస్తుంటారు.

చికెన్ ధరలు పెరగడంతో పెరిగిన చేపల కొనుగోళ్లు

ప్రతి సంవత్సరం వేసవిలో చికెన్ ధరలు కూడా అనూహ్యంగా పెరగడంతో కొనుగోలుదారులు చేపల కొనుగోలుకు మక్కువ చూపుతుంటారు. చికెన్, మటన్ ధరన కన్నా చేపల రేట్లు తక్కువగా ఉంటాయి కాబట్టి వీటి కొనుగోలుకు మాంసాహారప్రియులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో చేపల కొనుగోళ్లు కాస్త జోరుగా సాగుతున్నాయి. సముద్రంలో మత్స్య వేల ప్రారంభమై.. కోళ్ల దిగుబడి కూడా కాస్త పెరిగేంత వరకు చెరువు చేపలకు డిమాండ్ అధికంగానే ఉంటుందని పలువురు వర్తకులు చెబుతున్నారు.

అమరుడైన మురళీనాయక్‌కు నివాళి

మన సైనికులు క్షేమంగా ఉండాలంటూ పలు ఆలయాల్లో బీజేపీ పూజలు



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

మల్కాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో పోరుడుతూ అమరుడైన ఏపీ అగ్నివీర్ మురళీ నాయక్‌కు బీజేపీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీ నాయక్ చిత్రపటానికి బీజేపీ నాయకుడు కాశీవిశ్వనాథరాజు పూలమాల వేసి అంజలి ఘటించాక ములగాడ హౌసింగ్ కాలనీ జంక్షన్ నుంచి గాజువాక ఆర్టీసీ డిపో వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆంజనేయస్వామి, దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భారత్‌మాతాకు జై, మురళీ నాయక్ అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. మురళీ నాయక్ తండ్రి కోరిక మేరకు సత్యసాయి జిల్లాలో అమరుడి విగ్రహాలను పెట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొక్కిలిగడ్డ విజయ్‌బాబు, పి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సైనికుల క్షేమం కోరుతూ ఆలయాల్లో పూజలు

పెదగంట్యాడ: దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో విధుల్లో ఉన్న భారత సైనికుల ఆయురారోగ్యాలతో క్షేమంగా ఉండాలని కోరుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు, కార్యకర్తలు బాలచెరువు శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జీలకర్ర భువనేశ్వరి, 76వ వార్డు అధ్యక్షుడు జె.రమణ, నాయకులు తులసీదాస్, ఎస్.ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: భారత్ సైనికులు క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తూ బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దీనం కొండ కృష్ణంరాజు ఆధ్వర్యంలో 70వ వార్డు డ్రైవర్స్ కాలనీ గల దుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సైనికులకు దేశ ప్రజలందరూ అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్‌కుమార్, బాటా శ్రీనివాస్, పావని, సంతోష్, మొల్లి శ్రీనివాస్, బి.రమేశ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పాత గాజువాకలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: సరిహద్దుల్లో భారత్ సైనికులు క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఎన్ఏడీ ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న శ్రీప్రథమ ఉమామహేశ్వర కుమారస్వామి ఆలయంలో అర్చకులు రామమూర్తిశర్మ ఆధ్వర్యంలో బీజేపీ పశ్చిమ నాయకులు పూజలు జరిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాడి రమేశ్, కె.సత్యనారాయణ, మంజుల, జ్యోతి, అశోక్, గణేశ్, సురేశ్, పి.గణేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు దువ్వాడ రైల్వే స్టేషన్-కాపుజగ్గరాజుపేట రోడ్డుకు మోక్షం



నాడు గోతులమయంగా ఉన్న రహదారి



నేడు విద్యుత్ వెలుగుల మధ్య రోడ్డు ఇలా..

కూర్మన్నపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 86వ వార్డు పరిధి దువ్వాడ రైల్వే స్టేషన్-కాపు జగ్గరాజుపేట మార్గంలో గల రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఒకప్పుడు అధ్వానంగా, పెద్ద పెద్ద గుంతలతో ఛిద్రంగా ఉన్న ఈ రహదారిపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నానాపాట్లు పడేవారు. భారీ గోతులతో పాటు ఈ మార్గంలో వీధి లైట్లు లేకపోవడంతో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉండేది. దీనిపై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు కూడా వచ్చాయి. అయితే ఎట్టకేలకు ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు ఈ మార్గంలో 53 సోలార్ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు దువ్వాడ రైల్వే స్టేషన్ నాలుగో ప్లాట్‌ఫారం నుంచి విజ్ఞాన్ కళాశాల వరకు రోడ్డు నిర్మిస్తుండడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రైల్వే ఉన్నతాధికారులకు దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

ఒరిజినల్ ఆధార్ ఉంటేనే హెచ్‌పీసీఎల్‌లోకి ప్రవేశం

మల్కాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)లోకి ప్రవేశించేందుకు ఒరిజినల్ ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాల్సిందేనని సంస్థ యజమాన్యం ఆదేశాలు జారీ చేసింది. హెచ్‌పీసీఎల్‌లో విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో సంస్థలో స్థానికలతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన వందలాది మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరందరూ ఆధార్ జిరాక్స్ కాపీలను సమర్పించి, పాస్‌లు తయారు చేయించుకుని విధుల్లో చేరిపోయారు. ప్రస్తుతం దేశ సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా అందరూ తప్పనిసరిగా ఒరిజినల్ ఆధార్ కార్డుతో రావాలని సంబంధిత అధికారులు స్పష్టం చేశారు. అంతేకాకుండా ఎవరిపైనైనా ఏమైనా పోలీసు కేసులు ఉంటే అందుకు సంబంధించిన వివరాలతో కూడిన పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్లు కూడా ఉండాలని పేర్కొంది. దీనిపై స్థానిక పోలీసుల నుంచి కూడా విచారణ జరిపించేలా హెచ్‌పీసీఎల్ అధికారులు చర్యలు చేపడుతున్నట్టు తెలిసింది.

రైల్వే స్పోర్ట్స్ కార్యదర్శికి గణబాబు అభినందనలు



ఉషను సత్కరిస్తున్న గణబాబు

గోపాలపట్నం, మే 10(ఆంధ్రజ్యోతి): ఈస్ట్‌కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారిణి, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత ఎన్.ఉషను పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అభినందించారు. శనివారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో ఉష మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను దుశ్శాలువాతో గణబాబు సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

50 శాతం రాయితీపై పశుదాణా

మల్కాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ప్రభుత్వ పశు వైద్యశాలలో 50 శాతం రాయితీపై పశుదాణా విక్రయిస్తున్నట్టు ఆస్పత్రి వైద్యాధికారి సునీల్ తెలిపారు. ఈ రాయితీ పొందాలనుకునే వారు భారత్ పశుధాన్ యాప్‌లో సభ్యులై ఉండడంతో పాటు తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఒక రైతుకు ఒక బ్యాగ్ మాత్రమే ఇవ్వడం జరుగుతుందని, బహిరంగ మార్కెట్లో 50 కిలోల పశుదాణా రూ.1,100 ఉండగా, తాము సబ్సిడీపై రూ.555కు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. విడతల వారీగా 450 కిలోల వరకు దాణా ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాహనం ఢీకొని దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ గోడ



గోపాలపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ డౌన్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ గోడను గుర్తు తెలియని వాహనడం ఢీకొనడంతో దెబ్బతింది. రాత్రి వేళలో ఈ ప్రాంతానికి వచ్చిన గుర్తు తెలియని భారీ వాహనం ట్రాన్స్‌ఫార్మర్ గోడను ఢీకొన్నట్టు స్థానికులు చెబుతున్నారు. శిథిలమైన ఈ గోడను తొలగించడానికి సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



గవర కంచరపాలెం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హరేంధిరప్రసాద్, గణబాబు

రైల్వే ట్రాకుల నిర్మాణ ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్

కంచరపాలెం (ఆర్పీపేట), మే 10 (ఆంధ్రజ్యోతి): నూతన రైల్వే ట్రాకుల నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో 56వ వార్డు పరిధి ఆర్పీపేట, గవర కంచరపాలెం, తదితర ప్రాంతాలను కలెక్టర్ హరేందిర ప్రసాద్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబులు శనివారం పరిశీలించారు. ట్రాకుల ఏర్పాటుతో కోల్పోతున్న ఇళ్లు, స్థలాల వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రైల్వే జోన్ ఏర్పాటు నేపథ్యంలో ట్రాకుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులను చేపట్టాల్సిన ఆవశ్యకతను స్థానికులకు వివరించడంతో పాటు ఎవరికీ నష్టం వాటిల్లకుండా చూస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. గవర కంచరపాలెంలో ట్రాకుల నిర్మాణం కోసం వేసిన మార్కింగ్‌తో ఇక్కడి ప్రజల రాకపోకలకు పూర్తిగా అంతరాయం వాటిల్లుతుందని, అందువల్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లను కల్పించాలని కలెక్టర్‌కు గణబాబు విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులకు స్థానికులు వ్యతిరేకం కాదని, అయితే వారు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రెవెన్యూ, జీవీ ఎంసీ అధికారులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

87వ వార్డులో వృథాగా పోతున్న తాగునీరు



అప్పికొండ వద్ద తాగునీరు కాలువలో కలుస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి అప్పికొండ వద్ద పైపు లైన్ కేజ్ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతూ మురుగు కాలువలో కలుస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజులపాలెం, గవర వీధి, అప్పికొండ పరిసర ప్రాంతాల్లోని పైపు లైన్లకు లీకేజీలు ఏర్పడడంతో నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపు లైన్లకు మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో మదర్స్ డే వేడుకలు

గోపాలపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): మదర్స్ డే వేడుకలను తల్లికి వందనం పేరిట శనివారం గోపాలపట్నం-1 పాఠశాల ప్రాంగణంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. చిన్నారులు తమ తల్లుల పాదాలను కడిగి నమస్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్త మాధవి, తదితరులు పాల్గొన్నారు.



పోర్టు మెయిన్ గేటు వద్ద ఆందోళనకారులతో మాట్లాడుతున్న పోలీసులు

గంగవరం పోర్టు నిర్వాసిత ఉద్యోగుల ఆందోళన

▸▸ **వన్ టైమ్ సెటిల్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్**

▸▸ **పది రోజుల గడువు కోరిన యాజమాన్యం.. ఆందోళన విమరణ**

పెదగంట్యాడ, మే 10 (ఆంధ్రజ్యోతి): వన్ టైమ్ సెటిల్‌మెంట్‌కు సంబంధించిన తమ బకాయిలను తక్షణమే చెల్లించాలంటూ గంగవరం పోర్టు నిర్వాసిత ఉద్యోగులు శనివారం చలో గంగవరం పోర్టు పేరిట ఆందోళన చేపట్టారు. ఈ మేరకు పెద్దసంఖ్యలో వారు పోర్టు ప్రధాన గేటు వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గంగవరం పోర్టు నిర్వాసిత ఉద్యోగుల కమిటీకి చెందిన పలువురు నాయకులు మాట్లాడుతూ వన్ టైమ్ సెటిల్‌మెంట్ ప్రకారం పోర్టు నిర్వాసిత ఉద్యోగులకు రూ.27 లక్షలు చెల్లిస్తామని చెప్పి రూ. 24.80 లక్షలు మాత్రమే ఇచ్చారన్నారు. మిగిలిన మొత్తాన్ని 60 రోజుల్లో ఇస్తామని చెప్పి ఆరు నెలలైనా ఇంకా చెల్లించలేకపోవడం దారుణమన్నారు.

కాగా నిర్వాసిత ఉద్యోగులు గేటు వద్దకు అధిక సంఖ్యలో చేరుకోవడంతో స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. నిర్వాసిత ఉద్యోగులు, యాజమాన్యం చర్చించుకోవాలని పోలీసులు ఇరు వర్గాలకు సూచించారు. దీంతో పోర్టు యాజమాన్యం నిర్వాసిత ఉద్యోగుల కమిటీ నాయకుల్లో పది మందిని చర్చలకు ఆహ్వానించగా, సుమారు రెండు గంటల పాటు చర్చలు జరిగాయి. సమస్యల పరిష్కారానికి పది రోజుల గడువు కావాలని యాజమాన్య ప్రతినిధులు కోరడంతో నాయకులు అంగీకరించడంతో తాత్కాలికంగా ఆందోళనను విరమించారు. చర్చల్లో గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు గణేశ్, అనిల్, నిర్వాసిత ఉద్యోగుల కమిటీ నాయకులు గంటిపిల్లి అమ్మోరు, ఎం.అప్పారావు, నొల్లి తాతారావు, పి.నూకరాజు, కె.సత్యానందం, ఎన్.స్వామి, కె.సత్తియ్య, వాసుపల్లి ఎల్లయ్య పాల్గొన్నారు. ఆందోళన కార్యక్రమంలో వైసీపీ గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాలు, టీడీపీ నాయకుడు కొవిరి హరికృష్ణ, వైసీపీ నాయకుడు ధర్మాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్నకు స్వర్ణ పుష్పార్చన



ఉభయ దేవేరులతో శ్రీవారు

వేపగుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు పరిధి నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువుదీరిన శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి 108 స్వర్ణ పుష్పాలతో అర్చకులు శ్రీనివాసస్వామి అర్చన చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి తెల్లవారుజామున పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరి పారు. సాయంత్రం పలువురు భక్తులు సామూహిక విష్ణుసహస్రనామ పారాయణాన్ని పఠించ దంతో పాటు భక్తి గీతాలను ఆలపించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

వెంకటాద్రిపై సహస్రనామార్చన

పెందుర్తి: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా శ్రీవారి మూలవిరాట్‌కు సహస్రనామార్చన, పూజలతో పాటు నక్షత్ర హారతులిచ్చారు. తొలుత అర్చకులు శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో స్వామివారికి తోమాలసేవ, రాజభోగం, ఆరాధన కార్యక్రమాలను చేపట్టారు.

లక్ష్మీపురంలో ముగిసిన శ్రీవారి కల్యాణోత్సవాలు

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి లక్ష్మీపురం పోర్టు కాలనీలో గల శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 4 రోజులుగా నిర్వహిస్తున్న కల్యాణోత్సవాలు శనివారం సాయంత్రంతో వైభవంగా ముగిశాయి. ఈ సందర్భంగా సుప్రభాత సేవలు, పూజాది కార్యక్రమాలను చేపట్టాక పూర్ణాహుతితో ఉత్సవాలను ముగించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు.

టీడీపీ 66వ వార్డు అధ్యక్షుడిగా గోమాడ వాసు



నూతన కమిటీతో పల్లా శ్రీనివాసరావు, తదితరులు

గాజువాక, మే 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ 66వ వార్డు అధ్యక్షుడిగా గోమాడ వాసు నియమితులయ్యారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో శనివారం వార్డు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వలక్ష్యమన్నారు. గాజువాకను అందరి సహకారంతో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పల్లా అభినందించారు. కాగా వార్డు ప్రధాన కార్యదర్శిగా ఎండీ ముర్తజా, క్లస్టర్ ఇన్‌చార్జిగా సత్యనారాయణ, సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు. నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, పార్టీ రాష్ట్ర పరిశీలకుడు ఎంఎస్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులతో సందడిగా మారిన క్రీడా మైదానం



క్రీడల్లో శిక్షణ పొందుతున్న బాలబాలికలు

అక్కిరెడ్డిపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి) నిత్యం వాహనాల పార్కింగ్‌తో కనిపించే అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ క్రీడా మైదానం శనివారం చిన్నారుల క్రీడలతో సందడిగా మారింది. శాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడల శిక్షణ శిబిరాన్ని శనివారం హైస్కూల్ హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని సూచించారు. వేసవి సెలవులను క్రీడలు, ఇతర రంగాల్లో రాణించేందుకు బాలబాలికలు వినియోగించుకోవాలన్నారు. ఈ శిబిరంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్‌ల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వ్యాయామ ఉపాధ్యాయుడు మహ్మద్ ఇస్మాయిల్ తెలిపారు.

ఆలయ నిర్వహణకు రూ.50,116 విరాళం

అగనంపూడి, మే 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్వహణ నిమిత్తం శ్రీనివాసాచార్యులు, భాను సీతాలక్ష్మి దంపతులు రూ.50,116 విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. దాతలను కమిటీ ప్రతినిధులు సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందజేశారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి కమిటీ ప్రతినిధులు ఎం.ఉమామహేశ్వరరావు, సాయిబ్‌నాయుడు, కృష్ణారావు, నరసింగరావు, సోమశేఖర్, గురునాథ్, సత్యనారాయణ, మోహిని, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన రేపు : యూటీఎఫ్

ఆరిలోవ, మే 10 (ఆంధ్రజ్యోతి) ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 12న విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్టు ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్‌ను యూటీఎఫ్ నేతలు శనివారం కలిసి ధర్నా చేపడుతున్నట్టు నోటీసు అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించని పోంలో ఈ నెల 15న రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టనున్నట్టు వెల్లడించారు.







నేడు తల్లుల దినోత్సవం

నిస్వార్థ ప్రేమకు నిలువెత్తు రూపం అమ్మ

- బిడ్డల బాగోగులు కోరుకునే సహృదయమూర్తి
- తల్లి రుణం తీర్చుకోవడం ప్రతి బిడ్డ బాధ్యత

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): నిస్వార్థమైన ప్రేమకు నిలువెత్తు రూపం అమ్మ. ప్రతి తల్లి తన బిడ్డలు ప్రయోజకులు కావాలని అనుక్షణం పరితపిస్తుంది. ఇందుకోసం ఎన్నో త్యాగాలు చేస్తుంది. తన ఆనందం కంటే పిల్లల సంతోషమే ముఖ్యమని భావిస్తుంది. బిడ్డ పుట్టినప్పటి నుంచి అనునిత్యం కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తుంది. 'ప్రపంచంలో తల్లిని మించిన యోధులు ఎవ్వరూ లేరు' అంటూ ఒక సినిమాలో సంభాషణ రూపంలో వినిపిస్తుంది. బిడ్డల కోసం తల్లి ఒక యోధురాలిగా, సేవకురాలిగా మారుతుంది. ప్రేమనే కాకుండా, తన జీవితాన్నే పంచి ఇచ్చే తల్లి రుణం తీర్చుకోవడం ఎవరికీ సాధ్యం కాకపోయినా, ఆమెను గౌరవంగా, ఆప్యాయంగా చూసుకోవలసిన బాధ్యత కన్నపేగులపై ఉంది. తల్లి పట్ల ఈ బాధ్యతను తెలియజేసేందుకు ఏటా మే రెండో ఆదివారం రోజున మదర్స్ డే వేడుకలను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తుంటారు. 'అందమైనది మాతృత్వం' అన్న థీమ్‌తో ఈ ఏడాది వేడుకలు నిర్వహిస్తున్నారు.

ఇదీ నేపథ్యం..

అమెరికన్ కార్యకర్త అన్నా జార్విస్ తన తల్లి సేవ, త్యాగాన్ని గుర్తించి తొలిసారి 1908లో ఈ వేడుకలు ప్రారంభించారు. ఆ తరువాత 1914లో అమెరికా అధ్యక్షుడు వుడ్రో విల్సన్ మే నెల రెండో ఆదివారం తాను ఆచరించి, అధికారికంగా మదర్స్ డేగా ప్రకటించారు. అప్పటి నుంచి ఏటా ఈ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ రోజున పిల్లలు తమ తల్లులకు ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వడం, వారి సేవ, త్యాగాన్ని గుర్తించి వారితో ఆనందంగా గడుపుతుంటారు. తమకోసం అహర్నిశలు శ్రమించిన తల్లులను సన్మానిస్తుంటారు. కొన్నిచోట్ల అమ్మమ్మలు, నాన్నమ్మలు, దత్తత తీసుకున్న తల్లులు, తల్లి మాదిరిగా సాకే వారితో కూడా ఈ వేడుకలు జరుపుతుంటారు.

అమ్మకు తోడుగా ఉండాలి..

తల్లి ప్రేమను, త్యాగాన్ని గుర్తించడంలో కొందరు విఫలమవుతున్నారు. దీంతో కొందరు తల్లులు చివరి దశలో బిడ్డల ప్రేమకు నోచుకోలేక తల్లడిల్లిపోతుంటారు. వివాహం తరువాత బిడ్డలు కొందరు తల్లిదండ్రులను దూరం పెడుతూ వారి బాగోగులను పట్టించుకోకపోవడం, వారిని



అనాథలుగా వదిలేస్తున్న ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. కొన్నిచోట్ల ఆస్తులు, అంతస్తుల కోసం తల్లిని వేధిస్తున్న దాఖలాలు ఉన్నాయి. తాము ఈ స్థాయికి చేరుకునేందుకు తల్లి చేసిన త్యాగాన్ని, పడిన శ్రమను ఒకసారి గుర్తుచేసుకోవాలి. చివరి దశలో తల్లికి ఆప్యాయతను అందించడం అత్యంత అవసరం. చిన్నప్పుడు నీకు గోరుముద్దలు తినిపించిన తల్లికి.. చివరి దశలో అదే గోరుముద్దలు తినిపించి రుణం తీర్చుకునే అవకాశం ఉందన్న విషయాన్ని ప్రతి బిడ్డ గుర్తించాలి. అలా గుర్తించకపోవడం వల్లే ఎంతో మంది తల్లులు అనేక ఇబ్బందులతో కూడిన జీవనాన్ని సాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

రుణం తీర్చుకో.. నీ గుణం మార్చుకో..

అమ్మ ప్రేమకు వెలకట్టలేము. బిడ్డ పుట్టిన దగ్గర నుంచి ప్రతిఫలం ఆశించక ప్రేమను పంచేది తల్లి మాత్రమే. ప్రేమతోనే ఆ రుణం తీర్చుకోవాలి. తాను చేసే ప్రతి పనిలోనూ బిడ్డ ఆనందాన్ని కోరుకునే తల్లికి.. అంతే గౌరవాన్ని కలిగించేందుకు బిడ్డలు కృషి చేయాలి. అదే తల్లికి ఇచ్చే గొప్ప గౌరవం. కష్ట సమయాల్లో అమ్మకు అండగా ఉండి సేవ చేసుకోవడం ద్వారా అమ్మ ప్రేమకు కొంతైనా రుణం తీర్చుకునే అవకాశం దక్కుతుంది.

బానిస కాదు..

తల్లి బిడ్డపై ప్రేమతో అనేక పనులు చేస్తుంది. అయితే, అమ్మ ప్రేమను చాలా మంది గుర్తించడంలో విఫలమవుతున్నారు. అనేక ఇళ్లల్లో తల్లిని బానిసగా చూస్తుంటారు. అమ్మ జీవితాంతం బిడ్డలకు అన్ని రకాల పనులు చేసే బానిస కాదన్న విషయాన్ని గుర్తించాలి. అమ్మకు ఓపిక ఉన్నంత వరకు ఏదో ఒక పని చేసుకుంటుంది. కానీ, చివరి దశలో అమ్మను కాస్త ప్రేమ, ఆప్యాయతతో చూసుకోవడం ప్రతి బిడ్డ కనీస కర్తవ్యంగా భావించాలి.

మోదకొండమ్మ జాతరకు 50 ప్రత్యేక బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, మే 10 (ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మ జాతరకు విశాఖ రీజియన్ నుంచి 50 ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయించింది. పాడేరులో ఆదివారం నుంచి మూడు రోజులు మోదకొండమ్మ జాతర జరుగనుంది. భారీ ఎత్తున జరిగే ఈ జాతరకు విశాఖ నుంచి ఎక్కువ మంది వెళ్లే అవకాశం ఉండటంతో వారికి రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ఆర్టీసీ విశాఖ రీజియన్ ఈ ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. విశాఖపట్నం, గాజువాక, స్టీల్‌సిటీ డిపోల నుంచి ఈ బస్సులు నడపనున్నట్టు రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం 10, సోమవారం 15, మంగళవారం 25 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఈ మూడు డిపోల నుంచి బస్సులను ఎంపిక చేశారు. జాతరకు వెళ్లే ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉంటే అందుకు తగ్గట్టుగానే అధికంగా ప్రత్యేక సర్వీసులు నడుపుతామని అధికారులు తెలిపారు. డిపో మేనేజర్లు గంగాధర్ (విశాఖపట్నం), ప్రవీణ (గాజువాక), గౌతమ్ చటర్జీ (స్టీల్‌సిటీ) ఈ ప్రత్యేక సర్వీసుల నిర్వహణను పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. మోదకొండమ్మ జాతరకు వెళ్లే వారంతా ఆర్టీసీ కల్పించే ఈ రవాణా సౌకర్యాలు వినియోగించుకోవాలని ఆర్ఎం కోరారు.

శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ మీదుగా శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి: 07421 నంబరుతో రైలు ఈనెల 13, 20 27, జూన్ 3, 10, 17, 24న (ప్రతి మంగళవారం) ఉదయం 6.55 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 7.55కు దువ్వాడ, 10.45 కు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07422 నంబరుతో రైలు ఈ నెల 14, 21, 28, జూన్ 4, 11, 18, 25న (ప్రతి బుధవారం) 00.30 గంటలకు (మంగళవారం అర్ధరాత్రి 12.30 గంటలకు) శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి అదే రోజు (బుధవారం) వేకువజాము 3.20కు దువ్వాడ, మధ్యాహ్నం 3కు చర్లపల్లి చేరుతుందన్నారు. చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి: 07475 నంబరుతో రైలు ఈ నెల 12, 19, 26, జూన్ 2, 9, 16, 23న (ప్రతి సోమవారం) ఉదయం 4.30 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి మధ్యాహ్నం 2.30కు దువ్వాడ, సాయంత్రం 5.30కు శ్రీకాకుళం రోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 07476 నంబరుతో రైలు ఈ నెల 12, 19, 26, జూన్ 2, 9, 16, 23న (ప్రతి సోమవారం) రాత్రి 7.30కు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి రాత్రి 10కి దువ్వాడ, మర్నాడు ఉదయం 9.15కు చర్లపల్లి చేరుతుంది.

బలవంతపు వసూళ్లు వద్దు

- పోలీసు కమిషనర్ బాగ్చి హెచ్చరిక

మహారాణిపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్లు బలవంతపు వసూళ్లకు పాల్పడకూడదని, ట్రాఫిక్ కూడళ్ల వద్ద బాటసారులను డబ్బులు అడగవద్దని నగర పోలీసు కమిషనర్ డా శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. నగరంలో ట్రాన్స్‌జెండర్లు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారంటూ అనేక ఫిర్యాదులు రావటంతో శనివారం పోలీసు కమీషనరేట్‌లో ఆయన ట్రాన్స్‌జెండర్లు, వారి గురువులు, పెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొంతమంది ట్రాన్స్‌జెండర్లు మాట్లాడుతూ కొంతమంది కారణంగా అందరికీ చెడ్డపేరు వస్తోందని వాపోయారు. తాము ఎదుర్కొంటున్న సామాజిక, ఆరోగ్య సమస్యలను కమిషనర్‌కు వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు గౌరవంగా జీవించటానికి ఎటువంటి ఉపాధి కావలసి వచ్చినా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారికి సైతం వైద్య సేవలు అందించేందుకు భరోసా కల్పించారు.



ట్రాన్స్‌జెండర్ల సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

ఇకపై ట్రాఫిక్ జంక్షన్‌లలో వాహనదారుల వద్ద బిక్షాటన పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడరాదని మరోసారి స్పష్టం చేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన ఆర్టీసీ ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకాలు

ద్వారకాబస్‌స్టేషన్, మే 10 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన సేవలే ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుతాయని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. ఏప్రిల్ నెలలో విశాఖ రీజియన్‌లో ఎక్కువ కేఎంపీఎల్, ఆదాయం, ఈపీకే సాధించిన డ్రైవర్లకు, కండక్టర్లకు ఆయన ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం డిపోలో శనివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రయాణికుల రవాణాలో అత్యధిక శాతం వాటా ఆర్టీసీ సాధించే దిశగా ప్రయత్నాలు చేయాలని సిబ్బందికి సూచించారు. మార్గమధ్యంలో బస్సులు బ్రేక్‌డౌన్ కాకుండా చూసుకోవాలని, బస్సులన్నింటినీ పరిశుభ్రంగా నిర్వహించాలని, బస్సులకు ఎటువంటి సాంకేతిక లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని, ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని, ప్రతి స్టాపులోను బస్సులు నిలిపి ప్రయాణికులను బస్సుల్లో కి ఆహ్వానించాలని సిబ్బంది సూచించారు. బస్టాపుల్లోకి ప్రైవేటు వాహనాలేవీ రాకుండా కంట్రోలర్స్ చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖపట్నం డిపో మేనేజర్ గంగాధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్ రామకృష్ణ, సూపర్‌వైజర్లు, గ్యారేజీ సిబ్బంది, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఆర్టీసీ ఆర్ఎం బి.అప్పలనాయుడు

ప్రపంచ శాంతికి ప్రతీకగా నిలవాలి

- పోప్ లియో ఆకాంక్షను తెలియజేసిన విశాఖ అగ్ర పీఠాధిపతి బిషప్ బాలశౌరి

మహారాణిపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): సత్యం, న్యాయం, దయ, కనికరం, సమాధానం, శాంతి, ఐక్యత వంటి విలువలతో ప్రపంచ శాంతికి ప్రతీకగా నిలవాలని పోప్ 14వ లియో పిలుపునిచ్చారని విశాఖ అగ్ర పీఠాధిపతి బిషప్ డాక్టర్ ఉడుముల బాలశౌరి పేర్కొన్నారు. మానవత్వం, సమానత్వం విలువలతో పేదలు, అణగారిన వర్గాల కోసం పోరాడిన న్యాయవాది రోమన్ కాథలిక్ మిషన్ 267వ జగద్గురువు 14వ లియో పరిశుద్ధ పోప్‌గా అభివర్ణించారు. విశాఖలోని సెయింట్ ఆంథోనీ చర్చి ప్రాంగణంలోని ఆర్చ్ బిషప్ కార్యాలయంలో శనివారం తొలిసారిగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలశౌరి మాట్లాడుతూ యుద్ధంలో నలిగిపోతున్న వారిపట్ల ప్రార్థించే ప్రార్థనాపరులని, పునీత్ పేతురు వారసుడు పోప్ 14వ లియో అని పేర్కొన్నారు. ఆయన ప్రపంచ పౌరులందరికీ కాపరిగా దేవుడు ప్రసాదించిన మహోన్నతమైన వరమని అన్నారు. 2015లో అగ్ర పీఠాధిపతిగా, 2023లో కార్డినల్‌గా వ్యవహరించారని, అనంతరం ఈ నెల 8న వాటికన్ పోప్‌గా నియమితులయ్యారని వివరించారు. పోప్ ఎన్నిక ప్రపంచ వ్యాప్తంగా మహాపండుగ అని, ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చర్చిలలో ప్రత్యేకంగా దేవునికి కృతజ్ఞత బలిపూజలు చేయనున్నట్లు తెలిపారు. ఆయన భారత్‌ను సందర్శిస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ , ఫాదర్ కె.జయరాజ్, ఫాదర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ అగ్రపీఠాధిపతి బిషప్ బాలశౌరి

క్రైం... crime news

మద్యానికి బానిసైన యువకుడి ఆత్మహత్య

గోపాలపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గోపాలపట్నం ప్రధాన రహదారికి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇక్కడి నూకాలమ్మ ఆలయ సమీపంలో రెడ్డి పార్వతి అనే మహిళ కుమారుడు రెడ్డి ప్రవీణ్‌కుమార్‌తో పాటు కలిసి ఉంటుంది. పెయింటింగ్ పనులు చేసే ప్రవీణ్‌కుమార్ మద్యానికి బానిసయ్యాడు. కాగా కొద్ది రోజుల నుంచి పనికి కూడా వెళ్లడం లేదు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ప్రవీణ్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కూలి పనికి వెళ్లిన పార్వతి రాత్రి ఇంటికి వచ్చేసరికి కుమారుడు ఉరి వేసుకున్నట్టు చూసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్ఐ అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు రెడ్డి ప్రవీణ్ కుమార్ (ఫైల్ ఫొటో)

15 కిలోల గంజాయితో ఇద్దరు మహిళల అరెస్టు

మద్దిలపాలెం, మే10 (ఆంధ్రజ్యోతి) : గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళలను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఈఎస్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్‌స్పెక్టర్ బి.నాగమణి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల వద్ద ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్టు ప్రొహిబిషన్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో సిబ్బందితో వెళ్లి చూడగా.. అక్కడ ఫాతిమా బీబీ, మిను బీబీ ఉన్నారు. వారిని తనిఖీ చేయగా, 15.23 కిలోల గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు.



గంజాయితో పట్టుబడిన మహిళలు

2 కిలోల గంజాయి స్వాధీనం: ముగ్గురి అరెస్టు

గోపాలపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరితో పాటు దానిని విక్రయించిన వ్యక్తిని గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేయడంతో పాటు రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్ జిల్లాకు చెందిన వి.శ్రీకర్ (25), వి.చందు (25) అనే యువకులు గంజాయి తరలిస్తున్నట్టు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు శనివారం ఉదయం సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద కాపుగాసి వీరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా రెండు కిలోల గంజాయి లభ్యమైంది. వీరికి గంజాయిని విక్రయించిన అల్లూరి జిల్లా గుంబ్రిగుడకు చెందిన దుంబి (25) అనే యువకుడిని కూడా పోలీసులు తీసుకుని, ముగ్గురుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ జి.అప్పారావు ఆధ్వర్యంలో ఎస్ఐలు రామారావు, అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.30 వేల విలువైన ఆరు కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు చేస్తున్న సమయంలో తెలంగాణకు చెందిన కొత్తపల్లి అనోజ్‌కుమార్ (19), ఆలేటి గణేష్ (26), చిలుకరాజు సందీప్ (25)లు హైదరాబాద్‌కు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

భార్య ఆత్మహత్య కేసులో నిందితుడికి రిమాండ్

సీతంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లాడి, కొద్ది కాలం తర్వాత 'నీ బతుకు నువ్వే బతుకు'ంటూ వేధించి ఆమె ఆత్మహత్యకు ప్రేరేపించిన రోహిత్‌కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు విశాఖలోని ద్వారకా పోలీసులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎల్.శ్రావణి ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కొమర రోహిత్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. ద్వారకా సీఐ రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ ధర్మేందర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

రెడ్డిపల్లిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పద్మనాభం, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం.. రెడ్డిపల్లి గ్రామానికి చెందిన బంగారయ్య మామిడి తోటలో ఈనెల 9న సాయంత్రం గుర్తు తెలియని మృతదేహం చూసినట్టు స్థానిక వీఆర్‌ఏ బోని చంద్రరావు పోలీసులకు తెలిపారు. వారు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతదేహంపై గులాబీ రంగు గడు ఉన్న నీలం రంగు హాఫ్ హేండ్ షర్టు, తెల్ల చుక్కలు కలిగిన నేవీ బ్లూ ప్యాంటు ఉంది. వీఆర్‌ఏ ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సీఐ శ్రీధర్, ఎస్సై సురేశ్ సెల్ నంబర్లు 9490617920, 91770 68006 సంప్రతించాలని సూచించారు.



రెడ్డిపల్లి తోటలో లభ్యమైన మృతదేహం

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- నిర్మాణంలో ఉన్న షాపింగ్ మాల్‌లో ఘటన
- బయటకు పొక్కనీయకుండా యాజమాన్యం జాగ్రత్తలు

కంచరపాలెం, మే 10 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న ఓ షాపింగ్ మాల్‌లో అనుమానాస్పదంగా యువకుడు శనివారం మృతిచెందిన ఘటన కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అయితే ఈ విషయాన్ని షాపింగ్ మాల్ యాజమాన్యం గోప్యంగా ఉంచడం విశేషం. సంఘటన జరిగిన విషయం కంచరపాలెం పోలీసులకు తెలిసినా తెలియనట్టు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఐదో పట్టణ పోలీసుస్టేషన్‌కు సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని ఓ షాపింగ్‌మాల్ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. పగటిపూటే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణ కార్మికులతో రాత్రిపూట కూడా యాజమాన్యం పనిచేయిస్తోంది. ఈ తరుణంలో శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో భవన నిర్మాణ కార్మికుడు (యువకుడు) పనిచేస్తూ ఉండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. విషయం బయటకు పొక్కనీయకుండా యాజమాన్యం అతని మృతదేహాన్ని ఆటోలో గప్‌చుప్‌గా తరలించింది. భవన నిర్మాణ కార్మికుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించినట్టు తెలిసింది.

మాజీ సైనికుడిని విచారించిన పోలీసులు

కొమ్మాది, మే 10 (ఆంధ్రజ్యోతి) : భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో ఎవరు అనుమానాస్పదంగా కనిపించినా ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నగరంలో రెండు రోజులుగా పెద్ద గుబురు గడ్డం ఉన్న వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ.. కీలకమైన ప్రదేశాలను ఫొటోలు తీస్తున్న సంఘటనలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ విషయం సీపీ శంఖబ్రత బాగ్చీ దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించారు. అతను ఎక్కడ ఉన్నా.. వెంటనే పట్టుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద సిసి పుటేజీలను పరిశీలిస్తుండగా అతను పీఎంపాలెం వైపు వెళుతున్న బస్సు ఎక్కినట్టు గుర్తించి, అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కార్‌షెడ్ కూడలిలో బస్సును ఆపి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నార్త్ జోన్ ఏసీపీ అప్పలరాజు ఆధ్వర్యంలో విచారించగా విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం పక్కి గ్రామానికి చెందిన పెంకి ప్రవీణ్‌కుమార్‌గా గుర్తించారు. అతను 2023 డిసెంబరు వరకూ ఆర్మీలో పనిచేసి రిటైర్ అయినట్టు తెలుసుకున్నారు. అతనికి తల్లిదండ్రులు, అన్నదమ్ములు ఉన్నట్టు గుర్తించి, వారితో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన ఆర్మీ నుంచి రిటైర్ అయ్యి వచ్చిన తరువాత మానసిక పరిస్థితి సరిగ్గా లేదని, ఒక్కడే అలా తిరుగుతూ ఉండాడని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో పోలీసులు అతన్ని బంధువులకు అప్పగించారు.